ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్
: fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 329 పేజీలు: 10+4 వెల: 6.50

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## అసెంబ్లీ 2కు
# వాయిదా
### తొలిరోజు సజావుగా సాగిన సభ

**ఇటు సిఎం రేవంత్, అటు కెసిఆర్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం**

**జనవరి ఏడో తేదీదాకా సభ జరపాలని బిఎసి నిర్ణయం**

**గోదావరి, కృష్ణా జలాలపై సమావేశాలలో చర్చకు వ్యూహం**


సోమవారం అసెంబ్లీలో కెసిఆర్ వద్దకు వెళ్లి పలకరిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** శీతాకాల అసెంబ్లీ.మండలి సమావేశాలు తొలి రోజు ఉదయం 10.30 నిమిషాలకు ప్రారంభమయ్యాయి. రెండు సభలకు అధికార పక్షం సభ్యులతో పాటు విపక్షాల సభ్యులు హాజరయ్యారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాతో హాజరు కాగా, బిఆర్ఎస్ సభ్యులు గులాబీ కండువాలతో హాజరయ్యారు. బిజెపి సభ్యులు కాషాయం కండువాలు వేసుకుని వచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు ఉదయం రాగానే అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. బిఆర్ఎస్ అధినేత, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రరావు అసెంబ్లీలోకి రాగానే అసెంబ్లీలోని ఛాంబర్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశం అయ్యారు. ఇదే సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి కూడా తన ఛాంబర్‌లో మంత్రులు,విప్‌లతో సమావేశమై అసెంబ్లీలో చర్చల అజెండాను పరిశీలించి, విపక్షాల తీరుపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. తొలుత ఇటీవల మరణించిన దివంగత మాజీ ఎమ్మెల్యే, మండలి సభ్యులకు సంతాపం ప్రకటించింది. అనంతరం పలు ఆర్డినెన్స్‌లను ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్‌ను కొనసాగించారు. ఈ క్రమంలో అన్ని పార్టీలకు చెందిన పలువురు సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల మంత్రులు సభ్యులు లేవనెత్తిన అంశాలను నోట్ చేసుకోవడంతో పాటు త్వరలోనే రాత పూర్వక సమాధానం ఇస్తామని చెప్పారు. రెండున్నర గంటలపాటు అసెంబ్లీ సమావేశాలు జరగా, గంటన్నర పాటు శాసనమండలి సమావేశాలు జరిగాయి. అనంతరం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిఏసీ

>>2

2

## ఎలా ఉన్నారు!
ఆరోగ్యం బాగుందా..
కెసిఆర్‌తో సిఎం రేవంత్ కరచాలనం

## అసెంబ్లీ ఆవరణలో
# 'తెలంగాణ తల్లి'
### విగ్రహం ఏర్పాటుకు సిఎం రేవంత్ నిర్ణయం

**పార్లమెంటు తరహాలో సెంట్రల్ హాలు**

**మండలి పునరుద్ధరణ పనులు పరిశీలించిన సిఎం**


మండలి పనులు పరిశీలిస్తున్న సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్, గాంధీ విగ్రహాల నడుమ తెలంగాణ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలకు సూచించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత కొద్దిసేపు అసెంబ్లీ ఆవరణలో కలియ తిరగడంతో పాటు శాసనమండలి కోసం ఏర్పాటు చేస్తున్న పాత అసెంబ్లీ భవనంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి మరమ్మత్తుల పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా జరగాలని ఇంజనీర్లకు సూచించారు. పనుల నాణ్యత,వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సభ్యులకు

>>2

## అబద్ధాల పునాదులపై
# బతుకుతున్న బిఆర్ఎస్



**పాలమూరు- రంగారెడ్డిని కావాలనే గత ప్రభుత్వం జాప్యం చేసింది**

**మీడియాతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్,డిసెంబరు 29,ప్రభాతవార్త:** అబద్ధపు పునాదుల మీదే బిఆర్ఎస్ బతుకుతోందని కృష్ణాజలాలలో మేం పాలమూరు రంగారెడ్డికి 90టిఎంసిలు డిమాండ్ చేస్తే 45 టిఎంసిలు మాత్రమే అడిగామని దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. సోమవారం చిట్‌చాట్‌లో పాతజివో కాపిలను మంత్రి ఉత్తమ్

>>2

2


అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను సోమవారం అరెస్టుచేసి తరలిస్తున్న పోలీసులు

## మాజీ సర్పంచ్‌ల ఛలో అసెంబ్లీ ఉద్రిక్తం

## ఫ్యూచర్ సిటీకి పోలీసు కమిషనరేట్
### సిపిగా సుధీర్‌బాబు నియామకం

**సైబరాబాద్ సిపిగా ఎం. రమేష్, మల్కాజ్‌గిరి సిపిగా అవినాష్, యాదాద్రి ఎస్పీగా ఆకాంక్ష్ యాదవ్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** పునర్ వ్యవస్థీకరించిన జీహెచ్‌ఎంసీతో పాటు ఫ్యూచర్ సిటీతో కలిపి పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేయడం జరిగింది. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దేందుకు పలు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్,ప్యూర్, రేర్ అని

>>2





నమ్మకం
- ధృవీకరించబడిన కారు చరిత్ర**
- 3 ఉచిత సేవలు** పొందండి @ 5000++ మారుతి సుజుకీ సర్వీస్ స్టేషన్స్

నాణ్యత
- 376 నాణ్యతాపరమైన తనిఖీ పాయింట్స్
- 1 సంవత్సరం వరకు వారంటీ**

True Value యాప్‌ను ఇక్కడ డౌన్‌లోడ్ చేసుకోండి
TRUE VALUE CERTIFIED
విచారణ కోసం కాల్ చేయండి 1800 102 1800 | సందర్శించండి www.marutisuzukitruevalue.com

**Karimnagar: Adarsha Autoworld:** 7337442380 | **Varun Motors**: 9640248417 | **Adarsha Automotives**: 7799784428 **Warangal: Adarsha Automotives, Hanamkonda** : 8886236633 | **Win Motors**: 8688827044 | **Adarsha Auto World**: 9133382182 | **Nalgonda: Pavan Motor**: 8790902165 | **Nizamabad: Varun Motor**: 9052901777 | **Mahabubnagar: Sri Jayarama Motors**: 9642826963.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.



సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో సిఎం రేవంత్‌కు స్వాగతం పలుకుతున్న ఏపి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్

# అసెంబ్లీ ఆవరణలో 'తెలంగాణతల్లి'

>> సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో అసెంబ్లీ భవనం ఆవరణ పరిధిలోనే మండలి భవనం ఏర్పాటవుతున్నందున రెండింటికి కలిపి సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయాలని శాసనమండలి సెక్రెటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి ఆర్.తిరుపతిలకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ అధికారులకు సిఎం స్వయంగా తగు సూచనలు చేశారు. అసెంబ్లీ ఆవరణ మ్యాపులపై స్కెచ్ పెన్నుతో రౌండప్‌లు చేస్తూ సిఎం తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేయాలని చెప్పారు. పార్లమెంట్ సెంట్రల్ తరహాలో అసెంబ్లీ లాబీల్లో సెంట్రల్ హాల్ కోసం లాంజ్‌లను ఎలా విస్తరింప చేయాలో చెప్పారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. అసెంబ్లీలో సభ ప్రారంభమయ్యే ముందు విపక్ష నేత బిఆర్‌ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సిఎం రేవంత్‌రెడ్డి దగ్గరకు స్వయంగా వెళ్లి కరచాలనం చేశారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగారు.

దానిపై మీడియా ప్రతినిధులు కెసిఆర్‌తో మీరేం మాట్లాడారు సార్ అని ప్రశ్నించగా ఏం మాట్లాడకుండ మీకెందుకు చెప్పాలి సమాధానం ఇచ్చారు. సభ నాయకుడిగా అందరినీ చూసుకోవాలి కదా అని పేర్కొన్నారు. అయినా కెసిఆర్‌ను కలిసింది మొదటి సారి కాదు, రెండోసారి అనుకుంటాను కూడా కలిశాను పేర్కొన్నారు. సభ ప్రారంభమైన కొద్ది సేపటికే కెసిఆర్ వెంటనే ఎందుకు బయటకు వెళ్లారని ప్రశ్నించగా ఆయననే అడగండి అని చెప్పారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే లోగా శాసనమండలి కోసం ఏర్పాటు చేస్తున్న భవన మరమ్మతుల పనులు పూర్తి చేస్తామన్నారు.

సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయడం వల్ల ఎమ్మెల్యేలు,మంత్రులకు యాక్సెస్ ఉంటుందని, ప్రతి సభ్యుడిని గౌరవిస్తామని చెప్పారు.మాజీ ఎమ్మెల్యేలకు కూడా సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# మాజీ సర్పంచ్‌ల ఛలో అసెంబ్లీ ఉద్రిక్తం

## రెండేళ్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం మాజీ సర్పంచులు సోమవారం నాడు చేట ట్టిన ఛలో అసెంబ్లీని పోలీసులు అడ్డుకున్నారు. ఇందిరా పార్క్ నుంచి అసెంబ్లీకి బయలుదేరిన మాజీ సర్పంచులను ట్యాంక్ బండ్ వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల జేఏసీ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలో వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదని వాపో యారు. అధికారంలో వచ్చిన వెంటనే తమ డిమాండ్లను పరిష్కరిస్తామని రేవంత్ రెడ్డి సర్కారు హామీ ఇచ్చిందని, ఆ తరువాత దీని గురించి మరచిపోయిందని వారు ఆవేదన చెందారు. తమ డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తే ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుందని, కొందరు మాజీ సర్పంచ్‌లను హైదరాబాద్ వచ్చే మార్గంలోనే అరెస్టు చేసిందని, ఇ ది అన్యాయమని వారు వాపోయారు.

గ్రామాల్లో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేసిన తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరా రు. ప్రజా పాలనలో తమ డిమాండ్లు తీరుస్తామని ప్రభుత్వం హామీఇచ్చి దానిని విస్మరించిందని వారు వాపోయారు. తమపై సర్కారు ఆరా రణంగా కక్ష గట్టిందని వారు తెలిపారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా చేస్తున్న పోరాటంలో కొందరు చనిపోయారని, అయి నా తమ పోరు ఆగదేని, భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుందని వారు తెలిపా రు. కాగా అరెస్టయిన వారిని పోలీసులు పలు పోలీసుస్టేషన్లకు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# అసెంబ్లీ వాయిదా

>> సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బిఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం శాసనమండలిలోని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఛాంబర్‌లో బిఏసీ సమావేశం జరిగింది. కాగా, మండలి బిఏసీ సమావేశంలో పాల్గొనేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీ నుంచి నడుచుకుంటూ వెళ్లారు. మండలిలో కూడా ప్రస్తుతానికి వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బిఏసీ సమావేశంలో నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలు,మండలి సమావేశాలు జనవరి 2వ తేదీకి వాయిదా పడ్డాయి. జనవరి 7వ తేదీదాకా సమావేశాల నిర్వహణకు బిఏసి నిర్ణయించింది. కాగా తొలి రోజు అసెంబ్లీ, మండలి సమావేశాలు సజావుగా జరగాయి. రెండు సభల్లోనూ ఎలాంటి ఉద్రిక్తలు చోటు చేసుకోలేదు. 2వ తేదీ నుంచి రెండు సభల్లోనూ అధికార,విపక్ష సభ్యులు గోదావరి,కృష్ణా జలాలపై చర్చించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎవరికి వారుగా వ్యూహాలు రూపొందించుకుంటున్నారు. అధికార పక్షం 2వ తేదీన అసెంబ్లీలో జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతుంది, తమకు కూడా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వాలని బిఆర్‌ఎస్ స్పీకర్‌కు వినతి పత్రం అందజేసింది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే సభను బాయ్‌కాట్ చేస్తామని బిఆర్‌ఎస్‌ఎల్పీ స్పష్టం చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జనవరి 1న ప్రజా భవన్‌లో సిఎంతో పాటు మంత్రులు,కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి మార్పులు,చేర్పులు సూచనలు తీసుకుంటారు. అనుమతి ఇస్తే అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసేందుకు బిఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు సన్నద్ధమవుతున్నారు.

# ఎలా ఉన్నారు!

## ఆరోగ్యం బాగుందా..

## కెసిఆర్‌తో సిఎం రేవంత్ కరచాలనం

**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభలో సోమవారం ఆసక్తి కరమైన సంఘటన ఆవిష్కృతం అయింది. సభానాయకుడు రేవంత్‌రెడ్డి 10:33 నిమిషాలకు ప్రతిపక్షనేత కెసిఆర్‌వైపు వడి వడిగా వచ్చి కరచాలనం చేసి నమస్తే బాగున్నారా? ఆరోగ్యం ఎలా ఉందని యోగక్షేమాలను తెలుసుకోవడానికి కుశల ప్రశ్నలులతో పలకరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనవైపు వస్తుండటంతో కెసిఆర్ తన సీటులోంచి లేచి రెండు చేతులు జోడించి అభివాదం చేశారు. సభానా యకుడు ప్రతిపక్షనాయకుడు పలకరించుకోనే ఆసక్తికరమైన సన్నివేశం జరుగుతుంటే కెటిఆర్, పాడి కౌశిక్ రెడ్డి తప్ప సభలోని సభ్యులు అంతా లేచి నిల్చుని వీక్షించారు. మంత్రి వాకాటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, బీర్లఐలయ్యలతో కలిసి కెసిఆర్ వద్దకు వచ్చి రేవంత్‌రెడ్డి పలకరిం చారు. అదే సమయంలో కెసిఆర్‌కు పక్కన ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎడమవైపు మరో వరుసలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగులకమలాకర్ కూర్చొని ఉన్నారు. తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పంచా యతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క,శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు నూతనంగా ఎన్నికైన జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ కెసిఆర్ వద్దకు వచ్చి కరచాలనం చేసి పలకరించి వెళ్ళిపోయారు. కెసిఆర్ రెండేళ్లలో అసెంబ్లీకి ముచ్చటగా మూడోసారి వచ్చారు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేసిన అనంతరం జీరో అవర్ ప్రారంభం కాకముందు శీతాకాల సమావేశాలకు హాజరైన ప్రతిపక్ష నేత కెసిఆర్ 28నిమిషాల మాత్రమే సభలో ఉండి వెళ్లిపోయారు. జనగనమణ జాతీయ గీతం ఆలాపన అనంతరం జిరో అవర్ ప్రారంభమైంది. నది జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతల మధ్య కృష్ణాజలాల పంపిణీ విషయంలో మాటల యుద్ధం జరుగుతోన్నది.

## వారం - వర్జ్యం

30-12-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
దశమి ఉ.7.50, ఏకాదశి తె.5.01
భరణి రా.3.56, పూర్వాషాఢ కార్తె
వర్జ్యం : మ.2.42-4.08
దు.ఉ.8,50-9.35
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** సకుటుంబ సమేతంగా దూర ప్రాంత ప్రయాణాలు చేస్తారు. మొండితనం కన్నా సర్దుకుపోవటమే మేలు.

**వృషభం:** వ్యక్తిగత సమస్యల నుండి బయట పడతారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వస్త్రలాభం.

**మిథునం:** నూతన ప్రయత్నాలు లాభి స్తాయి. ఎదుటివారి విషయంలో జోక్యం వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**కర్కాటకం :** ఉద్యోగంలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారు ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుకుంటారు ధనలాభం.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు ముమ్మరం చేస్తారు. వస్తు కొనుగోలు.

**తుల :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు. ఆస్తివివాదాలు పరిష్కారమై లబ్ది పొందుతారు.

**వృశ్చికం:** దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి. జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**ధనుస్సు:** ఉద్యోగులకు పదోన్నతులు, విదేశీపర్యటనలు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మకరం:** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం:** చేపట్టిన పనులు సాఫీగా సాగుతాయి. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. సోదరుల కలయిక.

**మీనం :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్



నింగిలోకి దూసుకెళ్తున్న సోయుజ్ 2.1

# ఒకేసారి అంతరిక్షంలోకి 52 ఉపగ్రహాలు

## రష్యా స్పేస్ ఏజెన్సీ అద్భుత ప్రయోగం

**మాస్కో, డిసెంబరు 29:** రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ తన ప్రయోగాల్లోభాగంగా విదేశీ ఉపగ్రహాలతోపాటు రష్యా తయారీ ఉపగ్రహాలు భారీ సంఖ్యలో కక్ష్యలోకి పంపించింది. సోమవారం వోస్టోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి సోయుజ్ 2.1 వాహకనౌక ద్వారా ఒకేసారి 52 ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కోసం రూపొందించిన ఒక విద్యా ఉపగ్రహం కూడా ఉంది. యూఏఈకి చెందిన క్యూఎంఆర్-కెడబ్ల్యుటి-2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. రష్యా, యూఏఈ, కువైట్ మధ్య సహకారాన్ని పెంచడంతో పాటు అరబ్ దేశాల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించడం, అమెచ్యూర్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ సేవలు అందించడం ఈ ఉపగ్రహం ముఖ్య ఉద్దేశమని స్పుత్నిక్స్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు. వీటితో పాటు సముద్రంలో నౌకల కదలికలను గుర్తించేందుకు రష్యా తన శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఎఐఎస్) వ్యవస్థను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా పదుల సంఖ్యలో క్యూబ్‌శాట్ 3యు ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీని పరీక్షించేందుకు సిట్రోటీడీ ఉపగ్రహాలను కూడా ప్రయోగించినట్లు కంపెనీ పేర్కొంది. ఈ ప్రయోగంలో ఏఐఎస్‌టీ2టీ సిరీస్‌కు చెందిన రెండు ఉపగ్రహాలు ప్రధానమైనవి. ఇవి భూమి ఉపరితలాన్ని ఫోటోలు తీసి, డిజిటల్ మ్యాప్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. అగ్నిప్రమాదాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను పర్యవేక్షించేందుకు కూడా ఉపయోగపడతాయి. కనీసం ఐదేళ్ల పాటు పనిచేసేలా ఈ ఉపగ్రహాలను రూపొందించారు.

# అసెంబ్లీలో అలర్ట్‌గా ఉండండి: మంత్రులు, విప్‌లతో సిఎం భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాయిదా పడిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం తన ఛాంబర్ మంత్రులు,విప్‌లతో సమావేశం నిర్వహించారు. దాదాపు గంట పాటు మంత్రులతో సిఎం భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నీటి వాటాల విషయంఒల మంత్రులు అందరూ అలర్ట్‌గా ఉండాలని సిఎం ఆదేశించినట్లు తెలిసింది. బిఆర్‌ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్దం కావాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్దం కావాలని సూచించారు. సభలో పాయింట్ ఆప్ ఆర్డర్ ముఖ్యం అని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు.

# ఫ్యూచర్ సిటీకి పోలీసు కమిషనరేట్

>> మూడు భాగాలుగా విభజించి, ప్రతీ ప్రాంతానికి ఒక ప్రత్యేక వ్యూహం, ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి అతి ముఖ్యమైన ఓఆర్‌ఆర్ లోపలి 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలుపుతూ చట్టపరమైన మార్పులు చేసింది. ఈ వ్యూహం ద్వారా ఈ ప్రాంతంలో ఒక ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంది. జీహెచ్‌ఎంసీ ప్రాంతాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్ వ్యవస్థీకరించారు. ఇదే విధంగా ఇతర శాఖలను పునర్ వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మెరుగైన సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగాంగా పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న మూడు కమిషనరేట్లను పునర్ వ్యవస్థీకరిస్తూ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, బేగంపేట, శంషాబాద్ ఎయిర్ పోర్టు, బుద్వేల్ హైకోర్టు లాంటి కీలక ప్రాంతాలను హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ ప్రాంతాలు గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్ రామ్ గూడ, మాదాపూర్, రాయదుర్గ్, పారిశ్రామిక ప్రాంతాలు పఠాన్ చెరు, జీనోమ్ వ్యాలీ, ఆర్‌సి పురం, అమీన్ పూర్ తదితర ప్రాంతాలు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండనున్నాయి. రాచకొండ కమిషనరేట్‌ను పునర్ వ్యవస్థీకరించి మల్కాజ్‌గిరి పేరుతో కొత్త కమిషనరేట్ ను ఏర్పాటు చేశారు. కీసర, శామీర్ పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి తదితర ప్రాంతాలు ఈ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయి. ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో ఉన్న భువనగిరిని ప్రత్యేక పోలీస్ యూనిట్ గా ఏర్పాటు చేసి యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి తీసుకు వచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు కమీషనరేట్లకు పోలీస్ కమిషనర్లను, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్పులు చేసిన కమిషనరేట్లకు ఐపిఎస్‌లను నియమించారు. రాచకొండ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సుధీర్‌బాబును బదిలీ చేసి కొత్తగా ఏర్పడిన ఫ్యూచర్ సిటీ సీపీగా నియమించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న అవినాష్ మహంతిని బదిలీ చేసి కొత్తగా ఏర్పడిన మల్కాజగిరి సీపీగా నియమించారు. సైబరాబాద్ సిపీగా డాక్టర్ ఎం. రమేశ్‌ను నియమించారు. రాచకొండ పరిధిలోని భువనగిరి డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఆకాంక్ష్ యాదవ్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా యమితులయ్యారు.

# సభలో కెసిఆర్‌ను కలిసేంత సంస్కారం సిఎంకు ఉంటే చాలు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ఉదయం అసెంబ్లీకి వచ్చిన విషయం తెలిసిందే. సభలో తన సీటులో కూర్చున్న కేసీఆర్ వద్దకు వెళ్లి మరీ సీఎం రేవంత్ రెడ్డి పలకరించడం, ఆయనతో కరచాలనం చేసి ఆరోగ్యం గురించి వాకబు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రికి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని, అయితే, ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే ఇంకా బాగుంటుందని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గౌరవం ఉందని కేటీఆర్ చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో రంధ్రాన్వేషణ మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పనులను ప్రభుత్వం చేయటంలేదని ఆరోపించారు.




బీహార్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు వ్యతిరేకంగా పాట్నాలో సోమవారం అందోళన చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

# అబద్ధాల పునాదులపై బతుకుతున్న బిఆర్‌ఎస్

>> కుమార్‌రెడ్డి పాత జివో కాపిలను చూపారు. నీటిపారుదలశాఖలో తనకు తాను హరీష్‌రావు మాస్టర్ గా భావించుకొంటున్నారని ఆయన అన్నారు.ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు కృష్ణా లో 299 టిఎంసి లకు కట్టుబడి ఉంటామని ఆపెక్స్ కౌన్సిల్ లో ఒప్పుకున్నారనితెలిపారు.పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని నార్లపూర్, ఎదుల లింక్ పనులు కూడా ఆపేశారని ఆయన ఆవేద చెందారు.రూ.2 వేల కోట్లతో ఖర్చు చేస్తే పూర్తి అయ్యే ఎస్‌ఎల్‌బిసి విషయం లో నిరక్ష ్యం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు కు లక్ష కోట్లు ఖర్చు చేసి పాలమూరు జిల్లా ప్రాజెక్టు లకు కు మాత్రం మొండి చేయి చూపారని ఆరోపించారు.కల్వకుర్తి 900 కోట్లు ఖర్చు చేస్తే పూర్తి అయ్యేదని కానీ చేయలేదని ఆయన అన్నారు.ఇరిగేషన్ మీద 1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినాపాలమూరు లోని పెండింగ్ లో నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా పెండింగ్ లోనే ఉన్నాయనీ ఆవేదన చెందారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లా లకు అన్యాయం అంటూ బిఆర్‌ఎస్ గ్లోబల్స్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.హరీష్ రావు ను చూసి గ్లోబల్స్ కూడా సిగ్గుతో తలదించుకుంటున్నాడని అన్నారు. పాలమూరు - రంగా రెడ్డి లో 90 టిఎంసిలకు ప్రతిపాదించారు. దాన్ని మేము ముందుకు వెళ్తున్నాం.45 టిఎంసి మైనర్ ఇరిగేషన్, 45 టిఎంసి గోదావరి డైవర్షన్ అని వాడారని తెలిపారు. వాళ్లు ఇచ్చిన జీవో నే మేము ప్రస్తావిస్తూ మేం లేఖ రాశామని ఆయన చెప్పారు.మొదటగా మా సేవింగ్ ఉన్న.. 45 టిఎంసి ల మైనర్ ఇరిగేషన్ ను క్లియర్ చేయమని అడిగామని వివరించారు.పేజ్ 1 లో ఇనిషియల్ గా చేయమని అడిగామని బిఆర్‌ఎస్ నేతలు మాత్రం సుప్రీం కోర్టు లో 7 టిఎంసి లకు ఒప్పుకొని వచ్చారని ఆయన చెప్పారు.మీరు పదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారని మేము మాత్రం పూర్తి చేసి పాలమూరు ప్రాంతానికి నీరు అందిస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. మీ చేతకాని తనాన్ని మాపై రుద్దవద్దని ఉత్తమ్ కోరారు. మసిపూసి మారేడుకాయ చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనీ పాలమూరు రంగారెడ్డి డిపిఆర్ కేంద్రానికి పంపడానికి 7 ఏళ్ళు టైం తీసుకున్నారనీ అప్పటికే రూ. 21 వేల కోట్లు ఖర్చు చేశారని ఆయన చెప్పారు. పాలమూరు రంగా రెడ్డి లో పదేళ్ల కాలంలో 21 వేల కోట్ల పనులు మాత్రమే చేశారనీ, సిడబ్ల్యుసి కి డిపిఆర్ పంపే టైం కు 65 వేల కోట్ల అంచనా పేర్కొన్నారని వివరించారు. మొదట్లో 35 వేల కోట్ల అంచనా తో ప్రాజెక్టు స్టార్ట్ చేశారు.దిగి పోయే టైం కు 27 వేల కోట్లు ఖర్చు చేశారు. 65 వేల కోట్ల కు 27 మాత్రమే ఖర్చు చేశారు.ఆయకట్టు కాల్వ లకు భూసేకరణ చేయాలంటే మొత్తం కలిపి 70 వేల కోట్లు అవుతుంది.35 శాతం ఖర్చు చేసి,80 శాతం చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటు.మేము రెండేళ్లలో 7 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన గణాంకాలతో మొత్తం వివరించారు. బిఆర్‌ఎస్ హయాంలో ఒక్కటే పంపు పెడితే, మేము వచ్చాక 11 మోటర్లు పెట్టామన్నారు.పాలమూరు కు 35 వేల కోట్లు,కాళేశ్వరం కు లక్ష కోట్లు ఖర్చు చేశారని మీకు పాలమూరు మీద ఎందుకు అంత వివక్ష అని ప్రశ్నించారు.పాలమూరు - రంగా రెడ్డి కి వ్యతిరేకంగా పనిచేసేనిఆరోపించారు.

# సభలో చర్చ కోసం 11 బిల్లులను ప్రవేశపెట్టిన సిఎం, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** జిరో అవర్ ప్రారంభానికి ముందు పదకొండు బిల్లుల పత్రాలు సభాసమక్షంలో మంత్రులు ప్రవేశపెట్టారు. తెలంగాణ వస్తు సేవలప్పు ఆర్డినెన్స్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ సవరణార్డినెన్స్ తెలంగాణ పురపాలిక ఆర్డినెన్స్, హైదరాబాద్‌మహానగర పాలక సంస్థ రెండవ సవరణ ఆర్డినెన్స్, 2023-24 తెలంగాణ ఆడిట్ నివేదిక, 2023-24 పిఎం స్కూల్‌ఫర్‌రైసింద్ ఇండియా ఆడిట్ నివేదికలు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారు. తెలంగాణపబ్లిక్ సర్వీసుకమీషన్ నియామకాలు క్రమబద్ధీకరణ సిబ్బంది తీరు వేతన హేతుబద్ధత ఆర్డినెన్స్-2025,ఆర్డినెన్స్ 8 డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సభ ముందు సమర్పించారు. మంత్రి దనసూరి అనుసూయ తెలంగాణ పంచాయతీరాజ్ మూడవ సవరణ ఆర్డినెన్స్ ఎంపిపి జడ్పీటిసి గెజిట్‌నెంబరు 29 సభకు సమర్పించారు. తెలంగాణ ఉద్యనఅబివృద్ధి వార్షికనివేదిక లెక్కలు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సభ ముందు పెట్టారు.బీఎస్టీ సవరణల ఆర్డినెన్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మొదటి, రెండో సవరణల ఆర్డినెన్స్‌లు, పురపాలక సంఘాల సవరణల ఆర్డినెన్స్, తెలంగాణ సమగ్ర శిక్షా ఆడిట్ నివేదిక, పీఎం స్కూల్ రైజింగ్ ఇండియా ఆడిట్ రిపోర్ట్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణల ఆర్డినెన్స్‌లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణల ఆర్డినెన్స్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఉభయసభల్లో ప్రవేశ పెట్టారు. ఆయా ఆర్డినెన్స్‌ల ద్వారా తెచ్చిన సవరణలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రస్తుత సమావేశాల్లో బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు చెందిన సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు రెండు గంటలు శాసనసభ సాగింది.

# భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్29:** ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని వాటి పరిరక్షణలో ఎలాంటి నిరక్ష్యానికి తావులేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, స్మశానవాటికలు తదితర అంశాలపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు స్మశాన వాటికలు లేక ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్ సమన్వయంతో అధిగమించాలని అధికారులకు సూచించారు.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన, విషపూరితమైన పొగమంచు కప్పేసింది. దృశ్యమానత తగ్గిపోయింది. నోయిడాలోని ఎయిమ్స్ ఫ్లైఓవర్, సెక్టార్ 37తో సహా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని అనేక ప్రాంతాలు దట్టమైన పొగమంచుతో కప్పబడి కనిపించాయి. వాహనాలు పొంగమంచు గుండా నిదానంగా కదిలాయి. హెడ్‌లైట్లు వేసుకుని జాగ్రత్తగా నడిపారు. అటు గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలో నమోదైయింది. నగరం మొత్తం ఎక్యూఐ 403 వద్ద నమోదైంది. 25 పర్యవేక్షణ స్టేషన్లలో ఎక్యూఐ 400 దాటాయి. వివేక్ విహార్ 460, ఆనంద్ విహార్ 459, రోహిణి 445, వజీర్‌పూర్ 444 నమోదు కాగా, ఆయా ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకరమైన వాయుకాలుష్యం తెలియజేస్తోంది. ఎన్‌సీఆర్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్‌లో కాలుష్యం తీవ్రంగానేఉంది. ఇదిప్రజలకు ఆరోగ్యసమస్యలను మరింత పెంచింది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్
ఆపరేషన్ : సూర్యాపేట సర్కిల్
బహిరంగ టెండర్ ప్రకటన నం: O-03/2025-26
సూర్యాపేట సర్కిల్‌లో వివిధ విద్యుత్ మరియు సివిల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నవి. బహిరంగ-టెండర్ స్పెసిఫికేషన్ నం: 01/25-26 నుండి 05/25-26 యొక్క టెండర్ ప్రకటన O-03/2025-26 ఆఫ్ SE/OP/సూర్యాపేట కొరకు షెడ్యూల్ తేదీలు ఈ క్రింది విధంగా: 1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 30.12.2025 నుండి 15.00 గం. వద్ద. 2. బిడ్ హార్డ్ కాపీలు DD's మరియు BG's కోసమై దాఖలు కొరకు చివరి తేదీ మరియు సమయం: 07.01.2026 15.00 గం. వరకు. 3. బిడ్ తెరచు తేదీ & సమయం: 07.01.2026 16.00 గం. వద్ద. వివరాలు www.tgsouthernpower.com వద్ద అందుబాటులో ఉన్నాయి. ఫోన్ నం: 8712472748. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.12708-PP/CL/Advt/1/2025-26, తేది: 29.12.2025

AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237
Employment Notification No.2/2025, Dt. 29.12.2025
Notification is hereby issued for engagement of services in AGICL, Amaravati on contract basis. Online application is available in the APCRDA & AGICL website in careers tab and can be submitted from dt.30.12.2025 to dt.18.01.2026. For further details, please visit https://crda.ap.gov.in & www.agicl.org

| Sl. No | Name of the Post | Nos |
|---|---|---|
| 1 | Chief Financial Officer | 1 |
| 2 | Company Secretary | 1 |
| 3 | Chief Business Officer | 1 |
| 4 | Investment Lead | 1 |
| 5 | Sr. Executives- Investment Promotion | 2 |
| 6 | Executive- Investment Promotion | 2 |
| 7 | Finance Expert | 1 |
| 8 | PPP Expert | 1 |
| 9 | Manager Marketing | 1 |
| 10 | Sr. Exe (Content writer, Advertisement and Communication - PR) | 3 |

Sd/- Managing Director, AGICL, Amaravati.



## బొలెరో ఎస్‌యువిపై పడిన పొట్టు లారీ!

### డ్రైవర్ అక్కడికక్కడే మృతి

**రామ్‌పూర్(యుపి), డిసెంబరు 29:** ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొట్టుతో నిండిన లారీ బోల్తాపడింది. ఓ సిగ్నల్ వద్ద టర్నింగ్ తీసుకుంటున్న బోలెరో వాహనంపై ఆ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోలెరో వాహనంలో ఉన్న డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదానికి చెందిన సీసీటీవీ విడియో వైరల్‌గా మారింది. రాంపూర్ నైనిటాల్ హైవే మీదున్న పహాడి గేటు సిగ్నల్ వద్ద ప్రమాదం జరిగింది. టర్నింగ్ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న బోలెరో వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన పొట్టుతో ఉన్న లారీ ఢీకొట్టింది. అయితే ప్రమాదాన్ని తప్పించేందుకు లారీ డ్రైవర్ ప్రయత్నించాడు. కానీ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఉనక లారీ ఆ వేగంతో బోలెరో వాహనంపై పడింది. విద్యుత్తు శాఖ సబ్ డివిజనల్ ఆఫీసర్‌ను ఆఫీసు వద్ద దించి వస్తున్న బోలెరో డ్రైవర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. బొలేరో వాహనం విద్యుత్ శాఖ ఎస్డీఓకు సంబంధించినదే అయినా ప్రమాదసమయంలో సబ్‌డివిజనల్ అధికారి వాహనంలో లేరు. ట్రక్కును పైకి లేపేందుకు క్రేన్‌ను రప్పించారు. ఈ ప్రమాదంతో నైనిటాల్ హైవేపై కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రక్కు, బొలేరోను తప్పించిన తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్‌పి నీలేష్‌కుమార్, సదర్ ఎస్‌డిఎం జనార్దన్‌ప్రసాద్ అగర్వాల్, సిఒ అరుణ్‌కుమార్‌సింగ్, స్టేషన్ ఇన్‌ఛార్జి దీపక్‌కుమార్, లాహెరి ఎస్‌హెచ్‌ఒ వీరేందర్‌ప్రసాద్ సదర్ ఆస్పత్రికి వెళ్లి సంఘటనను విచారించారు. ప్రమాదంలో ట్రక్కు ఒకపక్కకకు ఒరిగిపోవడంతో అదుపుతప్పి బొలేరోపై పడినట్లు తేలింది.

# రూ.79 వేల కోట్ల రక్షణరంగ కొనుగోళ్లకు ఆమోదం

## త్రివిధ దళాలకు మరింత శక్తి సామర్థ్యాలు : రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** సాయుధ దళాల కోసం రక్షణరంగ కొనుగోళ్ల మండలి సోమవారం రూ.79వేల కోట్ల సామగ్రి కొనుగోలుకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిరాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన డిఎసి సమావేశం త్రివిధ దళాలనుంచి అందిన ప్రతిపాదనలు సుమారు 79 వేల కోట్లమేర ఉన్నాయని, వాటిని సాయుధ దళాల పటిష్టతకు అనివార్యం అనిభావించడంతో వెంటనే ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఈ కొనుగోళ్లుజరిగి యంత్రసామగ్రి వస్తే సాయుధ దళాల నిర్వహణ సామర్థ్యం మరింత పెరుగుతుందనిరాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సుదూర లక్ష్యం ఛేదించేరాకెట్లు, తక్కువస్థాయిలో ఎగిరే టార్గెట్లకోసం తేలికపాటి రాడాలర్లు, పినాక రాకెట్ వ్యవస్థకోసం సుదూర శ్రేణి రాకెట్లు సమీకృత డ్రోన్ పసిగట్టే వ్యవస్థ, ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ మార్క్-2 వంటివి కొనుగోలుకు ఆర్మీకోసం సిద్ధంచేస్తున్నారు. ఇక నావికా దళానికి సంబంధించి బొల్లార్డ్ పుల్ టగ్‌బోట్స్ కొనుగోలుకు నిర్ణయించారు. మానవరహిత విమానాలతో నిరంతర నిఘాకోసం కొన్నింటిని కొనుగోలుచేస్తున్నారు. ఇక వైమానిక దళం కోసం కొన్ని అత్యాధునిక వ్యవస్థలు, ఆయుధ సామగ్రిని కూడా కొనుగోలుచేస్తున్నారు. దీనివల్ల శతృవులను తుదముట్టించడం మరింత తేలిక అవుతుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లోను విమానాలు టేకాఫ్, ల్యాండింగ్‌లను రికార్డుచేసే వ్యవస్థలు ఆస్ట్రామార్క్-2 క్షిపణులు, సుదూరశ్రేణి టార్గెట్లను ధ్వంసంచేసే సామర్థ్యం ఉన్నవాటితోపాటు తేజా యుద్ధ విమానాలకోసం సిమ్యులేటర్లు, స్పైస్ 1000 గైడ్ కిట్స్ వంటివి కూడా ఉన్నాయి. గడచిన మూడు బడ్జెట్లలో రక్షణరంగానికే ఎక్కువ కేటాయింపులు జరిగాయి. 2023-24 బడ్జెట్‌లో రూ.6,09,504 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో 6,41,060 కోట్లు, 2025-26 బడ్జెట్‌లో రూ.6,81,210 కోట్లు కేటాయింపులు జరిపారు.

## వాట్సాప్‌లో కొత్త సంవత్సర శుభాకాంక్షలు, ఆఫర్ల పేరిట సైబర్ మోసాలు

### అప్రమత్తంగా ఉండాలని టిజిసిఎస్‌బి హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం సందర్భంగా సెల్ ఫోన్‌లలోని వాట్సాప్‌లలో వచ్చే శుభాకాంక్షలు, ఆఫర్ల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆ మె ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పే క్రమంలో ఎస్‌బిఐ సహా పలు బ్యాం కుల పేర్లను వాడుతూ క్రెడిట్ కార్డుల ఆఫర్లు, ఇతర ఆఫర్లు చూపుతూ లింకులు పంపుతారని, వీటిని ఎవరూ క్లిక్ చేయవద్దని తెలిపారు.

ఈ తరహా లింకులను క్లిక్ చేస్తే వినియోగదారుడి ఫోన్‌లో వున్న సమాచారం అంతా సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోతుందని ఆమె తెలిపారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఫోన్‌లను హ్యాక్ చేస్తూ బ్యాంకులలోని నగదును కాజేస్తారని ఆమె తెలిపారు. వాట్సాప్‌ల ద్వారా వచ్చే సందేశాలు నిజమైనవా? లేదా అని ముందుగా తెలుసుకోవాలని, దేనిని పడితే దానిని క్లిక్ చేయవద్దని, అనుమానిత మెసేజ్‌లపై వెంటనే 1930 లేదా సమీప పోలీసు స్టేషన్లకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలపై అన్ని వర్గాల వారు నిరంతరం అప్రమత్తంగా ఉండడంతోపాటు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

## డిజిటల్ అరెస్టు కేసులో ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** డిజిటల్ అరెస్టు పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళను మోసం చేసి 1.95 కోట్ల రూపాయలు కాజేసిన కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారిని సయ్యద్ షోయబ్ జాహిద్, బెలిం అనస్ రహీంగా గుర్తించారు. బాధిరాలి భర్తపై కేసులున్నాయని, టెలికాం అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్లు బెదిరించి ఆమెను ఒక గదిలో కొన్ని గంటల పాటు నిర్బంధించి కోటీ 95 లక్షల రూపాయలు కాజేశారు. దీనిపై బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు విచారణ చేబట్టి గుజరాత్‌కు చెందిన ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరి బ్యాంకు ఖాతాలను, వీరికి మ్యూల్ ఖాతాలు అందించిన వారి ఖాతాలను పోలీసులు జప్తు చేశారు. నిందితులను రిమాండుకు తరలించారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులపై దేశ వ్యాప్తంగా 22 సైబర్ కేసులు న్నట్లు తేలింది. మూడున్నర కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని తేలింది.

## గోవా టూర్‌లో విషాదం

### నర్సాపూర్‌కు చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి

### ఒకరి పరిస్థితి విషమం, ఒకరికి తీవ్రగాయాలు

**నర్సాపూర్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** నర్సాపూర్ నుండి బయిలు దేరిన యువకుల గోవా టూర్‌లో విషాదం నెలకొంది. గోవా నుండి తిరిగి వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరుగగా ఈ ప్రమాదంలో ఇద్దరి యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘంటన మహారాష్ట్ర రాష్ట్రంలోని షోలాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనతో నర్సాపూర్ పట్టణంలో కలకలం రేపగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే .. నర్సాపూర్ పట్టణానికి చెందిన 15 మంది యువకులు మూడుకార్లలో గోవా టూర్‌కు వెళ్లారు. గోవాలో సరదాగా గడిపిన స్నేహితులందరూ గోవా టూరు ముగిసిన అనంతరం తిరిగి వస్తుండగా మహారాష్ట్రలోని సోలాపూర్ సమీపంలోకి రాగానే వీరందరూ ప్రయాణిస్తున్న మూడు కార్లలో ఒక కారు టైర్లు పగిలిపోయి కారు వాహనం పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరు రేహాన్, పవన్ కుమార్ లు అక్కడికక్కడే మృతి చెందారు. అయితే క్రముద్దీన్ పరిస్థితి విషమంగా ఉంది. అంతేగాక అఫ్వాన్ కు తీవ్ర గాయా లైనట్టు సమాచారం. ఈ గోవా టూర్ విషాద సంఘటన తో మృతుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాద సంఘటనతో నర్సాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## టెట్ పరీక్ష రాసే ఇన్‌సర్వీస్ టీచర్లకు ఒడి కల్పించాలి

### ప్రభుత్వానికి పిఆర్టీయు టిజి విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టెట్ పరీక్ష రాసే ఇన్ సర్వీస్ టీచర్లకు ఒడి సౌకర్యం కల్పించాలని పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జనవరి 3, 4, 5, 6 తేదీల్లో జరిగే టెట్ పరీక్షకు హాజరయ్యే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రత్నాకర్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్ చంద్రశేఖరరావు విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. టెట్ నిబంధన సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కూడా అనివార్యమని ఎన్‌సిఈఆర్‌టిఈ, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నందువలన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షకు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. టెట్ పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులు అందరికీ కూడా ఆన్ డ్యూటీ వసతికల్పించాల్సిందిగా పిఆర్‌టియు విజ్ఞప్తి చేస్తుందన్నారు.

# ముగిసిన ఐ బొమ్మ రవి పోలీసు కస్టడీ

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

### ప్రహ్లాద్ పేరుతో వివిధ కార్డులు సంపాదించిన వైనంపై ఆరా

### కొత్త సమాచారంతో రవిపై మరిన్ని కేసులు నమోదు చేసే అవకాశం



**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అనేక భాషల సినిమాలు, ఓటిటి కంటెంట్లను అధునాతన టెక్నాలజీతో పైరసీ చేసిన ఐ బొమ్మ అనే వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవి 12 రోజుల పోలీసు కస్టడీ సోమవారం సాయంత్రం ముగిసింది. దీంతో నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండు వారాల నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. రవిని ఇప్ప టికే రెండుసార్లు కస్టడీలోకి తీసుకుని విచారించిన సైబర్ క్రైం పోలీసులు తాజాగా మూడవ విడతగా 12 రోజులు విచారించారు. ఇందులో సినిమా లతో పాటు ఓటిటి కంటెంట్లను పైరసీ చేసిన తీరుపై వివరాలు సేకరించారు. దీంతో పాటు ఇతనికి సహకరించిన వారి వివరాలు వెలికితీశారు. దీంతో పాటు ఇతరుల పేరుతో వారికి తెలియకుండా పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడంపైనా విచారించారు. బెంగళూరుకు చెందిన ప్రహ్లాద్ అనే వ్యక్తి పేరును వాడిన రవి పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ సంపాదించిన వైనంపై ఆరా తీశారు. ఈ క్రమంలో ప్రహ్లాద్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు పిలిపించి నేరుగా రవి ఎదుట వుంచి విచారించారు. ఈ కేసులో ప్రహ్లాద్ ఎలాంటి నేరం చేయలేదని తేలింది. అ తన్ని అప్రూవర్‌గా వుంచారు. ప్రహ్లాద్‌తో పాటు అంజయ్య, కాలి ప్రసాద్ అనే మరో ఇద్దరు వ్యక్తుల పేర్లతోనూ రవి నకిలీ గుర్తింపు కార్డులు పొందినట్లు పోలీసులు గుర్తించారు. కొత్తగా వెలుగు చూసిన సమాచారంతో రవిపై మరికొన్ని కేసులు నమోదు చేసే వీలుంది. కాగా రవి కస్టడీ విచారణ మూడుసార్లు పూర్తవడంతో ఈ కేసులో త్వరలోనే సైబర్ క్రైం పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు.

## నిమ్స్ ఉద్యోగుల ఆర్జిత సెలవుల నగదు మార్పిడికి గ్రీన్‌సిగ్నల్

### జిఒ జారీ చేసిన సర్కార్

### మాట నిలబెట్టుకున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల యేళ్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. వారు కోరుతున్నట్టుగా 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, నిమ్స్ ఉద్యోగులకు ఈ వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం జీవో నం. 230ని జారీ చేసింది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న నిమ్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటివరకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదు. దీనిపై ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నాయి. ఇటీవల హాస్పిటల్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి తమ సమస్యను విన్నవించారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న తెలంగాణ లీవ్ రూల్స్ 1933 నిబంధనల ప్రకారమే ఇకపై నిమ్స్ ఉద్యోగులు కూడా తమ ఆర్జిత సెలవులను సరెండర్ చేసి నగదు పొందవచ్చు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు సోమవారం జీవో విడుదల చేశారు. తమ కష్టాన్ని గుర్తించి, చిరకాల కాంక్షను నెరవేర్చినందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి నిమ్స్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందని హర్షం వ్యక్తం చేశారు.

### బిసి రిజర్వేషన్ల తగ్గింపు అక్రమాలు, అవకతవకలపై

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై నిరక్ష్యం

### 2 లక్షల ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో ప్రతిపక్షాలు చర్చించాలని

### ఎంపి ఆర్.కృష్ణయ్య బహిరంగ లేఖ

**హైదరాబాద్ డిసెంబరు 29, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా బీసీల రిజర్వేషన్లను 42. శాతం నుంచి 22 శాతం తగ్గించి అమలు చేయడంలో 17శాతంకు తగ్గించి తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారు బిసిలకు మోసం చేశారు. అన్యాయం చేశారు. 2జిల్లాలలో 28 మండలాలు జిరో రిజర్వేషన్లపై కూడా తీవ్రంగా అన్యాయం చేశారు... కొన్ని జిల్లాల, మండలాలలో వీరో రిజర్వేషన్లు బీసీలకు చేసిన దగా మోసంపై ప్రతిపకాలు అధికార విక్షాన్ని నిలదీయాలని ప్రశ్నించాలని తెలంగాణ బిసి జాక్ చైర్మన్ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు వెయ్యి సార్లు ఎట్టి పరిస్థితులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని పదే పదే ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత న్యాయబద్ధత ఉన్నప్పటికీ ప్రభుత్వం నిరక్ష్యం ఉండడం వల్లనే అమలు చేయలేకపోయారని విమర్శించారు. అదేవిధంగా బీసీ/ఈబీసీ/ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ విద్యార్థుల ఫీజు రియంబర్స్ బకాయిలు దాదాపు పదివేల కోట్లు చెల్లించడంలో చేస్తున్న నిర్లక్యంపై కూడా చర్చించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. హాస్టళ్ళ గురుకులాల నిర్వహణలో ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యానికి పాల్పడుతుందని, ఈ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

## జెన్‌కో బకాయిలు 43 వేల కోట్లు సింగరేణికి చెల్లించండి

### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** సింగరేణికి జెన్‌కో కంపెనీ చెల్లించాల్సిన రూ.43వేల కోట్లు బకాయి వెంటనే చెల్లించాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు.



కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి గురించి పలు ప్రశంలు లేవనెత్తారు. తెలంగాణలో సింగరేణి ప్రధానమైన సంస్థ అని అయినప్పటికీ సింగరేణి కార్మికుల్లో పూర్తిగా అసంతృప్తి చోటు చేసుకుందన్నారు. వీటిని పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరారు. లేదంటే సింగరేణి పూర్తిగా కనుమరుగయ్యి, ప్రయివేటుపరమయ్యే అవకాశాలు కనబడుతున్నాయని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్‌ను సరైన పద్ధతిలో అమలు చేయడంలేదని, కారుణ్య నియామకాలకు వయస్సు 35 నుంచి 45 కు పెంచినప్పటికీ, వివిధ కారణాలు చూపి నియామకాలు చేయడం లేదన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకం లేదని, కొత్త గనులను సింగరేణి దక్కించుకొని అందులో సింగరేణి కార్మికులను మాత్రమే నియమించుకోవాలని సభలో కోరారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో చర్చలో హరీష్‌రావు జోక్యం కల్పించుకొని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు వాటిని రద్దుచేశారు. కెసిఆర్ మొదలు పెట్టారు మళ్ళీ ఇప్పుడు రద్దయిన విషయం మీరు సభ దృష్టికి తేవాలని కూనంనేనితో అనగా ఆయన కూడా అదే విషయాన్ని మళ్లీ తెలిపారు.

## కౌశిక్‌రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్డుకోవడంతో సభలో అలజడి

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్‌డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జిరోఅవర్‌లో ప్రసంగిస్తూ ఆరోపణలు చేయడంతో అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవడంతో అలజడి చెలరేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురు దాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో జిరో అవర్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్‌లో కల్వల ప్రాజెక్టు కొట్టుకుపోయిందని దానిని రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని కోరారు. 2023 భారీ వర్షాలకు కల్వల ప్రాజెక్టు కొట్టుకుపోతే 70కోట్లతో కెసిఆర్ హయంలో డిపిఆర్ కూడా రూపొందించారని అది ఇంకా పెండింగ్‌లో ఉందని అన్నారు.

# కొంప ముంచిన అప్పు

### తీసుకున్నది రూ.1.75 కోట్లు

### కుప్పతెప్పలుగా పెరిగి రూ.147 కోట్లకు చేరిన వైనం

### ఇంటిని అమ్మి అక్కడే అద్దెకున్న బాధితుడు

### రికవరీకి కోర్టుకెళ్తే సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన జడ్జి





**సింగపూర్ సిటీ, డిసెంబరు 29:** సింగపూర్‌కు చెందిన ఒక వ్యక్తి రూ.1.75 కోట్ల అప్పు తీసుకుంటే వడ్డీ, పెనాల్టీల కారణంగా అది ఏకంగా రూ.147 కోట్లకు చేరి రికవరీకోసం కోర్టుకు వచ్చినసంగతి వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన సింగపూర్ హైకోర్టు జడ్జి ఫిలిప్ జేయరత్నం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఈ ఘటన మనస్సాక్షిని కలిచివేసేది అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లోని ఒక లైసెన్స్ పొందిన వడ్డీ వ్యాపారి వద్ద ఆ వ్యక్తి అప్పు తీసుకోగా అది జీవితాన్నే తలకిందులు చేసింది. 2010లో ఆ వ్యక్తి తన అవసరాల కోసం సుమారు రూ.1.75 కోట్ల అప్పు తీసుకున్నాడు. అందుకు నెలకు 4 శాతం (ఏడాదికి 48 శాతం) చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నాడు. వాయిదా చెల్లించడం ఆలస్యమైతే నెలకు 8 శాతం అదనపు వడ్డీ, ఆలస్యంగా చెల్లిస్తే ప్రతీ నెలా రూ.1.75 లక్షలు ఫైన్‌గా నిర్ణయించారు. దీంతో అది కేవలం 4 ఏళ్లలోనే అంటే 2014 నాటికి ఆ అప్పు రూ.21 కోట్లకు చేరింది. 2021 నాటికి అది ఏకంగా రూ.147 కోట్లకు ఎగబాకింది. అతడు తీసుకున్న అప్పు కొండలా పేరుకుపోయి అప్పు తీర్చలేకపోయిన తరుణంలో తన సొంత ఇంటిని ఆ వడ్డీ వ్యాపారికి విక్రయించాడు. ఆ ఇంటిని రూ.14 కోట్లకుఆ వడ్డీ వ్యాపారి సంస్థ డైరెక్టరుకే అమ్మేసినప్పటికీ అతని అప్పు తీరలేదు. ప్రస్తుతం అతను అదే ఇంట్లో తన కుటుంబంతో కలిసి నెలకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల అద్దె చెల్లిస్తున్నాడు. అద్దె చెల్లించలేదనే కారణంతో డైరెక్టర్ కోర్టుకు వెళ్లగా ఆ అప్పు పెరిగిన తీరు చూసి సింగపూర్ హైకోర్టు జడ్జి ఆశ్చర్యపోయారు. అంత తక్కువ అప్పు అంత భారీ స్థాయికి ఎలా చేరిందనే దానిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోర్టు ఆదేశించింది. వడ్డీ వ్యాపారి కావాలనే మోసం చేశాడా లేదా చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించారా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. రూ.1.75 కోట్ల అప్పు కోట్లలోకి చేరడం అన్యాయమని ఇది సమాజ నియమాలకు విరుద్ధమని జడ్జి పేర్కొన్నారు. సింగపూర్‌లో 2015 అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం లైసెన్స్ పొందిన వడ్డీ వ్యాపారులు నెలకు 4 శాతానికి మించి వడ్డీ వసూలు చేయకూడదు. లేట్ పేమెంట్ ఫీజు నెలకు రూ.4200కు మించకూడదు. కానీ ఈ వ్యక్తి అప్పు 2010లో తీసుకోవడం వల్ల పాత నిబంధనల లొసుగులను వడ్డీ వ్యాపారి తనకు అనుకూలంగా మార్చుకుని రికవరీకి కోర్టులో దావావేసాడు.

## అమెరికా రోడ్డుప్రమాదంలో గార్ల యువతులు మృతి

### ఉన్నత చదువులకై వెళ్లి కానరాని లోకాలకు..

### శోకసముద్రంలో మునిగిన కుటుంబం



మేఘన, భావన

పరామర్శిస్తున్న మాజీ ఎంపి కవిత, ఇన్‌సెట్-మేఘన, భావన

**గార్ల, డిసెంబరు 29, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన ఇద్దరు యువతులు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండల కేంద్రానికి చెందిన మీసేవ కేంద్రం నిర్వాహకులు పుల్లఖండం నాగేశ్వరరావు-సరిత దంపతుల కుమార్తె మేఘన(25), మండలంలోని ముల్కనూరు ఉపసర్పంచ్ కడియాల కోటేశ్వరరావు-రేణుక దంపతుల కూతురు భావన (24) ఇద్దరు యువతులు ఉన్నత చదువులకై కానరాని దేశం అమెరికాకు వెళ్లారు. ఈ మద్యకాలంలో ఎం.ఎస్ పూర్తి చేసుకొని ఉద్యోగ అన్వేషణలో ఉన్నారు. పట్టణాలను సందర్శించడానికి వీకెండ్ ట్రిప్ కోసం కాలిఫోర్నియాలో యాత్రకు వెళ్లగా రోడ్డుప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. ఈ మరణవార్త విన్న కుటుంబ సభ్యులతోపాటు గార్ల మండలం శోక సముద్రంలో మునిగింది. లక్షల రూపాయలు ఖర్చుచేసి అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో కానరాని లోకానికి వెళ్లడంతో కుటుంబసభ్యులు జీర్ణించుకోలేక గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అందరిని కలచివేసింది.

**కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ ఎంపి కవిత**

అమెరికాలోని కాలిఫోర్నియా నగరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతుల కుటుంబ సభ్యులను మానుకోట మాజీ ఎంపి మాలోతు కవిత పరామర్శించారు. మృత్యువుకు గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మనోధైర్యం కల్పించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, మృతదేహాలను స్వగ్రామాలకు రప్పించడం, ఇతర సహాయ చర్యలకు అమెరికాలోని మిత్రులు, బిఆర్ఎస్ విభాగం తగిన సహకారం అందిస్తుందని భరోసా కల్పించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరాం, సొసైటీ చైర్మన్ వడ్ల మూడి దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ప్రముఖులు మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్**
ఆపరేషన్ : సూర్యాపేట సర్కిల్
బహిరంగ టెండర్ ప్రకటన నం: O-03/2025-26

సూర్యాపేట సర్కిల్‌లో వివిధ విద్యుత్ మరియు సివిల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నవి. బహిరంగ-టెండర్ స్పెసిఫికేషన్ నం: 01/25-26 నుండి 05/25-26 యొక్క టెండర్ ప్రకటన O-03/2025-26 ఆఫ్ SE/OP/సూర్యాపేట కొరకు షెడ్యూల్ తేదీలు ఈ క్రింది విధంగా: 1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 30.12.2025 నుండి 15.00 గం. వద్ద. 2. బిడ్ హార్డ్ కాపీలు DD's మరియు BG's తోసహా దాఖలు కొరకు చివరి తేదీ మరియు సమయం: 07.01.2026 15.00 గం. వరకు. 3. బిడ్ తెరచు తేదీ & సమయం: 07.01.2026 16.00 గం. వద్ద. వివరాలు www.tgsouthernpower.com వద్ద అందుబాటులో ఉన్నాయి. ఫోన్ నం: 8712472748. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.12708-PP/CL/Advt/1/2025-26, తేది: 29.12.2025

**AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.**
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237

**Employment Notification No.2/2025, Dt. 29.12.2025**

Notification is hereby issued for engagement of services in AGICL, Amaravati on contract basis. Online application is available in the APCRDA & AGICL website in careers tab and can be submitted from dt.30.12.2025 to dt.18.01.2026. For further details, please visit https://crda.ap.gov.in & www.agicl.org

| Sl. No | Name of the Post | Nos |
|---|---|---|
| 1 | Chief Financial Officer | 1 |
| 2 | Company Secretary | 1 |
| 3 | Chief Business Officer | 1 |
| 4 | Investment Lead | 1 |
| 5 | Sr. Executives- Investment Promotion | 2 |
| 6 | Executive- Investment Promotion | 2 |
| 7 | Finance Expert | 1 |
| 8 | PPP Expert | 1 |
| 9 | Manager Marketing | 1 |
| 10 | Sr. Exe (Content writer, Advertisement and Communication - PR) | 3 |

Sd/- Managing Director, AGICL, Amaravati.

వినడంలో మనిషి తొందరపడాలి. కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.

-జేమ్స్ జ్యాడిత్

# మేధో వలసలను ఆపలేమా!

కొందర్ని తమ దేశం బహిష్కరించవచ్చు. ఒక దేశాన్ని కొందరు త్యజించవచ్చు. కానీ మేధస్సు లేమితనం మందికి జనం ఉన్నంత కాలం ఆయా దేశాలు మన జాలవు. ఇలాంటివి గుర్తించిన పాలకులు మాత్రం ఇతర దేశాల నుంచి మేధావులను తెప్పించుకుంటాయి. ప్రపంచంలో ఈ అంశాలపై చిత్ర విచిత్రమైన పరిస్థితులు దాపురించాయి. తాజాగా పాకిస్తాన్ నుంచి మేధో వలస ప్రారంభమైంది. తాజా అంశాలను పరిశీలిస్తే పాకిస్తాన్ నుంచి మేధావులు తమ సొంత దేశాలకుతిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఆ దేశంలో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులను బేరీజు వేసుకుని డాక్టర్లు, ఇంజనీర్లు, అకౌంటెంట్లు అక్కడ ఉండలేక వేరే దేశాలకు లేదా తమ సొంత దేశాలకు వెళ్తున్నారన్న సమాచారం లభించింది. గత రెండేళ్లుగా చాపకింద నీరులా వలసలు ప్రారంభమయ్యాయి. ఫలానా కారణం అని చెప్పకుండా మంచి ఆఫర్లు వచ్చాయనో, మానసికంగా అక్కడ ఉండలేకపోతున్నామనే భావనతో బయటికి వచ్చేస్తున్నారు. ఇంటి బెంగ మరి కొందరికి. పాకిస్తాన్‌లో ఏర్పడిన ఆర్థిక మాంద్యం, రాజకీయ అస్థిరత, భవితవ్యం అనుమానంగా 'పాక్‌కు నష్టం' చెబుతున్నాయి. గత రెండేళ్ల కాలంలో పాకిస్తాన్ నుంచి ఐదువేల మందికి పైగా డాక్టర్లు,11వేల మంది ఇంజనీర్లు, 13వేల మంది అకౌంటెంట్లు తరలివెళ్లిపోయారు. మేధస్సు కలిగిన విదేశీయులను మాత్రమే అమెరికా ఉంచుకోవాలనుకుంటోంది. అలాంటి సుగుణాలేమీ లేని వారిని నకారాలను ఇచ్చి మరీ పంపేస్తోంది. కాగా పాక్ నుంచి ఖాళీ చేస్తున్న మేధో యువత కారణంగా దేశ భవిత ప్రశ్నార్థకమవుతోంది.వీటితోపాటు సౌదీ అరేబియా సంగతి చూద్దాం. ఈ యేడాది అత్యధికంగా భారతీయులను స్వదేశానికి డిపోర్ట్ చేసిన ఘనత అదేనంది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఇటీవల రాజ్యసభకు సమర్పించిన నివేదిక ఎన్నో సంచలన వివరాలను బయటపెట్టింది. 2025లో ప్రపంచ చిత్రపటంలోని 81 దేశాలు దాదాపు 24,600 మందిభారతీయులను ఇంటికి పంపేసింది. బతిమాలో, బామాలో 'హెచ్చరించో' బెదిరించో అన్నది ఇక్కడ అప్రస్తుతం. సౌదీ అరేబియా నుంచి 11 వేల మంది భారతీయులు ఏయుటైనటే వెనక్కి వచ్చేసారు. అమెరికా నుంచి డిపోర్ట్ అయిన భారతీయులు 3,800మంది. అందరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే కాదు,విద్యార్థులు ప్రైవేట్ ఉద్యోగులూ ఉన్నారు. సైబర్ మూలాలతో సంబంధమున్న కేసుల్లో చిక్కుకున్న 1,469 మందిని నిర్దాక్షిణ్యంగా భారతకు పంపేసింది. వీరిలో ఎక్కువమంది తెలుగువారే ఉండటం దురదృష్టకరం. వీసా కాలపరిమితి తీరడం, లేదా పొడిగింపు అనుమతి, వెసులుబాటులేక, అనధికార ఉద్యోగాలు చేస్తూ దొరికి పోయిన వారు స్వగ్రామాలకు తిరిగి రావాల్సి వచ్చింది. గల్ఫ్‌దేశాల నుంచి ఇలా వచ్చిన వారిలో ఎక్కువమంది విద్యార్థులు. ఈ యేడాది యుకే నుంచి 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది భారతీయుల్ని మాత్రమే భారతకు పంపేసింది. కానీ 'డాలర్ డ్రీమ్స్'లో పడి దొడ్డిదారిన ఆయా దేశాల్లోకి వెళ్లిన వారికి తిప్పలు తప్పడంలేదు. ఇలాంటివి ఎవరూ ప్రోత్సహించకూడదు. ఇటీవల అమెరికాఅధ్యక్షుడు భారతీయుల్ని వెనక్కి పంపిన విధానంలో భారతీయులు ఆక్రోశం చెందారు. అక్రమ వలసలపై కఠిన చర్యల కారణంగా తమ ఉనికిని బయటకు తెలియకుండా కాలక్షేపం చేసినవారు కూడా అమెరికా విదేశంగ శాఖకు దొరికిపోయారు.ప్రత్యేక సైనిక విమానంలో 'డిపోర్ట్'చేసింది. కొన్ని సందర్భాల్లో వలసదారులు కాళ్లకు సంకెళ్లు తప్పలేదు. అంత అమానవీయ పరిస్థితులలో బయటపడ్డారు. ఇంటిముఖం చూశారు. పాకిస్తాన్ మనకు దాయాది దేశమైనందున ఇటీవల పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆ దేశం పట్ల భారత్ అనుసరిస్తున్న విధానాల నుంచే కాక దాదాపు ఎక్కువ దేశాలు పాక్‌ను పక్కన పెట్టాయి. ఆ దేశం ఆర్థిక చక్రం మందకొడిగా తిరుగుతోంది. ఎవరు ఎలాంటివారికైనా గట్టెక్కే పరిస్థితి లేదు. ఇలాంటి స్థితిలో భారత్ పాక్ మధ్య ఎలాంటిస్నేహం యుద్ధ మొచ్చినా పాకిస్తాన్ ఏమవుతుందో అంచనా వేయగలిగిన మేధావులే వలస వెళ్లిపోతున్నారు.దీనివలన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ముప్పు తప్పదని అంచనాలున్నాయి. ఈ వలసలతో ఆరోగ్యం, ఇంజినీరింగ్ ఫైనాన్స్ వంటి కీలక రంగాలు బాగా దెబ్బతిన్నాయి. పాక్ ఆర్మీ చీఫ్ భారత్‌పైకువ్వకోళ్లను వ్యవహరిస్తున్న తీరు కూడా అక్కడ మనుగడ సాగిస్తున్న మేధావులలో ఆగ్రహం వ్యక్తమైంది.రాబోయేకాలంలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకుని వలస బాటపట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రీలాన్సింగ్ హబ్‌గా గుర్తింపు పొందిన పాకిస్తాన్ తరచూ జరిగే ఇంటర్నెట్ షట్‌డౌన్ల కారణంగా యేటా 1.62 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసింది. దాంతో దాదాపు 23.7 లక్షల ఫ్రీలాన్సర్లు ఉద్యోగులు ప్రమాదంలో పడ్డాయి. ముఖ్యంగా వైట్‌కాలర్ ఉద్యోగులు నుంచి భవిష్యత్ కోసం పాకిస్తాన్‌ను వీడాలని నిర్ణయించుకున్నారు. ఒకానొక దశలో ఈ వలసలపై వ్యాఖ్యానిస్తూ పాక్ ఆర్మీచీఫ్ ఆర్మీజనరల్ ఆఫ్ పాకిస్తాన్ మునీర్ వ్యాఖ్యలు ఎంతోవ్యంగ్యంగా వినపస్తున్నాయి. ఈ బ్రెయిన్ డ్రెయిన్‌ను అంతర్జాతీయ సమాజానికి పాక్‌కున్న బహుమతి అనే ధోరణిలో 'బ్రెయిన్ డ్రెయిన్'గా అభివర్ణిస్తుంటే మేధావి వర్గాలు మునీర్ అహంభావపు మాటల్ని నిరసిస్తున్నారు.కొసమెరుపు ఏమిటంటే పాక్ నుంచి వైట్‌కాలర్, అసంఘటిత నైపుణ్య కార్మికులతోపాటు బిచ్చగాళ్లు కూడా ఆ దేశంలో ఉండటానికి ఇష్టపడటం లేదు.

పూలకు సూర్యకాంతి ఎంత ముఖ్యమో, మానవాళికి చిరునవ్వు అంతముఖ్యం.



ఎడిసన్

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు.



జియార్జ్ ఎలియట్

# భార్యలకు పదవులు, భర్తలకు అధికారాలు!

**గత మూడు పర్యాయాలుగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ కొనసాగుతుండగా, గతంలో సుచేతా కృపాలాని, షీలాదీక్షిత్, మాయావతి, జయలలిత, వసుంధర రాజే, ఉమాభారతి, రబ్రీదేవి, ఆనందిబెన్ పటేల్ ఇలా మహిళామణులెందరో వివిధరాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా సేవలు చేయలేదా? చేస్తలేరా? అంతెందుకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైతం సీతక్క,కొండా సురేఖ మంత్రులుగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే విభిన్నరంగాలలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ అగ్రస్థానాలకు చేరుకున్న వారెందరో ఉన్నారు. ప్రస్తుత రాజకీయాలపట్ల మహిళామణులు దృష్టిసారించి, స్వతహాగా నిర్ణయాలు తీసుకుంటూ పాలకరంగంలో రాణించినమాట వాస్తవం గాదా! కానీ గ్రామాలలోకి వచ్చేసరికి ఎక్కువశాతం వారినీ స్వంత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకపోవడమనేది దేనికి నిదర్శనమో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిపోతుంది. పుట్టుకతోనే ఎవరు అన్నీ నేర్చుకోరు. క్రమంగా అర్థమవుతుంటాయి. వారికి ఆ స్వేచ్ఛనిస్తే రాణిస్తారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. రాజ్యాంగం పరంగా ఎవరి హక్కులను కాలరాయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతిఒక్కరిపైఉన్నది. ఇకనైనా మార్పురావాలి.**

డా.పోలం సైదులు

గ్రామపంచాయతీలకు సర్పంచ్ నియామకాలు జరిగిపోయాయి. డిసెంబర్ 22న అధికారికంగా ప్రమాణస్వీకారాలుచేసి గ్రామ నూతన పాలకుల కొలువుదీరారు.1992లో 73వ రాజ్యాంగ సవరణ, ఆర్టికల్ 243డి ప్రకారం స్థానిక సంస్థల్లో మహిళలకు33శాతం రిజర్వేషన్ కల్పించగా, దానిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నివిభాగాల్లో మహిళా రిజర్వేషన్ 50శాతానికి పెంచి అమలు చేస్తున్నారు. దీని వల్ల సగంమంది మహిళలు గ్రామపంచాయతీలకు నాయకత్వం వహిస్తున్నారు. అందులో భాగంగా తెలంగాణలో మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో 6వేలకుపైగా మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అందులో జనరల్ స్థానాలలో 2446, బీసీ మహిళల స్థానాలు 942,ఎస్సీ మహిళల స్థానాలు 908, ఎస్టీ మహిళలు 1434 స్థానాలు పొందగా, అందులో అత్యధికంగా నల్గొండజిల్లాలో 404 మహిళా సర్పంచ్ స్థానాలుండడం గమనార్హం. పూర్వం ఆడవారంటే వంటింటికే పరిమితం, వారిపై చులకన భావన ఉండేది. అలాగే ఆడశిశువులను కనడానికి, చదివించడానికి శ్రద్ధ వహించేవారుకాదు. అలాంటి వివక్షత నుండి కాలక్రమేణా వచ్చిన మార్పుల వలన నేడు మహిళలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలు పొందుతున్నప్పటికి ఇంకా అక్కడక్కడా కొంత వివక్షతకు గురవుతున్నారనడంలో నిజం లేకపోలేదు. ఆనాడు భారతీయ మెదటి మహిళా అధ్యాపకురాలుగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే మొదలుకొని, నేటి వాస్తవిక సమాజంలో ఎందరో మహామణుల కృషి ఫలితంగా నేడు వారికంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకోవడమే గాకుండా 'మాకెవరుసాటి మాకు మేమేసాటి' అనేలా మగవారుచేసే ప్రతిపనిని చేస్తూ నిరూపిస్తున్న తరుణం. ఒక్కరంగంలో కాకుండా ప్రతిరంగంలోకి ప్రవేశించి మహిళసత్తా అంటే ఏంటోనని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆదర్శమహిళలెందరో ఉన్నారు. అలాగే సాహిత్యరంగంలో సైతం ఎందరో మహిళలు ఎన్నో రచనలు చేస్తూ దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందులో భాగంగా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంటున్న దాఖలాలున్నాయి. ఇవియే కాకుండా విభిన్నరంగాలలో మహిళామణులు తమకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకొని మేముసైతం అనిచెప్పే సందర్భంలో ప్రస్తుత మహిళలోకమున్నది. ప్రత్యేకంగా పాలకవర్గంలో మహిళామూర్తులు ఆదర్శవంతమైన పాలన గావించి తమ ధైర్యసాహసాలను చెప్పకనే చెప్పడం జరిగింది. అలాంటి సందర్భంలో గ్రామీణప్రాంతాలలో దానికి విరుద్ధంగా జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి అబద్ధం లేదు. స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్ల కారణంగా ఎన్నికైన మహిళా వార్డుమెంబర్లు, సర్పంచులు, రాజకీయ నాయకులు అవకాశం రాకపోవడంతో వారిభార్యలను, తల్లులను ఎన్నికల బరిలో దిగబెట్టి, ఆయా స్థానాలను చేజిక్కించుకోవడం జరిగింది. కానీ వారిని కేవలం సంతకాలకే పరిమితం చేసి,వారిస్థానాలలో భార్యచాటు భర్తలా అధికారాలను చెలాయించడం జరుగుతుందంటే మహిళలకు మగవారిచ్చే గౌరవం ఏపాటిదో తెలియకనే తెలుస్తుంది. కార్యాలయాలలో ఎన్నికకాబడిన మహిళామణులున్నా కూడా ఏదైనా అవసర నిమిత్తం వెళ్లితే, ముందుగా వారిభర్తను లేదా కుమారుడిని కలిసి విషయంచెప్పి అనుమతి తీసుకుంటేగానీ పనికానీ పరిస్థితి దాపురించిందంటే అతిశయోక్తిలేదు. బయటి ప్రపంచానికి మగవారికి సమానంగా గౌరవిస్తున్నట్లు చట్టాలు చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో చేసేపని దేనికిసూచియో అర్థంకానీ పరిస్థితి. ఎందరో ఆదర్శ మహిళలు పోరాడి,



రాజ్యాంగపరంగా వారికంటూ స్థానాలుండాలని పోరాడితే ఇలాంటి అవకాశాలు పొందడం జరిగింది. కానీ చివరికి అధికార చెలాయింపు, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వారికీ లేకపోవడమనేది బాధాకరం. ప్రస్తుత సమాజంలో చాలా కుటుంబాలు సుఖసంతోషాలతో ఉన్నదంటే కారణం ఆ కుటుంబ బాధ్యతలను మహిళామణులు లేదా భార్యభర్తలిద్దరు కలిసి చూసుకోవడ మనేది నగ్నసత్యం.అలాంటి తరుణంలో పూర్తిగా నిర్ణయ బాధ్యతలు వారికే ఇస్తే గ్రామాన్ని సైతం బాగుపరుస్తారు కదా! ఎందుకీ ఈ ఆడచాటు మగపెత్తనం?అనే అనుమానం కలగకమానదు. అంటే రాజ్యాంగపరంగా వారికంటూ అవకాశాలిస్తూ,వాటిని మగవారు చేతులోకి తీసుకోవడం సరైనపద్ధతేనా? ప్రభుత్వాలు వీటిపైదృష్టి కేంద్రీకరించి సరైనచర్యలు తీసుకోని,వారికీ ప్రత్యేక శిక్షణలిస్తూ, స్వతహాగా నిర్ణయం తీసుకునేలా, వారితరుపున మగపెత్తనం లేకుండే విధంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఇలాచేయని యెడల స్థానిక సంస్థలలో ఆడవారికి ప్రత్యేక రిజర్వేషన్స్‌వలన ఎలాంటి ఫలితం లేదని గ్రహించాలి. కావున ఎన్నికలలో గెలిచిన మహిళలకు పూర్తిగా స్వేచ్ఛ ఉండేలా, వారిపై వారి కుటుంబ సభ్యుల నియంత్రణ లేకుండేలా, కార్యాలయాలలో ఆడచాటు మగపెత్తనం ఉండకుండా చర్యలు తీసుకుంటూ మహిళలకు వచ్చిన రిజర్వేషన్స్‌ను గౌరవిస్తూ, సహకరించే విధంగా ప్రభుత్వాలు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇంటికి దీపం ఇల్లాలు' అంటారు. ప్రస్తుతం అధికశాతం కుటుంబాలలో మహిళల నిర్ణయాలే శిరోధార్యం. అలాంటి కుటుంబాలే అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాయనడం సైతం జగమెరిగిన సత్యం.వారికి పూర్తి స్వేచ్ఛనిస్తే రుజువు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతెందుకు దేశానికి ఇందిరాగాంధీ ప్రధానిగా పగ్గాలుచేపట్టి, ఒక మహిళా శక్తి ఏంటో నిరూపించలేదా? ప్రతిభా పాటిల్ దేశప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి)గా విధులు నిర్వహిస్తే, ప్రస్తుతం ద్రౌపదిముర్మ విధులు నిర్వహించడంలేదా? గతంలో సుష్మాస్వరాజ్ ప్రధాన ప్రతిపక్షనేతగా పనిచేయ లేదా? నిర్మలా సీతారామన్ ప్రస్తుత దేశ ఆర్థికమంత్రిగా సేవలందించడం లేదా? గత మూడు పర్యాలుగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ కొనసాగుతుండగా, గతంలో సుచేతా కృపాలాని, షీలాదీక్షిత్,మాయావతి, జయలలిత, వసుంధర రాజే, ఉమాభారతి,రబ్రీదేవి, ఆనందిబెన్ పటేల్ ఇలా మహిళామణులెందరో వివిధరాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా సేవలు చేయలేదా? చేస్తలేరా? అంతెందుకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైతం సీతక్క,కొండా సురేఖ మంత్రులుగా విధులు నిర్వహిస్తున్నారు.అలాగే విభిన్నరంగాలలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ అగ్రస్థానాలకు చేరుకున్న వారెందరోఉన్నారు.ప్రస్తుత రాజకీయాలపట్ల మహిళామణులు దృష్టిసారించి, స్వతహాగా నిర్ణయాలు తీసుకుంటూ పాలకరంగంలో రాణించినమాట వాస్తవంగాదా!కానీ గ్రామాలలోకి వచ్చేసరికి ఎక్కువశాతం వారినీ సొంత నిర్ణయాలుతీసుకునే అవకాశం ఇవ్వకపోవడమనేది దేనికి నిదర్శనమో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిపోతుంది. పుట్టుకతోనే ఎవరు అన్నీ నేర్చుకోరు. క్రమంగా అర్థమవుతుంటాయి. వారికీ ఆ స్వేచ్ఛనిస్తే రాణిస్తారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. రాజ్యాంగం పరంగా ఎవరి హక్కులను కాలరాయ కుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటుప్రతిఒక్కరిపైఉన్నది. ●

# పర్యావరణ పరిరక్షణ ఎన్నికల ప్రచారాస్త్రం కావాలి

మహమ్మద్ ఆరిఫ్

దేశ, రాష్ట్ర పాలకులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ప్రత్యేకంగా సమ్మిట్‌లు నిర్వహిస్తూ ప్రపంచ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామిక వేత్తలతో ఉదారంగా వ్యవహరిస్తున్నారు. వందలు, వేల ఎకరాలు కేటాయిస్తున్నారు. అందుకోసం వ్యవసాయ భూములు, నివాస స్థలాలను సేకరించడమే కాకుండా అడవులనూ అప్పనంగా అప్పగించేస్తున్నారు. దీంతో పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతున్నది. అభివృద్ధి పర్యావరణ పరిరక్షణను సరిసమానంగా చూడకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. పరిస్థితులు మరింత దిగజారుతుండడంతో ప్రజలు ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారు. అయితే అధికారంలోకి రావడానికి హామీల వరద పారించే జాతీయ, ప్రాంతీయ పార్టీలు పర్యావరణ పరిరక్షణను ఎన్నికల్లో ప్రధాన హామీగా ఎందుకు ప్రకటించడంలేదు అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతున్నది.ప్రపంచ టాప్ టెన్ కాలుష్యనగరాల్లో ఐదు నుంచి ఏడువరకు నగరాలు భారత దేశంలోనే ఉండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఈ నగరాల్లో నమోదవుతున్న ఏక్యూఐ స్థాయిలు ప్రజారోగ్యానికి తీవ్రముప్పుగా పరిణమిస్తున్నాయి.పారిశ్రామిక కాలుష్యం వల్ల రాజస్థాన్‌లోని బివాడిలో 300 నుంచి 400 మధ్య ఏక్యూఐ నమోదు అవుతున్నది. దేశ రాజధాని ఢిల్లీలో అయితే శీతాకాలంలో ఏక్యూఐ 400నుంచి 500వరకు చేరుకుంటున్నది. వాహనాల పొగ, నిర్మాణ ధూళి, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే పొగమంచు ఆ నగర గాలిని ప్రమాదకరంగా మారుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్, నోయిడా నగరాల్లో కూడా ఏక్యూఐ తరచూ 250 నుంచి 350 మధ్య ఉంటున్నది. హర్యానాలోని గురుగ్రామ్, ఫరీదాబాద్ నగరాల్లో వేగవంతమైన పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ కారణంగా ఏక్యూఐ 200 నుంచి 300 మధ్య కొనసాగుతున్నది. దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నా.. పాలకులు తగినంత చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రపంచంలోనే అతి పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళి పర్వతాలపై కేంద్ర నిర్ణయాలు, వాటిని సుప్రీం కోర్టు ఆమోదించడం ఇటీవల తీవ్ర చర్చనీయాంశమైంది. ఆరావళి పర్వతాలు ఉత్తర భారతానికి ఊపిరితిత్తుల్లాంటివి. ఈ కొండలు రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో వాతావరణ సమతుల్యను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.అయితే గనుల తవ్వకాలు, నిర్మాణ ప్రాజెక్టుల పేరిట ఈ ప్రాంతంలో జరుగుతున్న మార్పులు పర్యావరణవేత్తలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణానికి జరుగుతున్న హానిని గుర్తించిన ప్రజలు రాజస్థాన్ లోని జైపూర్, ఉదయ్‌పూర్, హర్యానాలోని గురుగ్రామ్‌లో శాంతియుత నిరసనలు చేపట్టారు.ముఖ్యంగా జెన్ జీ (యువత) బయటకు వచ్చి నిరసనలు తెలపడమే కాకుండా సేవ్ ఆరావళి హ్యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంచేస్తూ నిరసన తెలుపుతున్నది. వాయు కాలుష్యం దేశవ్యాప్తంగా మహమ్మారిలా విస్తరిస్తున్నది. శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, పిల్లల్లో అస్తమ కేసులు పెరుగుతున్నాయి. నగరాల్లో పాఠశాలలు మూసివేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. అయితే ఇవన్నీ ఎన్నికల రాజకీయాల్లో పెద్ద అంశాలుగా మారడం లేదు. రోడ్లు, వంతెనలు, పరిశ్రమల అభివృద్ధి గురించి పెద్ద హామీలు వినిపిస్తున్నాయే కానీ ఆ అభివృద్ధి వల్ల వచ్చే కాలుష్యాన్ని ఎలా నియంత్రిస్తామన్న స్పష్టమైన ప్రణాళికలు కనిపించడం లేదు. రైతు, ఉద్యోగం, కులం, మతం వంటి అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుండగా పర్యావరణం ప్రభావం చూపే అంశంగా రాజకీయ నేతలు భావించడం లేదు.పర్యావరణ పరిరక్షణ ఫలితాలు ఐదేళ్లలో కనిపించవు. అవి దీర్ఘకాలంలో మాత్రమే తెలుస్తాయి. అవి ప్రజలను ఎలా ప్రభావితం చేయగలుగుతాయి అనే ప్రశ్నలు రాజకీయ నాయకుల నుంచే వినిపిస్తున్నాయి.అందుకే ఐదేళ్లలో ఫలితం చూపించలేని హామీలపై రాజకీయ పార్టీలు ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంత మందికి రుణమాఫీ చేస్తాం? ఎన్ని ఉచిత పథకాలు ఇస్తాం? ఏకులానికి ఎంత రిజర్వేషన్ కల్పిస్తాం? అనేఅంశాలపై ఉన్న శ్రద్ధ,మీ పిల్లలకు స్వచ్ఛమైన గాలిని, కలుషితం లేని నీటిని అందిస్తాం అనే అంశాలు రాజకీయ పార్టీలకు, నాయకులకు కనిపించడంలేదు. అయితే ఐదేళ్ల కాలపరిమితితో ఆలోచించే నేతలకు దీర్ఘకాలిక దృష్టి లేకపోవడం అసలు సమస్య. అంతేకాకుండా పారిశ్రామికవేత్తల విరాళాలపై నడిచే రాజకీయ వ్యవస్థ. పర్యావరణ చట్టాలను కఠినతరం చేయడానికి వెనకాడుతున్నది. ప్రజల డిమాండ్లలో మార్పు వస్తేనే.. రాజకీయ పార్టీల ప్రాధాన్యతల్లో మార్పు వస్తుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రణాళికలతో కూడిన స్పష్టమైన హామీలు ఇచ్చే నేతలు, పార్టీలకు ప్రజలు మద్దతు తెలిపితే రాజకీయ పార్టీలు,నాయకుల్లోనూ మార్పు వచ్చే అవకాశముంటుంది. తద్వారా పర్యావరణ పరిరక్షణ జరిగి.. భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుంది.ఓటర్లు ప్రశ్నిస్తేనే రాజకీయాలు మారుతాయి. అయితే ఆ మార్పు ఆలస్యమైతే దాని మూల్యం దేశంమొత్తం చెల్లించాల్సి ఉంటుంది.అయితే అభివృద్ధి, పర్యావరణం రెండూ పరస్పర విరుద్ధమైనవి కావని రాజకీయ వ్యవస్థ గ్రహించాల్సిన అవసరముంది. ●

# ప్రజావాక్కు



## సమన్వయమే సుసంపన్న పాలన

**ప్రధాన** కార్యదర్శుల సమావేశాన్ని ప్రధానమంత్రి ఆలోచనాత్మకమైనదిగా, దిశానిర్దేశకంగా ప్రశంసించడం దేశ పరిపాలనా వ్యవస్థలో సహకార సమాఖ్య భావన ఎంత కీలకమోమరోసారి స్పష్టంచేసింది.కేంద్రం-రాష్ట్రాల మధ్య బలమైన అనుసంధానం ఉన్నప్పుడే పాలన ఫలప్రదంగా ఉంటుందన్న సత్యాన్ని ఈ సమావేశం ప్రతిబింబించింది. ప్రధాన కార్యదర్శులు రాష్ట్రపరిపాలనకు మెదడు లాంటవారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే బాధ్యత వారిపైనే ఉంటుంది. ఈ నేపథ్యంలో వారితో నేరుగా సంభాషణ జరపడం ద్వారా, కేంద్రంఆదేశాలకే పరిమితంకాకుండా,భాగస్వామ్య పాలన వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. సమావేశాల్లో పాలనా సంస్కరణలు, సేవల సమర్థ పంపిణీ, పరిపాలనా సామర్థ్యం వృద్ధి వంటి అంశాలపై జరిగిన చర్చలు కాలానికి తగినవే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**తెలుగు** రాష్ట్రాలప్రభుత్వాలు ప్రయాణికుల రక్షణకై చొరవ తీసుకుని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను నిరంతరము పర్యవేక్షిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాహనాలపై చర్యలు తీసుకుని ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాలి.ఈ మధ్య రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి.ప్రభుత్వాలు రోడ్డుప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపటాలి. ట్రాఫిక్ నియమ నిబంధనలను అతిక్రమిస్తున్నప్రైవేటుట్రావెల్స్ యాజమాన్యలను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వాలు సురక్షి త రవాణాకై రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి.

- కె.రామకృష్ణ, నల్గొండజిల్లా

## వైభవం రావాలి !

**దేశవ్యాప్తంగా** 2024 -25 విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని ప్రభుత్వ పాఠశాలలు 5149 ఉన్నట్లు, వీటిలో అత్యధికంగా తెలంగాణాలోనే 2081 ఉన్నట్లుగా కేంద్ర విద్యాశాఖ ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన ఓ నివేదికలో పేర్కొంది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలకు వైభవం వచ్చేలా చేయాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

## న్యూ ఇయర్ వేడుకలలో అప్రమత్తంగా ఉండాలి

**యువత** డిసెంబర్ 31రాత్రి సంబరాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 2025లో తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ 2026 నూతన సంవత్సరంలోకి కొత్త ఆశలతో అడుగు పెట్టాలని యువత ఆశిస్తూ నూతన ఉత్సహంతో సంబరాలు చేసుకుంటారు. సంబరాల సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలి. అక్కడక్కడ మద్యం మత్తులో ఘర్షణలు పడే అవకాశాలు ఉంటాయి.వీటన్నిటిని దృష్టిలోపెట్టుకుని యువత బాధ్యతగా శాంతియుతంగా సంబరాలు చేసుకోవాలి. సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలు ప్రశాంతంగా వేడుకలు జరుపుకునేలా చూడాలి.

- మిద్దె సురేష్,నాగర్ కర్నూల్ జిల్లా

## ఉపాధి హామీ స్ఫూర్తి పోకూడదు

**సామ్రాజ్యవాద** విధానం అవలంబించే నేటి ప్రపంచంలో చుక్కానిలా తీసుకొచ్చిన ఉపాధిహామీ స్ఫూర్తి పోకూడదు అంటే తెలంగాణ లాంటి రాష్ట్రాలుడ్యూరబుల్ అస్సెస్ట్స్ మీద దృష్టి పెట్టాలి. పండ్ల తోటలు మీద దృష్టి పెట్టాలి. తెలంగాణలో పండ్ల తోటల వృద్ధి, కురగాయాల తోటలు అభివృద్ధి చేయాలి. అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఏ లక్ష్యం తొని అయితే ఉపాధి హామీ ప్రవేశ పెట్టబడిందో ఆ లక్ష్యం చేరాలి. ఇప్పుడు రాష్ట్రాలు చేయాల్సింది ఏమిటి సంక్షేమం పేరుతో అప్పులు తెచ్చి పప్పు బెల్లంలాగా పంచకుండా 40 శాతం నిధులు కేటాయించి పలవంతమైన ఉపాధి హామీ తెలంగాణలో సాధ్యం అని చూపాలి. ఇలా చేయడం వల్ల రైతులు లేదా కూలీల జీవన ప్రమాణ స్థాయిలు పెంచవచ్చు..

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న వాయు కాలుష్యం


**దేశంలో** మహా నగరాలు వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఉన్నాయి. దేశరాజధాని అందులో ప్రధానంగా ఉంది. పౌరులు తమ సొంత జీవన ప్రదేశాలను విడిచి వెళ్లలేరు. నివారణ చర్యలుకాగితాలమీదే ఉన్నంతకాలం వ్యక్తులబాధ్యత ,ఇంగితం ఉండదు. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికర వాయువులు ప్రవేశించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్తితి వస్తుంది. ఇది ఏ రీతిలో మనిషికి గొప్పతనం. అభివృద్ధి చేసే దిశలో ఏ రంగమైన దాని ప్రతికూలతలు సమాంతరంగా చూడాల్సిందే. ఈ విషయంలో ఆచరణ వివక్ష రహితంగా ఆదేశాలు ఉండాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

# ఆరావళి శ్రేణిని రక్షించే దిశగా కేంద్రం

డా.ఎ. భాగ్యరాజ్

**భూ**మి చరిత్రకే సాక్ష్యం ఆరావళి పర్వత శ్రేణులు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన పర్వత వ్యవస్థలలో ఒకటి. హిమాలయాలకన్నా పురాతనమైనవి ఆరావళి పర్వతాలని సుమారు 250 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడ్డాయని చెబుతారు. ఇవి గుజరాత్‌లో ప్రారంభమై రాజస్థాన్, హర్యానా మీదుగా ఢిలీవరకు సుమారు 700కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. థార్ ఎడారిలోని ఇసుక తుఫానులు, ఎడారి విస్తరణ గంగా మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, యూపి వ్యాపించకుండా ఇవి సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయి. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో అత్యధిక కాలుష్యం ఉన్నప్రాంతాలకు ఇవి 'గ్రీన్ లంగ్స్' లాంటవి. ఇవి గాలి నాణ్యతను పెంచడమే కాకుండా భూగర్భజల మట్టాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆరావళి శ్రేణి కేవలం సహజ అవరోధమే కాదు. వ్యవసాయం, జీవనోపాధికి మద్దతు ఇచ్చే చంబల్, సబర్మతి వంటి ప్రధాన నదులకు కూడా మూలం. ఈ పర్వతాలు రాగి, జింక్, సీసం, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మకరానా పాలరాయి వంటి ఖనిజాలకు నిలయం. తాజ్ మహల్ నిర్మాణానికి వాడిన రాయి కూడా ఇక్కడిదే.అందుకే మైనింగ్ మాఫియా దృష్టి ఈ పర్వతాలపై ఉంది. వాటిని కాపాడాల్సిన కేంద్రం రూల్స్ మార్చి మైనింగ్ మాఫియాకు సహకరిస్తోందన్న విమర్శలను ఎదుర్కొంటోంది. చుట్టుపక్కల ప్రాంతం కంటే కనీసం 200 మీటర్ల ఎత్తులో ఉన్న భూస్వరూపాలను మాత్రమే ఆరావళిలో భాగంగా పరిగణిస్తారని పేర్కొంటూ సుప్రీంకోర్టు నిర్వచనాన్ని ఆమోదించింది. దీనితో ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కేంద్రప్రభుత్వం డిసెంబరు 24న ఆరావళి పర్యావరణ వ్యవస్థ దీర్ఘకాలిక రక్షణకు పర్వతశ్రేణిలో కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేయడంపై పూర్తి నిషేధాన్ని ప్రకటించింది. ఆందోళనకు కారణాలు ప్రపంచంలోని అత్యంత పురాతనమైన పర్వతాల్లో తొంబై శాతం పర్వతాల కేటగిరీలోకి రావని అటవీశాఖ, కేంద్రం తేల్చేసింది. అక్కడ మైనింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా పర్యావరణవేత్తలు, కాంగ్రెస్ ఇతర పార్టీలు, అక్కడి ప్రజలుఆందోళన చేపట్టారు. సమాచారం వేగంగా తెలుసుకునే శక్తి, సోషల్ మీడియా ప్రభావం, ప్రశ్నించే ధైర్యం, అధికారాన్ని భయపడని తత్వం, ఈ తరం యువకులల్లోనేఉంది, అందుకే ఫలితం అందరి సహకారంతో కేంద్రం దిగివచ్చింది. సుప్రీం కోర్టుఎం.సి.మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002) కేసు తీర్పు



లో ఆరవళి పర్వతవ్యవస్థ మొత్తం మైనింగ్కు పూర్తిగా నిషేధం అని చెప్పింది. 2009 తీర్పులో ఫరీదాబాద్- గురుగ్రామ్-మేవాట్ ప్రాంతాల్లో ఆరవళి శ్రేణిలో మైనింగ్ను పూర్తిగా నిషేధిస్తూ కోర్టు పర్యావరణ హానిని తీవ్రంగా ఖండించింది.అంటే చట్టం ప్రకారం ఆరవళి రక్షిత భూభాగం. కానీ గత నవంబర్ నెలలో ఆరావళి పరిరక్షణపై సుప్రీంకోర్టు వరుస విచారణలు చేపట్టింది. ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్ను అరికట్టడంలో విఫలమైనందుకు రాజస్థాన్,హర్యానా ప్రభుత్వాలపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.శాస్త్రీయంగా పర్వతాల సరిహద్దులు నిర్ధారించే వరకు కొత్త మైనింగ్ లీజులు ఇవ్వకూడదని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తుఉంటే అది పర్వతం కాదు అనే వాదనను కోర్టు సమర్థిస్తూ, కొన్ని షరతులు పెట్టింది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినేలా ఏ నిర్ణయం ఉండకూడదని చెప్పింది. మైనింగ్ వల్ల ఇప్పటికే మాయమైన 31 కొండల విషయంలో కోర్టు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆప్రాంతాల్లో తిరిగి అడవులను పెంచాలని ఆదేశించింది. ఆర్థిక ప్రయోజనాల కంటే పర్యావరణ రక్షణే ప్రాధాన్యతని, ఆరావళి ధ్వంసమైతే ఉత్తర భారత దేశానికి నీటి ఎద్దడి ఎడారీకరణ ముప్పు తప్పదని హెచ్చరించింది. కానీ ఈతీర్పు ప్రకృతికి విరుద్ధమైనది. చుట్టుపక్కల ప్రాంతం కంటే కనీసం 100మీటర్ల ఎత్తులో ఉన్న భూస్వరూపాలను మాత్రమే ఆరావళిలో భాగంగా పరిగణిస్తారని పేర్కొంటూ సుప్రీం కోర్టు ఇటీవల ఒక కొత్త నిర్వచనాన్ని ఆమోదించింది. కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో కూడిన ప్రయత్నాల ద్వారా దృఢమైన రక్షణలో ఉన్నాయని, ఇందులో అన్ని రాష్ట్రాలలో ఆరావళి పర్వత శ్రేణిపూర్తి శాస్త్రీయ మ్యాపింగ్, మైనింగ్ కార్యకలాపాలపై స్థూల స్థాయి పర్యావరణ ప్రభావ అంచనా,రక్షిత ఆవాసాలు, జలవనరులు, పులుల కారిడార్లు వంటి పర్యావరణ సున్నితమైన ప్రాంతాలలో మైనింగ్ను కఠినంగా నిషేధించడం వంటివి ఉన్నాయని చెబుతోంది. పారిశ్రామికవేత్తలపైన ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదు. ఆరావళి ప్రాంతం సున్నపురాయి, పాలరాయి, ఇసుకరాయి, రాగి, జింక్ టంగ్స్టన్ వంటి ఖనిజాలతో సమృద్ధిగా ఉంది. చారిత్రాత్మకంగా ఈ వనరులు ఈ ప్రాంతాన్ని ఒక మైనింగ్ కేంద్రంగా మార్చాయి. ఇది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు,నిర్మాణ అవసరాలకు దోహదపడింది. 1975 నుండి 2019 మధ్య రాజస్థాన్లోని ఆరావళి శ్రేణి కొండలలో 7.6 (5,772.7 చదరపు కిలోమీటర్లు) కోల్పోయింది, ఈ నష్టంలో గణనీయమైన భాగం అక్రమ క్వారీయింగ్ వల్లే జరిగింది. ఆరావళి పర్వతాలని కాపాడటం అంటే మన నీటిని కాపాడటం, మన ఊపిరిని కాపాడటం, భారతదేశ భవిష్యత్తును కాపాడటం, ఆరావళి పర్వతాలు కూలితే మనభవిష్యత్తు ప్రశ్నార్థక కమౌతుంది. కేంద్ర ప్రభుత్వం తననిర్ణయాన్ని వెనక్కు తీసుకుని మైనింగ్ లీజుల అన్నింటిని రద్దు చేయడం హర్షించదగినది. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# మహారాష్ట్రలో పవార్ గ్రూపులు ఒకే బాట!

## స్థానిక ఎన్నికల్లో కలిసే పోటీ అంటున్న నేతలు

**ముంబయి, డిసెంబరు 29:** మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండేండ్ల క్రితం విడిపోయిన పవార్ కుటుంబం స్థానిక ఎన్నికల వేళ కలిసిపోయింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, శరద్ పవార్ ఒక్కటయ్యారు. త్వరలో జరగబోయే పింప్రి చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్‌సీపీ (ఎస్పీ)ఎన్‌సీపీ కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని అజిత్ పవార్ స్వయంగా ప్రకటించారు. పవార్ పరివార్ (కుటుంబం) మళ్లీ కలిసింది అని ప్రకటించారు. జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోందని తెలిపారు. త్వరలో అధికారిక ప్రకటన వస్తుందని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇప్పటికే ఠాక్రే సోదరులు కలిసిపోయిన విషయం తెలిసిందే. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. విభేదాలతో విడిపోయిన శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుధవారం ఒకే వేదికపై కన్పించారు. వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరూ కలిసి పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు పవార్ ఫ్యామిలీ కూడా ఒక్కటి కావడంతో మహా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి. మహారాష్ట్రలో తమ పట్టును నిరూపించుకోవడం కోసమే అటు పవార్ కుటుంబ ఇటు ఠాక్రే కుటుంబాలు ఒక్కటి అయ్యాయి. నిజానికి ముంబయి మున్సిపల్ ఎన్నికలే కాకుండా మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో శివసేనకు మంచి పట్టు ఉన్న సంగతి తెలిసిందే. శివసేన చీలిపోయిన తర్వాత మహారాష్ట్ర సీఎంగా ఏక్‌నాథ్‌షిండే రావడం తదనంతరం ఎన్సీపీని చీల్చి అజిత్‌పవర్ బిజెపికి మద్దతు పలికి ఉప ముఖ్యమంత్రిపోస్టు రాబట్టుకోవడం వంటిపరిణామాలనేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయాల్లో అనిశ్చితి నెలకొంది. మరోపక్క బిజెపి బలపడుతున్నదని గ్రహించిన ఈరెండు పార్టీలు తమ మద్దతులేకుండా గెలిచే అవకాశం వారికి ఇవ్వకుండా ఉండేందుకే మళ్లీ ఈ గ్రూపులన్నీ ఒక్కటి అవుతున్నట్లు కనిపిస్తోంది. ఇక కాంగ్రెస్ పరిస్థితి చెప్పాల్సివస్తే ఇప్పటికీ ఆ పార్టీకి మరింతగా ఆక్సిజన్ అందాల్సి ఉంది. స్థానిక ఎన్నికల్లో పట్టును నిలుపుకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి కొంత మెరుగుపడుతుందన్న భావన ఆపార్టీ కేడర్‌లోనే వ్యక్తం అవుతోంది.

# సుప్రీంకోర్టు మాజీ సిజెఐ పేరు చెప్పి ఆన్‌లైన్‌లో నకిలీ విచారణ..

## ఏకంగా రూ.3.7 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

**ముంబయి, డిసెంబర్ 29:** డిజిటల్ అరెస్ట్.. ఈ మధ్య చాలా మందిని భయపెడుతోన్న తీవ్ర సమస్య ఇది. దీనిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ అనేక మంది ఈ తరహా సైబర్ మోసాల బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా ముంబయిలోనూ మరో ఘటన వెలుగుచూసింది. డిజిటల్ అరెస్ట్ అంటూ ఓ మహిళను భయపెట్టిన కేటుగాళ్లు ఏకంగా సుప్రీంకోర్టు మాజీ సిజెఐ పేరు చెప్పి ఆన్‌లైన్‌లో నకిలీ విచారణ చేపట్టారు. ఆమె నుంచి రూ.3.7 కోట్లు కాజేశారు. వివరాల్లోకి వెళితే ముంబయిలోని అంధేరీ వెస్ట్ ప్రాంతంలో నివాసముంటున్న 68 ఏళ్ల మహిళకు ఈ ఏడాది ఆగస్టులో ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆ తర్వాత నుంచి వరుసగా పోలీసులు, సిబిఐ అధికారులంటూ పలువురు ఆమెకు వాట్సప్, వీడియో కాల్స్ చేశారు. ఆమె ఆధార్‌కార్డును ఉపయోగించి ఓ బ్యాంకు ఖాతా తెరిచినట్లు నిందితులు తెలిపారు. ఆ ఖాతాతో రూ.6 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిపినట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదైందంటూ ఓ డిజిటల్ కాపీని పంపించారు. అందులో సిబిఐ లోగో, ఇతరత్రా వివరాలు ఉండటంతో నిజమేనని నమ్మిన బాధితురాలు వారు అడిగినట్లుగా తన సొంత బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ఆస్తుల గురించి చెప్పారు. ఈ కేసులో డిజిటల్ అరెస్టు చేశామని నమ్మించిన నిందితులు ఆన్‌లైన్‌లో విచారణకు హాజరవ్వాలని బెదిరించారు. కొన్ని రోజుల తర్వాత సుప్రీంకోర్టు మాజీ సిజెఐ పేరుతో ఓ వ్యక్తి ఆమెను విచారించి ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తున్నట్లు చెప్పాడు. అంతేకాదు వెరిఫికేషన్ కోసం తన వద్ద ఉన్న డబ్బంతా సిబిఐకి డిపాజిట్ చేయాలని న్యాయమూర్తిగా నటించిన వ్యక్తి ఆదేశించాడు. బాధితురాలు చేసేది లేక పలు బ్యాంకు ఖాతాలకు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇలా ఈ ఏడాది అక్టోబర్ వరకు పలు దఫాలుగా దాదాపు 3.71 కోట్ల వరకు బదిలీ చేశారు. ఆ మొత్తాన్ని వెరిఫై చేసి తిరిగి అప్పగిస్తామని ఆమెను నమ్మించిన కేటుగాళ్లు ఆ తర్వాత కాంటాక్ట్ కట్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతోకేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్‌లోని ఓ వ్యక్తి ఈ పనిచేసినట్లు గుర్తించిన పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

# చికెన్‌నెక్ పొరపాటును సరిచేయాల్సిందే!



## ఈశా ఫౌండేషన్ సద్గురు జగ్గీవాసుదేవ్

**బెంగళూరు,డిసెంబరు 29:** దేశ విభజన సమయంలో ఏర్పడిన సిలిగురి కారిడార్(చికెన్‌నెక్) 78 ఏళ్ల నాటి ఒక అసాధారణ పొరపాటు అని, దశాబ్దాల క్రితమే దాన్ని సరిదిద్దాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని సద్గురు సన్నిధిలో జరిగిన ఒక సత్సంగ్‌లో, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సిలిగురి కారిడార్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన సోషల్‌మీడియాలోపోస్టుచేసారు. దేశ సార్వభౌమాధికారానికి బహిరంగ ముప్పు పొంచి ఉన్నందున, ఆ చికెన్‌నెక్‌ను పోషించి ఏనుగుగా మార్చాల్సిన సమయం వచ్చిందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. 1971 బంగ్లాదేశ్ విమోచన యుద్ధం తర్వాత వచ్చిన అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని సద్గురు పేర్కొన్నారు. 1946-47లో మనకు ఆ అధికారం లేకపోయి ఉండొచ్చు, కానీ 1972లో మనకు పూర్తి అధికారం ఉంది. అయినా మనం ఆ పని చేయలేదని ఆయన గుర్తుచేశారు. దేశ ప్రాదేశిక సమగ్రతను బలోపేతం చేయడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశాలు బలహీనంగా ఉంటే నిలబడలేవు. కోడిలా ఉంటే సరిపోదు, ఏనుగులా ఎదగాలి. దానికి పోషణ అవసరం కావచ్చు, కొన్నిసార్లు స్టెరాయిడ్లు కూడా అవసరం కావచ్చు. ఏది అవసరమైతే అది చేయాలని సద్గురు వ్యాఖ్యానించారు. ప్రపంచంలో సరిహద్దులు లేకపోవడం ఒక ఆదర్శమే అయినా, ప్రస్తుత పరిస్థితుల్లో అది ఆచరణ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఈ పొరపాటుకు తగిన దిద్దుబాటు చర్యలు జరగాలని ఆయన స్పష్టం చేశారు.

# ఆరావళి.. పాత ఉత్తర్వులపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** ఆరావళి పర్వతాలకు సంబంధించి గతంలో జారీ చేసిన ఆదేశాలను సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. స్థానిక భూమి ఉపరితలం నుంచి 100 మీటర్లు లేదా అంతకుమించి ఎత్తున ఉన్నవి మాత్రమే ఆరావళి పర్వతాలుగా పరిగణించబడతాయని, అంతకన్నా తక్కువ ఎత్తున ఉన్నవి ఆరావళి పర్వత శ్రేణుల పరిధిలోకి రావంటూ గతనెల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. గత నెల ఇచ్చిన తన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జె.కె. మహేశ్వరి, ఎ.జి. మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆరావళి పర్వతాలకు సంబంధించి నిపుణుల కమిటీ నివేదికతోపాటు సుప్రీంకోర్టు పరిశీలనలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని గమనించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం, సిఫార్సులు లేదా న్యాయపరమైన ఆదేశాలను అమలు చేయడానికి ముందు మరింత స్పష్టత అవసరమని పేర్కొంది. పర్యావరణ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఆదేశించింది.

నాలుగు రాష్ట్రాల సిఎస్‌లను ఈ కమిటీలో సభ్యులుగా నియమించుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ ముప్పునకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. కొత్త కమిటీ నివేదిక వచ్చే వరకు

> పర్యావరణ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
> సభ్యులుగా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల సిఎస్‌లు
> త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలు
> కేంద్రం, 4 రాష్ట్రాలకు నోటీసులు
> విచారణ జనవరి 21కి వాయిదా



నవంబరు 20న ఇచ్చిన తీర్పును నిలిపివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశంపై తగిన వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, హర్యానాల రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసఇంది. ఈ "కమిటీ సిఫార్సులు, ఈ కోర్టు ఆదేశాలను నిలిపివేయడం అవసరమని తాము భావిస్తున్నాం. ఈ కొత్త కమిటిని ఏర్పాటు చేసే వరకు ఈ స్టే అమలులో ఉంటుంది" అని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ ఎజి మసిహ్ సభ్యులుగా ఉన్న త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 21కి వాయిదా వేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పును కేంద్ర ప్రభుత్వం స్వాగతించింది. ఆరావళి పర్వతాల పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పునరుద్ఘాటించారు.

ఆరావళి పర్వతాల సమస్యను అధ్యయనం చేసేందుకు కొత్త కమిటీని నియమించడాన్ని ఆయన స్వాగతించారు.

సుప్రీం నిర్ణయంపై అటు కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని

రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లాట్, ఎంపి జైరాం రమేష్ తెలిపారు.

# భారత ప్రభుత్వానికి లలిత్‌మోడీ క్షమాపణలు..



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** మనీలాండరింగ్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ బ్రిటన్‌కు పరారైన ఐపిఎల్ ఫౌండర్ లలిత్ మోడీ భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పారు. ఇటీవల విజయ్ మాల్యాతో కలిసి చేసుకున్న పార్టీలో లలిత్ మోడీ మాట్లాడుతూ తాము అతిపెద్ద పలాయన వాదులమంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంతో లలిత్‌మోడీ, విజయ్‌మాల్యా దేశాన్ని మోసం చేసి, పారిపోవడమే కాకుండా విదేశాల్లో భారత్‌ను బహిరంగంగా అపహాస్యం చేస్తున్నారని నెటిజన్లు మండిపడ్డారు. దీనిపై లలిత్‌మోడీ స్పందిస్తూ తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తనకు భారత ప్రభుత్వం అంటే చాలా గౌరవం ఉందని పేర్కొన్నారు. కాగా బ్యాంకులను మోసం చేసిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ దేశం నుంచి పరారై లండన్‌లో ఉంటున్న విజయ్ మాల్యా 70వ పుట్టినరోజు ఇటీవల జరిగింది. దీనికి హాజరైనా లలిత్ మోడీ మాల్యాతో వీడియో తీసుకుంటూ తాము అతిపెద్ద పలాయనవాదులుగా నిలిచామని వ్యాఖ్యానించారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ 'లెట్స్ బ్రేక్ ద ఇంటర్నెట్ డౌన్ ఇన్ ఇండియా ఎగెయిన్' అని క్యాప్షన్ పెట్టారు. లలిత్ మోడీ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

# సెంగార్‌ను విడుదల చేయొద్దు

## ఉన్నావ్ అత్యాచార కేసులో ఢిల్లీ హైకోర్టు - ఉత్తర్వులపై సుప్రీం స్టే

### - అతడికి మరణశిక్ష విధించాలని బాధితురాలి డిమాండ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** 2017 ఉన్నావ్ అత్యాచారం కేసులో కుల్దీప్ సింగ్ సెంగార్‌కు జీవిత ఖైదును నిలిపివేసి, బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. 'ఒక దోషి లేదా విచారణలో ఉన్న వ్యక్తిని విడుదల చేసేటప్పుడు, ఆ వ్యక్తులను విచారించకుండా ఈ కోర్టు సాధారణంగా అటువంటి ఉత్వర్వులను నిలిపివేయదని తమకు తెలుసు. కానీ, ప్రత్యేక నేరానికి దోషిగా తేలిన వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని, ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తున్నాం" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సిబిఐ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ కుల్దీప్ సెంగార్‌కు నోటీసు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. వివాదాస్పద ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సెంగార్ కస్టడీలోనే ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సెంగార్‌కు మరణశిక్ష విధించాలి: అత్యాచార బాధితురాలు ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలిన ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు మరణశిక్ష విధించాలని అత్యాచార బాధితురాలు డిమాండ్ చేశారు. అప్పుడే తన తండ్రికి న్యాయం జరుగుతుందని అన్నారు.

ఇప్పటి వరకు తన తండ్రికి అంత్యక్రియల తంతు నిర్వహించలేదని చెప్పారు. సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించిన అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ... 'నా తండ్రి 2018లో చంపబడ్డారు, అప్పటి నుంచి ఆయన ఆత్మకు శాంతి లభించలేదు. హంతకులను, అత్యాచారానికి పాల్పడిన వారిని ఉరితీసినప్పుడే నా తండ్రి ఆత్మకు శాంతి లభిస్తుంది. అప్పుడే నా తండ్రికి న్యాయం జరుగుతుంది' అని ఆమె అన్నారు. తనకు సుప్రీంకోర్టుపై నమ్మకం ఉంది, న్యాయం చేస్తుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు.

# మెక్సికోలో పట్టాలు తప్పిన ప్యాసింజర్

## 13 మంది మృతి, 98 మందికి తీవ్రగాయాలు



**మెక్సికోసిటీ, డిసెంబరు 29:** మెక్సికోలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఒక్సాకాలో ఇంటర్‌ఓషియానిక్ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 13 మంది దుర్మరణం చెందారు. మరో 98 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సుమారు 250 మంది ప్రయాణికులు, 9 మంది సిబ్బందితో ఆదివారం బయల్దేరిన రైలు ఆసెన్సియాన్ ఎల్‌క్సాస్టెల్ సమీపంలోని నిజాండా వద్ద పట్టాలు తప్పిందని అధికారులు వెల్లడించారు. రైలు పట్టాలు తప్పిందని సమాచారం అందుకున్న మెక్సికన్ ఆర్మీ, సివిల్ ప్రొటెక్షన్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న ప్రయాణికులను వెలికితీశారు. వారిలో 139 మంది సురక్షితంగా బయటపడ్డారని, 98 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కాగా, రైలు ప్రమాదంపై మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షిన్బామ్ పార్డో విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సహాయం చేసేందుకు ఉన్నతాధికారులను ఘటనాస్థలికి పంపించినట్లు పేర్కొన్నారు. రైలు ప్రమాదంపై ఒక్సాకా గవర్నర్ సాలోమన్ జారా క్రూజ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఫెడరల్ ఏజెన్సీలతో కలిసి సహాయక చర్యలు, వైద్య సేవలు సమన్వయం చేసుకుంటామని తెలిపారు. రైలు ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని మెక్సికో అటార్నీ జనరల్ ఎర్నెస్టినా గోడోయ్ రామోస్ తెలిపారు.

# హిందీలో మాట్లాడుతోందని కన్నకూతుర్ని హత్య చేసిన తల్లి

**ముంబై, డిసెంబరు 29:** మాతృభాషలో కాకుండా హిందీలో కుమార్తె మాట్లాడటంపై తల్లి ఆగ్రహించి ఆ చిన్నారి గొంతునొక్కి హత్య చేసింది. తొలుత గుండెపోటుతో ఆ బాలిక మరణించినట్లుగా నమ్మించేందుకు తల్లి ప్రయత్నించింది. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ గురుసంకల్ప్ హౌసింగ్ సొసైటీలో నివసిస్తున్న 30 ఏళ్ల మహిళకు ఆరేళ్ల కుమార్తె ఉన్నది. ఆ చిన్నారికి చిన్నప్పటి నుంచి మాటలకు సంబంధించిన సమస్య ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ బాలిక మరాఠీ బదులు ఎక్కువగా హిందీలో మాట్లాడుతున్నది. బాలిక తల్లి దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పలుమార్లు భర్తకు ఫిర్యాదు చేసింది. అయితే మరాఠీ బదులు ఎక్కువగా హిందీలో మాట్లాడుతున్నదన్న కోపంతో కుమార్తెను హత్య చేసేందుకు ఆమె ప్లాన్ వేసింది. ఈనెల 23న రాత్రి వేళ గొంతునొక్కి చంపింది. పని నుంచి ఇంటికి తిరిగి వచ్చిన మహిళ భర్త కుమార్తె అచేతనంగా ఉండటాన్ని గమనించాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ బాలిక అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. గుండెపోటు కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు పోలీసులకు

ఈ సమాచారం తెలిసింది. అయితే చిన్నారి మరణంపై పోలీస్ అధికారికి అనుమానం కలిగింది. దీంతో ప్రత్యేక పోస్ట్‌మార్టం పరీక్షకు ఆదేశించారు. ఊపిరాడకపోవడంతో ఆ బాలిక మరణించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఆ చిన్నారి తల్లిదండ్రులను పోలీసులు ప్రశ్నించారు. ఆరు గంటల పాటు విచారణ తర్వాత కుమార్తెను హత్య చేసినట్లు తల్లి అంగీకరించిందని,

ఆమెను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఆ మహిళ మానసిక చికిత్స పొందుతున్నట్లు తెలిసిందని వెల్లడించారు.

# సంక్షిప్తంగా..

## బంగ్లా చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం: అమిత్ షా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ పొరుగుదేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. అస్సాంలో కాంగ్రెస్ ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు.

## చైనా - తైవాన్ మధ్య ఉద్రిక్తతలు..




**బీజింగ్, డిసెంబరు 29:** తైవాన్‌ను రక్షించేందుకు అవసరమైతే తాము రంగంలోకి దిగుతామని జపాన్ ప్రధాని సనాయె తకాయిచి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఉద్రిక్తతలను రాజేశాయి. తాజగా చైనా దళాలు తైవాన్‌ను చుట్టుముట్టి భారీ ఎత్తున యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే ఆ దేశ వాయుసేన, నేవీ, రాకెట్ ఫోర్స్ దళాలు తైవాన్ సమీపంలోకి తరలించే పనిలో బీజింగ్ నిమగ్నమైంది. తాజాగా చైనాకు చెందిన పిఎల్‌ఎ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సీనియర్ కర్నల్ షి యీ మాట్లాడుతూ తాము 'జస్టిసన మిషన్ 2025' పేరిట తైవాన్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించారు. సముద్ర, గగనతల యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకోవడం, ద్వీప సమూహాల బయట బ్లాకేడ్స్ నిర్వహించడం వంటివి చేయనున్నట్లు చెప్పారు.

## కువైట్‌లో వీసా, రెసిడెన్సీ అనుమతుల కోసం ఇ సర్వీస్ ప్రారంభం



**కువైట్ సిటీ, డిసెంబరు 29:** విదేశీ కార్మికులకు వీసా, నివాస విధానాలను సరళీకృతం చేయడానికి కువైట్ కొత్త ఎలక్ట్రానిక్ సేవలను ప్రారంభించింది. విదేశీ ఉద్యోగులకు త్వరిత, మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇకపై వీసా పునరుద్ధరణ, రెసిడెన్సీ పర్మిట్ల బదలీ వంటి సేవల కోసం విదేశీయులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా.. అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చని తెలియజేసింది. జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెసిడెన్సీ సమన్వయంతో ఈ సేవలను అభివృద్ధి చేసినట్లు జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ నూతన సంస్కరణలను కువైట్ ఇమిగ్రేషన్ వ్యవస్థ పరిశీలిస్తోందన్నారు.

## రేబిస్ భయంతో 200 మందికి టీకాలు!




**లక్నో, డిసెంబర్ 29:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బుదౌన్ జిల్లాలో రేబిస్ వ్యాధి కలకలం సృష్టించింది. పిప్రౌలి గ్రామంలో రేబిస్ వ్యాధితో ఓ గేదె మృతిచెందడం భయాందోళనలకు గురిచేసింది. దీంతో ముందు జాగ్రత్తగా ఆ గ్రామంలోని 200 మందికి యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పిప్రౌలి గ్రామంలో ఈనెల 23వ తేదీన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గ్రామస్తులకు భోజనంలో రైతా వడ్డించారు. అయితే ఆ రైతా తయారీకి వాడిన పాలు మొత్తం అదే గ్రామానికి చెందిన ఓ గేదెవి. ఆ గేదెను కొద్దిరోజుల ముందు ఓ కుక్క కరిచింది. ఈ క్రమంలోనే ఈనెల 26వ తేదీన ఆ గేదె అకస్మాత్తుగా మరణించింది. అయితే గేదె మరణించడానికి ముందు దానిలో రేబిస్ లక్షణాలు కనిపించడంతో గ్రామస్తుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు.

# బలోచ్ వేర్పాటు గ్రూపుల దాడుల్లో 15 మంది పాక్ సైనికులు మృతి

**రావల్పిండి, డిసెంబరు 29:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్నాయి. బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఎ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈనెల 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఎ ప్రతినిధి జీయంద్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మరోసారి ఈనెల 25న చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు ది బలూచిస్థాన్ పోస్ట్ పేర్కొంది. మరోవైపు, ఈనెల 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు. నసీరాబాద్ జిల్లాలో పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్రం వచ్చేవరకు ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది.

# వైద్యానికి డబ్బుల్లేక ప్రాణాలు కోల్పోయిన 39 మంది రిటైర్డు ఉద్యోగులు

### రిటైర్‌మెంట్ బెనిఫిట్ మంజూరుచేసి ఆర్థిక భద్రత కల్పించండి

### ఎప్పటి నుంచి ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలుచేస్తారు?

### ఆరు డిఎల బకాయిలు పిఆర్‌సి అమలుపై గళమెత్తిన హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రిటైరయిన ఉద్యో గులు తమకు రావలిసిన బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులకు గురవు తున్నారని, డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. శాసనసభలో జీరో అవర్‌లో ఆయన ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ ఉద్యోగుల ప్రావిడెంట్‌ఫండ్ గ్రాట్యుటీ, పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్ వెంటనే మంజూరు చేసి పదవి విరమణ చేసిన ఉద్యోగుల ఆర్థికభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని సిద్దిపేట ఎమ్మెల్యే సభదృష్టికి తీసుకొచ్చారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కరారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సి న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు.తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్స రాలు పూర్తయినా ఉద్యోగుకలకు పిఆర్‌సి ఇవ్వలేదు. గతంలో కెసిఆర హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పిఆర్‌సి ఇచ్చామని చెప్పారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జిపిఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని సూచించారు.తెలంగాణ లో ఎప్పటి నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేస్తారని ఆయన నిలదీశారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్‌కు సంబంధించిన చెల్లింపులు కూడా చేయడంలేదని ఆయన ఆరోపించారు. సిపిఎస్ పెన్షన్ స్కీమ్‌ను ఒపిఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సిపిఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సి న కాంట్రిబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సిపిఎస్ కట్టకుండా, ఒపిఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సిపిఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. సిపిఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఒపిఎస్ త్వరగా అమలు చేయాలని ఆయన చెప్పారు.

## ట్రెజరీ బెంచీలవైపు కూర్చున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** శాసనసభలో ఫిరాయింపు ఎమ్మెల్యేలుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ట్రెజరీ బెంచీల వైపు కూర్చున్నారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి బిఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు ఇటీవల స్పీకర్ ప్రకటించినప్పటికీ ట్రెజరీ బెంచీలవైపు కూర్చున్నారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఫిరాయింపు ట్రెజరీ బెంచిలో కూర్చోవడాన్ని గతంలో బిఆర్ఎస్ తప్పు పట్టిన విషయం తెలిసిందే.

## గల్ఫ్ వలసదారుల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయండి

### బిజెపి శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

### హైదరాబాద్ వరల్డ్‌క్లాస్ సిటీ మాటలు థర్డ్‌క్లాస్ : వెంకటరమణరెడ్డి



**హైదరాబాద్ డిసెంబరు 29, ప్రభాతవార్త :** గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న కార్మికులపై దృష్టి పెట్టాలని అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మన ఊరుమన బడికి నిధులు రావడం లేదని విమర్శలు చేశారు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిహెచ్ఎంసి పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు. 70వేల ముస్లిం ఓట్లు ఎలా పెరిగాయని ఆయన నిలదీశారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ నుంచి ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు మంత్రులు దిగజారి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ వరల్డ్ క్లాస్ సిటి అంటున్నారు మాటలు మాత్రం థర్డ్ క్లాస్‌గా ఉంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతులు మాట్లాడటం రాజకీయాలా అని ఆయన నిలదీశారు. ఒకరు తప్పుమాట్లాడితే మరొకరు సవరించాలని ఒకరిని మించి ఒకరు మట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సభగౌరవం కాపాడేలా మేం కట్టుబడి ఉన్నామని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ 116కోట్లతో నిర్మించతలపట్టిన కళాభారతి కేవలం 50కోట్లు మాత్రమే వ్యయం చేశారని కళాకారులకు ఇదివేదికగా మారేలా తొందరగా నిర్మించాలని కోరారు.

## కోతుల బెడదపై దృష్టి సారించాలి

### జీరో అవర్‌లో ఎమ్మెల్యేల వినతి.. జనవరి 2కు అసెంబ్లీ వాయిదా

**హైదరాబాద్,డిసెంబరు 29,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా కోతుల బెడద పెరిగిందని ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కోతుల వల్ల రైతులకు పంట నష్టం జరుగుతోందని, అవి దాడులు చేయడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. జీరో అవర్‌లో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ జీరో అవర్‌లో మాట్లాడుతూ కోటి పదిలక్షల రేషన్‌కార్డులు ఇచ్చామని ప్రతి తండాలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోతుల బెడద నివారించాలని సభ దృష్టికి తెచ్చారు. జీరో అవర్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు షాబాద్ బండలు వాడటం కోసం మైనింగ్ పాలసీ తేవాలని సూచించారు. వేముల వీరేశం మాట్లాడుతూ లారీల ఫిట్‌నెస్ రిన్యూవల్‌ఫీజు కేంద్రం ఇబ్బడి ముబ్బడిగా పెంచిందని దానిని సవరణకు చొరవ చూపాలని కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ మొక్కజొన్న సోయా కొనుగోలు చేయాలని కోరారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ హుస్నాబాద్ మధ్య గానుగపాడు బ్రిడ్జి కట్టాలని చేర్యాలను రెవెన్యూడివిజన్‌గా చేయాలని కోరారు. తూటిమేఘారెడ్డి నాగవరం రెవెన్యూడివజిన్‌గా ప్రకటించాలని కోరారు. గాంధీ మాట్లాడుతూ షేర్‌లింగంపల్లి చెరువులు పరిక్షణ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ పదిశాతం పూర్తిచేస్తే భువనగిరి, తుంగతురినత, నకిరేకల్, ఆలేరు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు కొరత ఉండదని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాలం సవావేశాలు జనవరి 2 శుక్రవారంకు వాయిదా వేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటన చేశారు.

## తిరుమలలో తెలంగాణ భవన్ నిర్మించాలి

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**హైదరాబాద్ డిసెంబరు 29, ప్రభాతవార్త :** తిరుపతి తిరుమలలో తెలంగాణభవన్ నిర్మించడానికి ప్రభుత్వం చొరవతీసుకోవాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగులకమలాకర్ అన్నారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ తిరుమలలో తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలకు సొంతభవనాలు ఉన్నాయని తెలంగాణ నుంచి తిరుమల వెంకటేశ్వరుడి దర్శనంకు వెళ్ళిన వారికి కూడా సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన వివరించారు. తెలంగాణభవన్ కట్టడానికి కెసిఆర్ ముఖ్యమంత్రిగా శబరిమలైలో ఐదు ఎకరాల భూమిని కేరళ ప్రభుత్వం నుంచి కేటాయింపు చేయించుకొన్నారని 50కోట్ల రూపాయలు కేటాయించారని ఆయన గుర్తుచేశారు. జీరో అవర్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు గళం విప్పారు. వేముల ప్రశాంతరెడ్డి మాట్లాడుతూ భీంగల్ వంద పడకల ఆస్పత్రి తమ హయాంలోనే మంజూరైందని తెలిపారు. దాదాపు 85 శాతం పనులు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. రూ.5 కోట్లు విడుదల చేస్తే మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాటాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని 8 మండలాల్లో రెట్టింపు వరి సాగు చేశారని తెలిపారు. యూరియా వస్తుందో లేదననే ఆందోళనలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. యాప్ ద్వారా యూరియా విషయంలో రైతులు ఆగమాగం అవుతున్నారని చెప్పారు. గ్రామాల్లో కరెంటు సరఫరా సక్రమంగా కావడం లేదని తెలిపారు. కూడవెల్లివాగు కాల్వలు పూడిక తీయకపోవడంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేదని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ కాల్వలు కూడా పూడుకుపోయాయని పేర్కొన్నారు. వాడి పూడిక తీయకపోవడంతో కాల్వల మీధ ఆధారపడ్డ రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇరిగేషన్‌పై సంబంధిత మంత్రి ఏనాడూ రివ్యూ పెట్టింది లేదని కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవడం లేదని తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాల రైతులను ఆదుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీలు సభలో సెల్‌ఫోన్ వాడరాదు

### ఆర్డర్ పాస్ చేసిన మండలి ఛైర్మన్

### సభలో స్పెషల్ మెన్షన్‌లు, పిటిషన్ల ప్రస్తావన

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** శాసనమండలిలో ఇకపై ఎమ్మెల్సీలు ఎవరూ కూడా సభలో ఉన్న సమయంలో సెల్‌ఫోన్ వాడరాదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆర్డర్ పాస్ చేశారు. సోమవారం ప్రారంభమైన శాసనమండలి శీతాకాల సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యులుగా పనిచేసి మరణించిన ఇద్దరు సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం స్పెషల్ మెన్షన్స్‌తోపాటు పిటిషన్లను తీసుకున్న తరువాత సభను జనవరి 2(శుక్రవారం)కి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు మాజీ సభ్యుల మృతికి శాసనమండలి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం సభలో ప్రత్యేక ప్రస్తావనలు(స్పెషల్ మెన్షన్స్) చేయాలని సభ్యులకు సూచించారు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. ఈ సందర్భంగా సభ్యులు నెల్లికంటి సత్యం, ప్రతిపక్ష నేత మధుసూదనాచారితోపాటు సభ్యులు దేశపతి శ్రీనివాస్, ప్రసాదరావు, తీన్మార్ మల్లన్న, దాసోజు శ్రవణ్‌కుమార్, మల్క కొమరయ్య, వాణిదేవి, బసవరాజు సారయ్య, అంజిరెడ్డి వివిధ అంశాలపై స్పెషల్ మెన్షన్లు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాధారణంగా మండలి సభ్యులుగా పనిచేసిన వారికి సభలో సంతాపం ప్రకటించడం ఆనవాయితీ అన్నారు. కానీ ప్రత్యేక పరిస్థితుల రీత్యా తన పాటతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహారించి, రాష్ట్ర గీతం రచించిన రచయిత, గాయకుడు అందెశ్రీ మృతికి సభలో సంతాపం ప్రకటించడం పరిశీలించాలని కోరారు. అందుకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరిశీలిద్దామన్నారు. తీన్మార్ మల్లన్న స్పెషల్ మెన్షన్ ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 1128 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వాటిని భర్తీ చేయాలని సూచించారు. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ ఉపాధ్యాయ బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రత్యేకంగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రస్తావించారు. "రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపి)–2020 ను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తంలో వచ్చే నిధులతో ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు వారికి బంగారు భవిష్యత్తును అందించవచ్చన్నారు.

మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాల్లో ఉపాధ్యాయులు చాలా ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. రూ.10 వేలు, రూ.12 వేలు, రూ.20 వేలతో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. వారికి పే స్కేలు అమలు చేయడంతోపాటు వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న దాదాపు 3 వేల మంది రెగ్యులర్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి.. వారికి 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రస్తావించారు. రాష్ట్రంలో డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. పీఆర్సీ ఇవ్వలేదు. వీటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సభ్యులు చెప్పిన స్పెషల్ మెన్షన్స్‌ను నోట్ చేసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఈ సమయంలోనే కొందరు ఎమ్మెల్సీలు ఫోన్‌లు వాడటం గమనించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇకపై సభలో సభ్యులు సెల్‌ఫోన్ వాడటంపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం పిటిషన్లను సమర్పించాలని ఛైర్మన్ సూచించారు. పిటిషన్ల సమయంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులపై ప్రభుత్వం ప్రత్యేకంగా విధాన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు మరణిస్తే ఇక్కడికి తీసుకురావడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని.. దానిని నివారించేలా చూడాలన్నారు. వారికోసం ప్రత్యేకంగా ప్రవాస ఆరోగ్యశ్రీని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో తాము పిటిషన్లను సభలో ప్రవేశ పెడుతున్నాము తప్ప వాటికి సమాధానం రావడం లేదని ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో స్పందించిన ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఇతర ఉన్నతాధికా రులతో మాట్లాడామని పెండింగ్‌లో ఉన్న సమస్యలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్(ఏటిఆర్) ఇచ్చేలాగా చూడాలని ఆదేశించామన్నారు. తదుపరి సమావేశాల్లో దీనిని సభ్యులకు తెలియజేస్తామని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభకు తెలిపారు. అనంతరం సభను జనవరి 2(శుక్రవారం)కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

## కెసిఆర్ వస్తున్నారని చాలా హడావిడి

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



**హైదరాబాద్ డిసెంబరు 29, ప్రభాతవార్త:** రెండు సంవత్స రాలుగా అసెం బ్లీకి హాజరు కాని కేసీఆర్ ఈసారి వస్తున్నారని బీఆర్ఎస్ నేతలు చాలా హడావిడి చేశారని, కేసీఆర్ రావడం, సంతకం పెట్టడం, వెళ్ళిపోవడం నిమిషాల వ్యవధిలో జరిగిపోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మరణించిన మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం ప్రకటించకుండా వెళ్లిపోయారంటే శాసనసభ సభ్యులపై ఉన్న గౌరవం ఏంటో అర్థం అవుతుందని విమర్శించారు. కేసీఆర్ వస్తున్నారంటే హడావిడి ఎందుకు? అని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ప్రజలు ఎన్నుకున్నారని, అసెంబ్లీని కేసీఆర్ కుటుంబం రాజకీయ వేదికగా మార్చుకోవద్దని సూచించారు. ఒక ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీలో చర్చలో పాల్గొనాల్సి న బాధ్యత కేసీఆర్ పై ఉందని అన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలపై మాత్రమే కాదు, గత పదేళ్లలో కృష్ణా నీటి వాటాల విషయంలో జరిగిన నష్టంపై కూడా చర్చ అసెంబ్లీలో జరుగుతుందని ఆయన తెలిపారు.

## నీటి వాటాపై చర్చలో పాల్గొనాలి

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి రెండేళ్లు అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ మొక్కుబడిగా సంతకం పెట్టడానికి వస్తున్నారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విమర్శించారు. దళితుడు స్పీకర్ గా ఉన్నారు కాబట్టి కేసీఆర్ వారిని గౌరవించాలన్నారు. తన సభ్యత్వాన్ని కాపాడుకోవడానికి అసెంబ్లీకి వచ్చి వెళ్లారని ఆరోపించారు. చనిపోయిన వారికి నివాళులు అర్పించకుండా కేవలం మూడు నిమిషాల్లో కేసీఆర్ అసెంబ్లీ నుండి తిరిగి వెళ్లిపోయారన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తే, కేసీఆర్ అసెంబ్లీలో చర్చలో పాల్గొనడం లేదని ఆయనకు ప్రతిపక్ష హోదా, ఎమ్మెల్యే పదవి ఎందుకని ప్రశ్నించారు. మళ్ళీ ప్రారంభమయ్యే సభలో నీటి వాటాపై ప్రతిపక్ష హోదాలో చర్చలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో ఎంత నీటి వాటాలో దోపిడీ జరిగిందో మా హయాంలో మేము ఏం చేశామో చెపుతామమన్నారు. కృష్ణా నీటి వాటాల విషయంలో గతంలో సంతకం పెట్టి దోపిడీకి కారణం అయిన విషయం కేసీఆర్ మరిచిపోయారా? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ, పాలమూరు రంగారెడ్డిపై అసెంబ్లీలో చర్చ జరుగుతుందన్నారు. నల్లగొండను నీళ్ల విషయంలో మోసం చేసిన ఉసురుతాకే అధికారం కోల్పోయారని అన్నారు.

## పాలమూరు రంగారెడ్డిపై జిఒ ఇచ్చింది కాంగ్రెస్సే

### రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే

ప్రతిపక్ష నాయకుడిగా చర్చలో పాల్గొంటారని అనుకుంటే, కేసీఆర్ అసెంబ్లీకి ఇలా వచ్చి అలా వెళ్ళారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గతంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై జీవో ఇచ్చింది కాంగ్రెస్ పార్టీఅని గుర్తు చేశారు. ప్రాజెక్టు వ్యయం పెంచి, రీ డిజైన్ చేసి ప్రాజెక్టు పక్కన పెట్టిన ఘనత బిఆర్ఎస్ పార్టీ వాళ్ళదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదిక వస్తే ఎక్కడ వారి తప్పులు బయట పడతాయో అని తప్పులు, అవాకులు చివాకులు మాట్లాడుతున్నారని తెలిపారు. అనుమతులు లేకున్నా ప్రాజెక్టులు కట్టారన్నారు.

## వాళ్లిద్దరు మిత్రులు.. అందుకే చర్యల్లేవు

### ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి, బిజెపి ఎమ్మెల్యే

కేసీఆర్‌కి మిత్రుడిగా మారిన రేవంత్ రెడ్డి మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగంగా కాళేశ్వరం, ఇతర కేసుల్లో చర్యలు తీసుకోవడం లేదని బిజెపి ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ఉన్నాయన్నారు. హిల్ట్ పాలసీపై చర్చ ఎందుకు లేదని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల భూములు అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. గ్లోబల్ సమ్మిట్ పై వైట్ పేపర్ రిలీజ్ చేసే దమ్ము ధైర్యం ఉందా అనిప్రశ్నించారు. మహిళలకు, నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలపై చర్చ చేసే దమ్మూ, ధైర్యం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ఏమయ్యిందని, గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడిందని, శాంతి భద్రతలు, ఆసుపత్రి వసతులు, రోడ్లు చాలా సమస్యలు ఉన్నాయని తెలిపారు.

## దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

### ఉద్యోగుల సమస్యలపై మాట్లాడిన హరీశ్‌రావుపై శ్రీధర్‌బాబు ఆగ్రహం



**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** దెయ్యాలు వేదాలు వల్లించినట్లు హరీశ్ రావు వ్యాఖలు ఉన్నాయనీ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడిన హరీశ్‌రావును శ్రీధర్‌బాబు అపహాస్యం చేశారు. ప్రతి నెల ఆలస్యంగా జీతాలు గత ప్రభుత్వం ఇచ్చే దని ఎప్పుదు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేదని 20తారీఖు వరకు జీతాల చెల్లింపులు ప్రహసనంగా సాగేవని ఆయన అన్నారు. హరీశ్‌రావు ఉద్యోగుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రతినెల ఒకవ తారీఖు జీతాలు చెల్లిస్తున్నామని అదే విధంగా ఉద్యోగుల సంక్షేమం మాకు తెలుసని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా త్వరలోనే అందించేందుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు.

## మండలి మాజీ సభ్యులు జగపతిరావు, అహ్మద్ పీర్‌షబ్బీర్లకు సంతాపం

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** శాసనమండలి శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శాసనమండలి శీతాకాల సమావేశాలు ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కాగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యులుగా పనిచేసి ఈ మధ్య మరణించిన ఇద్దరు సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం స్పెషల్ మెన్షన్స్‌తోపాటు పిటిషన్లను తీసుకున్న తరువాత సభను జనవరి 2(శుక్రవారం)కి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే నాగర్‌కర్నూల్ జిల్లా చందుపట్ల గ్రామంలో 1944 జనవరి 15న జన్మించిన మాధవరం జగపతి రావు మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలుపుతున్నట్టు మండలి ఛైర్మన్ ప్రకటించారు.

హెడ్మాష్టర్‌గా ఉద్యోగం చేస్తున్న జగపతి రావు 1983లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి 1984–85లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యుడిగా పనిచేశారని ఛైర్మన్ తెలిపారు. 1984 వరకు పిఆర్‌టియు జనరల్ సెక్రటరీగా పనిచేశారని తెలిపారు. 2025 జూన్ 26న మరణించిన జగపతి రావుకి సభ సంతాపం తెలుపుతుందన్నారు. అలాగే 1947 అక్టోబర్ 24న హైదరాబాద్‌లోని బాగ్‌అంబర్‌పేట్‌లో జన్మించిన అహ్మద్ పీర్ షబ్బీర్ మృతికి సంతాపం ప్రకటించారు. అహ్మద్ పీర్ షబ్బీర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుంచి 15 వరకు కాంగ్రెస్ పార్టీ తరపున శాసనపరిషత్తు సభ్యుడిగా కొనసాగారని తెలిపారు. షబ్బీర్ 2025 అక్టోబర్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన మృతికి సభ సంతాపం ప్రకటించింది. ఇద్దరు మాజీ సభ్యుల మృతికి శాసనమండలి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

## రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డికి శాసనసభ సంతాపం



**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** శాసనసభలో సోమవారం మృతి చెందిన ఇద్దరు మాజీ శాసనసభ్యులకు సంతాపం తెలుపుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటన చేశారు. సూర్యపేట జిల్లా సూర్యపేట మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, రంగారెడ్డిజిల్లా చెవెళ్ల శాసనసభ మాజీ సభ్యులు కొండ లక్ష్మారెడ్డి మృతికి సభ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శోకార్తులైన ఇద్దరు మాజీ శాసనసభ్యుల కుటుంబంకు ప్రగాఢసానుభూతిని తెలిపారు. వారి ఆత్మశాంతించాలని మౌనం పాటించారు.

## గ్రామీణ, విద్యాలయాల్లో మిమిక్రీ కళ విస్తరణే ప్రభుత్వ లక్ష్యం

### తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలు, విద్యాలయాల్లో మిమిక్రీ కళను విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్య మని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. ధ్వన్యనుకరణ సామ్రాట్ డా. నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి వేడుకల్లో భాగంగా గురుకుల విద్యాలయాల



రాష్ట్రస్థాయిలో మిమిక్రీ పోటీల విజేతలతో నిత్యానందరావు, రమణాచారి, సీతాలక్ష్మి, మల్లం రమేష్, శోభావేణుమాధవ్, శివారెడ్డి తదితరులు

విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీలు సోమవారం నాంపల్లిలో తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆసక్తి, పోటాపోటీగా జరిగాయి. మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిత్యానందరావు హాజరయ్యారు. మిమిక్రీ కళ విస్తరణకు ఎల్లవేళలా తనవంతు పూర్తి సహకారం అందిస్తారనని డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో భరోసానిచ్చారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మిమ్కిఈ కళల్లో శిక్షణ ఇప్పిస్తామని ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కె.సీతాలక్ష్మి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.ఎస్.రాజు స్వాగతోపన్యాసం చేయగా ప్రముఖ సినీనటుడు, ప్రముఖ మిమిక్రీ కళాకారులు శివారెడ్డి, మల్లం రమేష్, జబర్దస్త్ రాకేష్, ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ వెంకన్నబాబు, ప్రముఖులు బిడిఎస్.సత్యనారాయణ, భవిరిశివ తదితర అనేకమంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలిచ్చి సభికులను ఆహ్లాదపరిచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 140మందికిపైగా విదార్థులు మిమిక్రీ పోటీల్లో ఉత్సాహం పాల్గొన్నారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలు విజేతలుగా ఎంపికచేసిన భూపాలపల్లి గురుకుల విద్యార్థిని గౌతమికి ప్రథమ బహుమతి కింద 10వేల రూపాయలు, కల్వకుర్తి విద్యార్థి వెంకటేష్‌కు ద్వితీయ బహుమతి 7.5 వేలు, కె.సురేష్‌కు తృతీయ బహుమతి 5వేలు, నాలుగవ బహుమతి 2వేల చొప్పున కొత్తగూడకు హర్షవర్ధన్, జంగంమెట్ చందనకు, కరీంనగర్ మణికంఠకు దక్కాయి. పలువురికి ప్రోత్సాహక బహుమతుల కింద షీల్డులు, మెడల్స్ అందజేశారు.

## మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ, ఉపాధికల్పన

**హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) ఆధ్వర్యంలో మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలు ఆర్థికంగా మరింత ఎదిగేందుకు ఈ పథకం దోహదపడు తుందని డబ్ల్యుఎస్‌డబ్ల్యు భావిస్తోంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలోని భరోసాతో పాటు మరో రెండు స్వచ్ఛంద సంస్థలు ఇందులో పాలుపంచుకుంటు న్నాయి. ఇప్పటికే డ్రైవింగ్ తెలిసిన మహిళలకు ఆయా సంస్థల్లో బైక్ డ్రైవర్లుగా లేదా క్యాబ్ డ్రైవర్లుగా అవకాశం ఇస్తారు.

డ్రైవింగ్‌పై ఆసక్తి వున్న వా రికి బైక్‌తో పాటు కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పిస్తారు. అవసరం అయితే రుణం కోసం బ్యాంకులు లేదా ప్రైవేటు సంస్థలకు సి ఫార్సు చేస్తారు. డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారు సిన్హా ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి వచ్చే జనవరి నెల మూ డవ తేదీన ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంబర్‌పేట్‌లోని పిటిసిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. మహిళా ప్రయాణీకులకు మేలు చేకూర్చేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని ఆసక్తి కలిగిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిజిపి కార్యాలయం ఒక ప్ర కటనలో తెలిపింది. 21 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వున్న వారు దీనికి అర్హులు.



ముక్కోటి ఏకాదశికి సర్వాంగసుందరంగా ముస్తాబైన తిరుమల ఆలయం

## టోకెన్లుంటేనే 'వైకుంఠం'లోకి

### ఉత్తరద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు, అసంఖ్యాక ప్రజలతో కిక్కిరిసిన తిరుమల

**తిరుమల,డిసెంబరు 29(ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని ఆలయంలో ఆనందనిలయం ఆనుకుని ఉన్న మోక్షమార్గం వైకుంఠవాకిలి దర్శనాలకు సామాన్యభక్తులు పడిగాపులు కాస్తున్నారు. ఆన్లైన్ ఈ డిప్ లో జారీచేసిన టోకెన్లు అందుకున్న భక్తులను స్లాట్ల వారీగా తిరుమలకు సోమవారం మధ్యాహ్నం నుండి అనుమతించినా వారందరూ తెల్లవారుజామున 3గంటలకు స్లాట్ కలిగిన భక్తులను రాత్రి 11గంటల తరువాత కృష్ణతేజ కూడలినుండి వైకుంఠం-2లోనికి అనుమతించారు. కాగా మంగళవారం ఉదయం 12గంటల తరువాత దర్శనాలు కలిగిన స్లాట్ భక్తులను ఏటీజీహెచ్ కూడలి క్యూలైన్ల నుండి అనుమతించనున్నారు.నేటి రాత్రి దర్శన స్లాట్లు కలిగిన భక్తులను శిలాతోరణం కూడలి నుండి అనుమతించి నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్ల మీదుగా వైకుంఠంలోనికి అనుమతించి ఆలయంలోకి చేరుకునేలా చూస్తారు. ఈ మధ్యలో క్యూలైన్లలో భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు.నిరంతరంగా మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు అల్పాహారం, కాఫీ, పాలు, అన్నప్రసాదాలు పంపిణీకి టిటిడి ఉద్యోగులు, శ్రీవారిసేవకులు, పోలీసులు సిద్ధమయ్యారు. కాగా సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వైకుంఠం 2 క్యూకాంప్లెక్స్ కంపార్టు మెంట్లలో ఉన్న భక్తులకు ప్రశాంతంగా సాయంత్రం వరకు సర్వదర్శనం కల్పించారు. రాత్రి 7గంటల తరువాత పూర్తిగా క్యూలైన్ల లోనికి, కంపార్టుమెంట్లలోని భక్తులను అనుమ తించలేదు. సాయంత్రం వరకు 37వేలమంది భక్తులకు మహాలఘుదర్శనంలో దర్శనం చేయించారు. ఆన్లైన్ లో తొలిమూ డురోజులు నేడు,రేపు,ఎల్లుండి(30,31,జనవరి1)కి సంబం ధించి జారీచేసిన 1.79లక్షల టోకెన్లు కలిగిన భక్తులకే ఆలయంలోనికి అనుమతిస్తారు. టోకెన్లు లేని భక్తులు తిరుమలకు చేరుకున్నా వైకుంఠం క్యూకాంప్లెక్స్ దరిదాపులకు కూడా రానీయ డంలేదు. పూర్తిగా పోలీసు మయంగా మార్చేసిన టిటిడి సామాన్యభక్తులను ఎక్కడికక్కడ కట్టడిచేసేందుకు సిద్ధమయ్యారు. సోమవారం రాత్రికి సామాన్యభక్తులు లేక కొండ బోసిపోయింది.

**భారీగా తిరుపతిలోనే మకాంవేసిన భక్తులు:** తిరుమలేశుని ఆలయంలో ధనుర్మాసంలో నేటి నుండి జనవరి 8వరకు పదిరోజులు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాల్లో తొలిమూడురోజులు నేడు, రేపు,ఎల్లుండి వరకు పూర్తిగా టోకెన్ ఉన్న భక్తులకే దర్శనాలు కల్పిస్తారు. అందుకు తగ్గట్లు టిటిడి అధికారులు పూర్తి ఏర్పాట్లుచేశారు. సౌకర్యాలు కల్పించారు. అయితే షరామా మూలుగానే తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాల నుండి భక్తులు భారీగా తిరుపతికి చేరుకున్నారు.



## ఘనంగా భద్రాద్రి రామయ్య తెప్పోత్సవం

### రామనామమంతో మార్మోగిన గౌతమి నదీతీరం

### వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

### నేడు స్వామివారి ఉత్తరద్వార దర్శనం

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో దక్షి ణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం నందు శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం గౌతమీ నదిలో శ్రీసీతారామచంద్రస్వామి వారి తెప్పోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా కన్నుల విందుగా నిర్వహించారు. గోదావరి నది వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపైకి ఉత్సవమూర్తులను కూర్చోబెట్టి శాస్త్రయుక్తంగా నదిలో స్వామి వారి తెప్పోత్స వ కార్యక్రమాన్ని వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ బాణసంచా మేళతాళాల మధ్య విహరింపజేశారు. తొలుత ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఆలయం నుండి వేలాదిమంది భక్తులతో కోలాట నృత్యాలతో, డప్పువాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, జై శ్రీరాం జై జై శ్రీరాం నామజపాల నడుమ పల్లకీపై ఊరేగింపుగా సమీప గౌతమి నది తీరాన ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో అలంకరించిన హంసవాహనం వద్దకు తోడ్కొని వెళ్ళారు. గోదావరి వద్ద పూజా కార్యక్రమాల అనంతరం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని హంసవాహనంపై కూర్చోబెట్టారు. ఈ తెప్పోత్సవాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సంబంధిత అధికారులకు భద్రత చర్యలు పటిష్టంగా చేపట్టాలని,హంస వాహనంలోకి అనుమతి పొందిన అర్చకులను, అధికారులను, వీఐపీలను మాత్రమే అనుమతించాలని ఆదేశించారు.

శ్రీసీతారామచంద్రస్వామివారి హంసవాహనంపై ఊరేగింపు సందర్భంగా తెప్పోత్సవ కార్యక్రమానికి గౌతమీనది ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణతో నది తీరం మొత్తం సర్వసుందరంగా సంతరించుకుంది. స్వామి వారి ఊరేగింపులో వచ్చిన వేదపండితులు మంత్రోచ్ఛారణలతో రామనామ ధ్వనితో మారుమోగగా, మహిళా భక్తుల కోలాట నృత్యాలతో, బోలు వాయిద్యాలతోను, అత్యంత పండుగ వాతావరణంలో అద్భుతమైన విద్యుత్ దీపాల అలంకరణతో ఏర్పాటు చేసిన హంసవాహనంపై స్వామి వారు ఊరేగింపు జరిగింది.

**నేడు ఉత్తర ద్వార దర్శనం**

శ్రీసీతారామచంద్రస్వామి వారి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 11వ రోజు అయిన మంగళవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల నుండి 6 గంటల వరకు ఉత్తరద్వారదర్శనం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి వారి ఆలయం ఉత్తరద్వారాన్ని వైకుంఠ ఏకాదశి నాడు మాత్రమే తెరువబడుతుంది. ఇట్టి దర్శనాన్ని

## ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (పేట్ బషీరాబాద్), డిసెంబరు 29, ప్రభాతవార్త:** విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎబ్బనూరు విలేజ్, దరు మండల్, వికారాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి చాకలి మణికంఠ (19) మైసమ్మ గూడలోని నందిని బాయ్స్ హాస్టల్ రూమ్ లో ఉంటూ, మల్లారెడ్డి కాలేజీనందు మొదటి సంవత్సరం చదువు తున్నాడు. సోమవారం కాలేజీకి వెళ్ళకుండా హాస్టల్లోనే ఉన్నాడు. అతని రూమ్మేట్స్ అయి నటువంటి ముగ్గురు విద్యార్థులు కాలేజీకి వెళ్ళి తిరిగి మధ్యాహ్నం సుమారు ఒకటి గంట సమయంలో వచ్చి డోర్ కొట్టగా తెరవకపోవడంతో హాస్టల్ ఓనర్, చుట్టుపక్క వాళ్ళని పిలిచి బద్దలుకొట్టి చూశారు. విద్యార్థి ఫ్యాన్ కు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. ఈ విషయమై మృతుని తల్లి జగదాంబ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# బంగ్లాలో ఐదు హిందూ కుటుంబాల దగ్ధం!

### మైనార్టీలపై పెరుగుతున్న దాడులు

**పిరోజ్పూర్(బంగ్లాదేశ్), డిసెంబరు 29:** బంగ్లాదేశ్లో మైనార్టీలపై దాడులు మరింతగా పెరిగిపోతున్నాయి. పిరోజ్పూర్ఝిల్లాలోని ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉన్న దుమ్రితల గ్రామంలో ఐదుగురు హిందూ కుటుంబాలను అల్లరిమూకలు దగ్ధంచేసాయి. కేవలం హిందూ మైనార్టీలే లక్ష్యంగా ఈ దాడు జరిగాయి. 29 ఏళ్ల దీపుచంద్రదాస్ సజీవదహనం సంఘటన జరిగిన వారం రోజులకే ఈ సంఘటన చోటుచేసుకోవడం బంగ్లాదేశ్లో హిందూ మైనార్టీలకు భద్రత కొరవడిందని తెలుస్తోంది. పెట్రోలుతో ముంచిన గుడ్డను చుట్టి బాధితుల ఇళ్లలోనికి వదలడంతో మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. ఢాకానుంచి బాధితుల్లో ఒకరైన సాహా కుటుంబం మాట్లాడుతూ మేమంతా భయంగుప్పిట్లో జీవిస్తున్నామని ఈ మంటలు ఎలా వచ్చాయో కూడా తెలియనిపరిస్థితి అలుముకుందని నిత్యం భయాందోళనలతో జీవిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఢాకా రాజధానికి 240 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్పీ మహ్మద్ మంజూర్ అహ్మద్ సిద్దికీ సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. బాధితులకు పూర్తి భద్రత కల్పిస్తామని, సంఘటనపైవిచారణజరిపి పూర్తిన్యాయంచేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పోలీసులు ఐదుగురు అనుమానితులను అరెస్టుచేసారు.

మిగిలి నిందితులను కూడా అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గలిస్తున్నాయి. సోషల్మీడియాలో ఈసంఘటన వైరల్ కావడంతో ఈసంఘటన మరింత ఉద్రిక్తంగా మారింది. స్థానికులు ఈ మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు తీవ్రస్థాయిలో అలుముకుని మరికొన్ని ఇళ్లకు వ్యాపించాయి. ఇదిలా ఉంటే హిందూ మైనార్టీలపై ఈ ఏడాదిజూన్నుంచి డిసెంబరు వరకూ మతదూషణ పేరిట 71 సంఘటనలు జరిగాయి. మొత్తం 30 జిల్లాల్లో అంటే చాంద్పూర్, చట్టోగ్రామ్, దినాజ్ పుర్, లాల్మానిర్హట్, సునామ్గంజ్, ఖుల్నా, కోమిల్లా, గాజిపూర్, తంగైల్, సిల్హెట్ జిల్లాల్లో ఈ సంఘటనలు జరిగినట్లు బంగ్లాదేశ్ మైనార్టీల హ్యూమన్రైట్స్ వాచ్ప్రకటించింది.

ఆగ్నేయాసియాలో 17.5 కోట్లజనాభా ఉన్న ఈ చిన్నదేశంలో రానురాను మతపరమైన దేశంగా మారేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాజకీయ అనిశ్చితి పేరుకుని పోయింది. మాజీ ప్రధాని షేక్ హాసీనా దేశం వీడినతర్వాత మరింతగా పెరిగిపోయాయి. 1971యుద్ధం తర్వాత పాకిస్తాన్తో వేరుపడి స్వతంత్ర దేశంగా వచ్చిన బంగ్లాదేశ్లో ఇపుడు హిందూ మైనార్టీలపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. ఇందులోభాగంగానే దీపుచంద్రదాస్, అమృత్ మోండల్ అనే యువకులను కొట్టి, సజీవదహనంచేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.



# చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీక

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 29:** శాసన మండలి,శాసనసభ రెండు చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలని సభ్యుల ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉంటుందని సభలు జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని, పారదర్శకంగా, వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాల్ 1లో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తో కలిసి సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అత్యంత ప్రజాసామికంగా సభ జరపాలని ప్రభుత్వం సీరియస్ గా ఆలోచన చేస్తుందని, ప్రజలకు, సభ్యులకు జవాబుదారీగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఉన్నందున అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశాలకు మంత్రులు చాలా సీరియస్ గా ప్రిపేర్ అయి వస్తున్నందున అధికారులు కూడా అందుకు అనుగుణంగా పూర్తి సమాచారంతో సభలు జరిగినన్ని రోజులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు అత్యంత పవిత్రమైనవి ఈ సభకు వచ్చే సభ్యులు గొప్ప ఆశయాలు, లక్ష్యాలతో సభకు వస్తున్నారన్న విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలని తెలిపారు. ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపనతో ప్రతి సభ్యుడు సభకు వస్తారు, ప్రజల సమస్యలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదో ఒక సమాధానం రాబట్టాలన్న ఆలోచనలతో సభ్యులు ఉంటారు కాబట్టి అధికారులు అన్ని ప్రశ్నలకు పారదర్శకంగా, పూర్తి సమాచారంతో సభకు హాజరై మంత్రులకు నేను వెంటనే సమాచారం ఇచ్చి సభ ద్వారా సంతృప్తికర సమాధానాలు వెళ్లేలా అధికారులు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు.



**చట్ట సభల గౌరవాన్ని,ఔన్నత్యాన్ని పెంచేలా సభలు నిర్వహిద్దాం: మంత్రి శ్రీధర్బాబు**

చట్టసభల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని పెంచేలా ఉభయ సభలు నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని అందుకు అధికారుల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలని ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రతిరోజు ఉదయాన్నే మీడియాలో వచ్చిన వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సభ్యులు ప్రశ్నలు లేవనెత్తితే మంత్రులు సమాధానం ఇచ్చేందుకు అధికారులు పూర్తి సమాచారంతో సభలో అందుబాటులో ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. జీరో అవర్లో సభ్యుల ప్రశ్నలకు అవసరమైన సమాధానాలు అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం చేయాలని, పెండింగ్ రిపోర్ట్స్, హామీలకు సంబంధించిన అంశాల పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## గుర్తింపులేని రాజకీయ పార్టీలు ఫండింగ్ నివేదికలు గడువు లోగా సమర్పించాలి

### సిఇఒ సి.సుదర్శన్రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 29:** తెలంగాణలోని అన్ని రిజిస్టర్డ్ అన్రికగ్నైజ్డ్ రాజకీయ పార్టీలు రాజకీయ విరాళాలు, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలను నిర్ణయించిన గడువులోపలే తప్పనిసరిగా సమర్పించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సి. సుధర్శన్ రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గడువు పూర్తయ్యాక అందే ఏ విరాళాల నివేదికనైనా చట్ట ఉల్లంఘనగా పరిగణించి, ఎటువంటి ప్రయోజనానికీ రికార్డులోకి తీసుకోము అని ఆయన స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల చట్టం, 1951లోని సెక్షన్లు 29బి, 29సి ప్రకారం విరాళాల నివేదికలు, ఆడిటెడ్ వార్షిక ఖాతాలు, పూర్తి ఎన్నికల ఖర్చుల ప్రకటనలను పార్టీలు సీఈఓ కార్యాలయానికి సమయానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గడువు దాటిన తర్వాత వచ్చే పత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని సుధర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల చట్టం, 1951లోని సెక్షన్ 29సి(3), ఎన్నికల నిర్వహణ నియమాలు, 1961లోని రూల్ 85బి ప్రకారం గడువు దాటిన సమర్పణలు చట్ట ఉల్లంఘనగా పరిగణించబడతాయని ఆయన పేర్కొన్నారు.రాజకీయ నిధుల వ్యవహారంలో పారదర్శకత, బాధ్యతను పెంచడమే లక్ష్యంగా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సీఈఓ కార్యాలయం తెలిపింది.




## సరికొత్త రికార్డు సృష్టించిన అక్షర జాతర

### ముగిసిన 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

**హైదరాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 29, ప్రభాతవార్త:** పదకొండు రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో సందడిగా కొనసాగిన 38వ హైదరాబాద్ బుక్ఫెయిర్ సోమవారం ముగిసింది. లక్షలాది మందితో రికార్డు స్థాయి సందర్శకులతో ఈనెల 19 నుంచి 29 వరకు కోలాహలంగా బాలోత్సవం, పుస్తకావిష్కరణలు, చర్చాగోష్టిలతో అలరించిన అక్షర జాతర ముగింపు వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ముగింపు వేడుకల సభ బుక్ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్ అధ్యక్షతన జరగగా, కార్యదర్శి వాసు అతిథులను ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ సుదర్శన్రెడ్డి, గౌరవ అతిథిగా తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఆత్మీయ అతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు కే.రామచంద్ర మూర్తి, రమా మెల్కోటె తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగం అందరికీ అందాలి: జస్టిస్ సుదర్శన్రెడ్డి**

భారత రాజ్యాంగాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా తెలుగులో పాకెట్ సైజులో ప్రతిగా ముద్రించి, అతి తక్కువ ధరకు వచ్చే ఏడాది అందుబాటులోకి తేవాలని జస్టిస్ సుదర్శన్రెడ్డి బుక్ఫెయిర్ నిర్వాహకులకు సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా యువత ఇంత పెద్ద ఎత్తున పుస్తక ప్రదర్శనకు రావటం సమాజంలోని మేధో అంతర్మథనానికి నిదర్శనమని కొనియాడారు.

ఆర్థిక రంగంలో కన్నా పుస్తక పఠనంలోనే మనం ప్రపంచ అగ్రగామిగా ఎదగాలని కే.శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. వ్యవసాయ, పశుసంవర్ధక పరిశోధనలు రైతులకు అందుబాటులోకి తేవాలని, పుస్తక విరాళాల కార్యక్రమం ఒక గొప్ప సామాజిక ఆశయమని కొనియాడారు. యువత మద్యం, గంజాయి వంటి వ్యసనాలను వీడనాడి, పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకోవాలని ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. తలవంచుకుని పుస్తకం చదివితే, సమాజంలో తలెత్తుకుని జీవించే శక్తి లభిస్తుందని అన్నారు.

**బుక్ఫెయిర్ను సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

బుక్ఫెయిర్ను సోమవారం సాయంత్రం హైడ్రా కమీషనర్ రంగనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు పుస్తకాల స్టాల్స్ను ఆసక్తిగా పరిశీలించారు. కార్యదర్శి వాసు వార్షిక నివేదికను సమర్పిస్తూ గతేడాది 12 లక్షల మంది సందర్శకులు బుక్ఫెయిర్ను సందర్శించగా, ఈ సంవత్సరం 16 లక్షల మంది సందర్శించారని ఆనందం వ్యక్తం చేశారు.

# ఎప్ సెట్-2026 కన్వీనర్గా విజయకుమార్రెడ్డి

### పిజి ఇసెట్ కన్వీనర్గా వెంకటేశ్వరరావు

### మే నెలలోనే అన్ని సెట్స్ను పూర్తి చేసేలా ప్రణాళిక

**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎప్ సెట్)-2026 కన్వీనర్గా జేఎన్టియు రెక్టార్ ప్రొఫెసర్ కె విజయకుమార్ రెడ్డిని నియమించారు. గత మూడేళ్లుగా కో కన్వీనర్గా ఉన్న విజయ్కుమార్ రెడ్డిని కన్వీనర్గా నియమిస్తూ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. రాష్ట్రంలో నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ పరీక్షల కన్వీనర్లను, పరీక్షలను నిర్వహించే యూనివర్సిటీలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి సోమవారం ప్రకటించింది. గత ఏడాదిలో ఉన్న కన్వీనర్లలో మూడు సెట్స్ కన్వీనర్లను మార్చారు. ఎప్ సెట్, పీజీ ఈసెట్, పీఈ సెట్స్కి కొత్త కన్వీనర్లను నియమించారు. అయితే గత ఏడాది ఏ సెట్ను ఏ యూనివర్సిటీ నిర్వహించిందో ఈ ఏడాది కూడా అవే యూనివర్సిటీలు నిర్వహించనున్నాయి. అన్ని సెట్స్ను కూడా ఈ ఏడాది మే నెలలోనే పూర్తి చేసేలా తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రణాళికను రూపొందించింది. ఇందుకు సంబంధించిన తేదిలను ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వ అనుమతి కోసం పంపించింది. రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే 8 కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కన్వీనర్లు, నిర్వహించే యూనివర్సిటీల వివరాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ సోమవారం ప్రకటించారు. ఎప్ సెట్ కన్వీనర్గా ప్రొఫెసర్ కె విజయ్కుమార్ రెడ్డి కొనసాగుతూ సెట్ను జేఎన్టియు నిర్వహించ నుంది. ఎడ్ సెట్ కన్వీనర్గా ప్రొఫెసర్ వి వెంకట్రామ్రెడ్డి ఉంటూ, సెట్ను కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తుంది. ఐ సెట్ కన్వీనర్గా ప్రొఫెసర్ ఆలువాల రవి కొనసాగుతూ మహాత్మా గాంధీ యూనివర్సిటీ సెట్ను నిర్వహిస్తుంది. ఈ సెట్ కన్వీనర్గా ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ కొనసాగుతూ ఉస్మానియా యూనివర్సిటీ సెట్ను నిర్వహిస్తుంది. లాసెట్, పీజీ లాసెట్ కన్వీనర్గా ప్రొఫెసర్ బి విజయలక్ష్మి కొనసాగుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ సెట్ను నిర్వహించనుంది. పీజీ ఈ సెట్ కన్వీనర్గా జేఎన్టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె వెంకటేశ్వరరావు కొనసాగుతూ జేఎన్టియూ సెట్ను నిర్వహించనుంది.

ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్ సెట్-2026 పరీక్షలను మే మొదటి వారంలో నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

# బడ్జెట్లో 10 శాతం విద్యారంగానికి కేటాయించాలి

### వర్సిటీల్లో నియామకాలను త్వరగా చేపట్టాలి

### అడ్మిషన్లు, క్రెడిట్స్ నిర్ధారణకు కమిటీని ఏర్పాటు చేయాలి

### విసిల సమావేశంలో నిర్ణయం


**హైదరాబాద్, డిసెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రం లో విద్యారంగం అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్లో విద్యరంగానికి 10 శాతం కేటాయించాలని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ప్రతిపాదించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని. అలాగే యూనివర్సిటీల అభివృద్ధికి ప్రభుత్వం గ్రాంట్లను ఇచ్చేలా చూడాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలిని కోరారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల సమావేశంలో సోమవారం హైదరాబాద్లో జరిగింది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్తోపాటు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, జేఎన్టియు విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ తోపాటు పలువురు వీసీలు పాల్గొన్నారు. హైదరాబాద్లోని గచ్చిబౌలిలో ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్లో జరిగింది.

రాష్ట్రంలోని యూనివర్సిటీలకు మంజూరైన అన్ని బోధనా పోస్టులను భర్తీ చేయడానికి అనుమతి ఇచ్చిన వీసీలు, బోధనా సిబ్బంది నియామక పద్ధతిపై స్పష్టత ఇవ్వాలని, బ్యాక్లాగ్ ఖాళీలను భర్తీ చేయడానికి సూచనలతో పాటు రోస్టర్ పాయింట్లను ఖరారు చేయాలని ఉన్నత విద్యా మండలిని కోరారు. విశ్వవిద్యాలయాల నియమ, నిబంధనలను సమీక్షించి, హేతు బద్ధీకరించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

యూజీ, పీజీ, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్తోపాటు ప్రవేశాల కోసం ఒక ఉమ్మడి పాఠ్యప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయాలని వీసీల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల గ్రాంట్ల విడుదల సహా విశ్వవిద్యాలయాల బడ్జెట్ పరిస్థితిపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఉపకులపతులు ఉన్నత విద్యా మండలిని అభ్యర్థించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి, ఉపకులపతుల ప్రతిపాదనలను క్రోడీకరించి, తెలంగాణ ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తగిన విధాన నిర్ణయాలు సకాలంలో తీసుకునేలా ప్రభుత్వంతో చర్చిస్తామని ఉన్నత విద్యామండలి వీసీలకు హామీ ఇచ్చింది.


# రెండు స్థానాల నుంచి బిఎన్పీ తారిఖ్ రహమాన్ పోటీ!

**ఢాకా, డిసెంబరు 29:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రెండు స్థానాలనుంచి పోటీ చేయనున్నారు. ఢాకా17, బోగ్రా6 నియోజకవర్గాల నుంచి ఆయన బరిలో దిగుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బోగ్రా16 నియోజకవర్గానికి గతంలో తారిఖ్ రెహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రాతినిధ్యం వహించారు. ఒకప్పుడు ఈ స్థానం బీఎన్పీకి కంచుకోటగా ఉండేది. 2023లో జరిగిన ఉప ఎన్నికల్లో అవామీ లీగ్ నాయకుడు ఆషన్ రిపు ఇక్కడ విజయం సాధించారు. బంగ్లాదేశ్లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుండటంతో తారిఖ్ రెహ్మాన్ తరఫున బీఎన్పీ నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. సుమారు 17 ఏళ్ల తర్వాత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్కు తిరిగి వచ్చారు. ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఓటరు జాబితాలో ఆయన పేరును చేర్చేందుకు ఎన్నికల సంఘం అంగీకరించింది. మాజీ ప్రధాని షేక్ హాసీనాకు చెందిన అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం కొనసాగుతున్నందున, ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం కుదరదని తాత్కాలిక ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. షేక్ హాసీనా గద్దె దిగినప్పటి నుంచి బంగ్లాదేశ్లో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేర్టేకర్ చీఫ్ మహ్మద్యూనస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఓవక్క మైనార్టీ హిందూ సంస్థలు,వ్యక్తులపై దాడులు పెరుగుతుంటే ముస్లిం ప్రజానీకం మాత్రం ఎన్నికలవైపు ఆసక్తిచూపిస్తోంది. రాజకీయ పార్టీలు కూడా అందుకు సమాయత్తం అవుతున్నాయి.



## భవనంపై నుంచి దూకి మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ (ఉప్పల్), డిసెంబరు 29, ప్రభాతవార్త :** కుటుంబసమస్యలు, భార్యభర్తల మధ్య విభేదాలతో మహిళా కానిస్టేబుల్ భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, రవిపహార్ తండా చెందిన బానోతు ప్రమీల (32) నాచారం పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తూ ఉప్పల్ పద్మావతికాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో భార్యభర్తలు గొడవ పడినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి భవనంపై నుంచి కిందకు దూకడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. వెంటనే స్థానికులు ఉప్పల్లోని సిటి న్యూరో ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం ప్రమీలను భర్త బాల రాజునాయక్ సికిందరాబాద్లోని యశోద హాస్పిటల్కు తరలించి చికిత్స అందిస్తు న్నారు. కానిస్టేబుల్ ప్రమీల భర్త బాలరాజు స్థానికంగా చికెన్ షాపు నిర్వహిస్తున్నాడని, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉందని, విచారణ చేస్తున్నామని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కానిస్టేబుల్ ప్రమీల (ఫైల్)

# 3 నుంచి ‘తెలుగువారి అనురాగసంగమం’

**గుంటూరులో మూడురోజులపాటు మూడో ప్రపంచ తెలుగు మహాసభలు - 20 ఎకరాల విస్తీర్ణంలో ఐదు ప్రధాన వేదికలు - వేదికల ద్వారాలకు మహాకవులు, కళాకారుల పేర్లు - శ్రీసత్యసాయి స్పిరిట్యువల్ సిటీలో భారీ ఏర్పాట్లు - హాజరుకానున్న మారిషస్ అధ్యక్షుడు, 52 దేశాల నుంచి ప్రతినిధులు**

**విజయవాడ,డిసెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాషకు పెద్దపీట వేయడం ప్రభుత్వం, ప్రజల బాధ్యత. దీని దృష్టిలో పెట్టుకుని తెలుగువారి ఆత్మీయ పండుగకు గుంటూరు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయి బొమ్మిడాలనగర్ లోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది. ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ మహాసభల ముఖ్య సమన్వయకర్తగా పి. రామచంద్రరాజు వేదికల నిర్మాణం, రోడ్ల ఏర్పాటు వంటి తదితర పనులను పర్యవేక్షిస్తున్నారు.



ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

10 ఎకరాల్లో 5 వేదికలు: మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభలు జరగనున్నాయి. అయితే ప్రధానంగా 10 ఎకరాల్లో పార్కింగ్, మరో 10 ఎకరాల్లో వేదికలు ఏర్పాటవుతున్నాయి. దాదాపు 5,000 మంది కూర్చునేలా నందమూరి తారకరామారావు ప్రధాన వేదికను నిర్మిస్తున్నారు. కవి సమ్మేళనాలకు జాషువా, కరుణశ్రీ వేదిక, అవధానాల ప్రదర్శనల కోసం కొప్పరపు కవుల వేదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తూము నరసింహదాసు వేదిక, పాడనా తెలుగు పాట కోసం ఘంటసాల, ఎస్.పి.బాలు వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 52 దేశాలతో పాటు మన దేశంలోని వివిధ తెలుగు సంఘాలకు ఆహ్వానాలు పంపారు. రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం: ఈనాడు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు పేరుతో “రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం” ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పుస్తకాలు, హస్తకళలు, ప్రాచీన తెలుగు వైభవానికి సంబంధించిన అంశాలు ఉంచుతారు. ప్రధానవేదిక ప్రాంగణం ముందు భాగంలో రామోజీరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేదిక ద్వారాలకు కళాకారుల పేర్లు: అందుబాటులో ఉన్న మొత్తం ఐదు సభా వేదికల ద్వారాలకు సినారె, దాశరథి, దాసరి నారాయణరావు తదితర తెలుగు కవులు, కళాకారులు, సినీ దిగ్గజాల పేర్లను పెడుతున్నారు. భోజన శాలలకు డొక్కా సీతమ్మ, పింగళి వెంకయ్య, డాక్టర్ పి.వి.జె.రాజు వంటి ఎందరో మహనీయుల పేరిట ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 4వ తేదీన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ఈ కార్యక్రమానికి హాజరై మంచి సందేశం ఇస్తారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మారిషస్‌లో ఎక్కువమంది తెలుగువారు ఉండడంతో ఆహ్వానించామని గజల్ శ్రీనివాస్ చెప్పారు. అంతేకాకుండా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వపు సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి నలుగురు గవర్నర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్రాల ఎంపీలు సైతం హాజరవుతారని గజల్ వివరించారు. తెలుగుభాష అభ్యున్నతి, పరిరక్షణకు విశేష కృషి చేసిన సంస్థలు, ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలతో పాటు జీవన సాఫల్య పురస్కారాలనూ ప్రదానం చేయనున్నారు. వెయ్యిమంది కవులతో అమరావతికి సహస్ర కవితా నీరాజనం సమర్పించనున్నారు. దీనికితోడు పండితులతో సైతం అవధానం సాగనుండటం విశేషం. మొత్తం 25,000 మందితో కార్యక్రమాలు: వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులన్నీ ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు దాదాపు 25,000 మంది యువతీ యువకులతో

## మారిషస్ దేశాధ్యక్షుడు శ్రీ ధరమ్ గోకుల్ రాక

**విజయవాడ,డిసెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 3,4,5 జనవరి 2026 లో శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ, గుంటూరు ప్రాంగణంలో జరగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహా సభలకు మారిషస్ దేశాధ్యక్షులు శ్రీ ధరమ్ గోకుల్ విచ్చేయనున్నారని పరిషత్ అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. 4 జనవరి 2026 ఉదయం 10 గంటలకు జరిగే తెలుగు వెలుగు సభకు ముఖ్య అతిథిగా సతీ సమేతంగా విచ్చేసి తెలుగు మహా సభలలో ఆయన సందేశం ఇవ్వనున్నారు. ప్రపంచ తెలుగు మహా సభలకు ఒక దేశాధ్యక్షులు రావడం ఇదే ప్రథమమని, మన ఆంధ్ర ప్రదేశ్ కు ఇది ఎంతో గౌరవమని డా.గజల్ శ్రీనివాస్ అన్నారు.



## జనవరి 10న పిఎస్ఎల్‌వి సి - 62 రాకెట్ ప్రయోగం

### - షార్‌లో ప్రారంభమైన సన్నాహాలు



రాకెట్‌ను అనుసంధానిస్తున్న దృశ్యం

**సూళ్లూరుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త** ఒకపక్క విజయాలు, మరోపక్క విజయ పరంపరలు.. ఇలా ఇస్రో ఘనకీర్తి దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రయోగ విజయాల స్ఫూర్తితో ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. శ్రీహరికోట వేదికగా జనవరి 10వ తేదీన పిఎస్ఎల్‌వి సి-62 రాకెట్ ప్రయోగాన్ని జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంది. ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగం ద్వారా అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్2 విజయం తర్వాత చేపడుతున్న మరో ప్రయోగమిది. ఈ ప్రయోగం డిసెంబర్ చివరి వారంలోనే జరగాల్సి ఉన్నప్పటికీ ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగం కొంత ఆలస్యంగా జరగడంతో ప్రస్తుత పిఎస్ఎల్‌వి సి-62 ప్రయోగం జనవరి 10వ తేదీకి వాయిదా పడింది. ఈ ప్రయోగం ద్వారా ఇఓఎస్ ఎన్1 ఉపగ్రహంతో పాటు ఓ యూనివర్శిటీకి చెందిన విద్యార్థులు తయారు చేసిన ఉపగ్రహం, అమెరికాకు చెందిన మరో చిన్న ఉపగ్రహాన్ని పిఎస్ఎల్‌వి సి-62 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఇఓఎస్ ఎన్1 ఉపగ్రహం వ్యవసాయం, వాతావరణం, భూపరిశీలన, నీటి వనరుల అన్వేషణ తదితర అంశాలపై అధ్యయనం చేసి డేటాను భూమికి చేరవేస్తుంది. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలోని వ్యాబ్ (వెహికల్ అసంబుల్ బిల్డింగ్) మూడు దశలకు సంబంధించి అనుసంధాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 26వ తేదీన బెంగళూరు నుంచి శాటిలైట్ భారీ భద్రత నడుమ శ్రీహరికోటకు చేరుకుంది. శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్‌లో ఉంచి తుది పరీక్షలు ఇస్రో శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు అయిన వెంటనే రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. నూతన సంవత్సరంలో ఇస్రో ప్రప్రథమంగా చేపడుతున్న మరో ప్రయోగం ఇది.

## న్యాయశాఖ మరింత పటిష్టం

### ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం చర్యలు : మంత్రి ఫరూక్



రాష్ట్ర వ్యాజ్య విధానం (లిటిగేషన్ పాలసీ) 2025పై సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం

**విజయవాడ,డిసెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం (లిటిగేషన్ పాలసీ) 2025” ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం మొదటిసారి భేటీ అయింది. సోమవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశానికి హోంమంత్రి వంగలపూడి అనిత కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరు కాలేదు.. న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమావేశంలో మాట్లాడుతూ . కోర్టులలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సమస్యలకు సకాలంలో ప్రభావవంతమైన, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని చూపడం, ప్రభుత్వ విభాగాలలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా “ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం 2025” ( ఏపీ స్టేట్ లిటిగేషన్ పాలసీ )పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రులు తొలిసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కోర్టులపై అధిక భారాన్ని నివారించడానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారుమంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తదుపరి జీవోఎం సమావేశం నాటికి ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్లో ఉన్న కేసుల వివరాలు తెప్పించాల్సిందిగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి సూచించారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల లిటిగేషన్ పాలసీ వివరాలు కూడా మంత్రివర్గ ఉప సంఘానికి తెలియ జేయాలని కార్యదర్శి ని ఆదేశించారు.


## యేడాది కావస్తున్నా, తిరుపతిలో ‘వైకుంఠ’ తొక్కిసలాట కేసులో ఏమి తేల్చారో?

### - తప్పిదాలపై ఇంకా స్తబ్దుగా కమిషన్ నివేదికలు!

**తిరుమల,డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది జనవరిలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు కల్పించే సమయంలో 2025 జనవరి8వతేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఎవరి తప్పిదమనేది నేటికీ మిస్టరీ తేలడం లేదు. ఈ ఘటనలో అప్పట్లో ఏకంగా తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల కౌంటర్ల ప్రాంతంలో బందోబస్తు విధుల్లో ఉన్న తిరుపతి నగరక్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి ఎస్వీగోశాల డైరెక్టర్ హరనాధరెడ్డిని అదేరోజు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఇంకా అక్కడ విధుల్లో ఉన్న అప్పటి టిటిడి జెఇఓ గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ శ్రీధర్‌పై తక్షణం బదిలీ వేటుపడింది. ఆ తరువాత ఈ తొక్కిసలాటఘటనకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేకపోవడమే కారణమని పలువురు క్షతగాత్రులైన బాధితులు స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్సపొందిన సమయంలోనే సిఎం చంద్రబాబుకు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఘటనలో జనవరి 8వతేదీ రాత్రి విశాఖ పట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్ల పాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని (47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45)అర్థాంతరంగా ప్రాణాలుయకోల్పోయిన ఉదంతం విదితమే. మరో 50మంది వరకు క్షతగాత్రులయ్యారు. ఈ విషాద ఘటన జనవరిలో దక్షిణ భారతదేశంలోనే పెద్ద దుమారం రేపింది. ఈ కేసులో కీలక విషయాలు వెలుగులోకి తీసుకురావడానికి, ఇంకా బాధ్యులైన పోలీస్, రెవెన్యూ, టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిని విచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలోని కొందరు సిబ్బంది ఏకంగా ఐదునెలలు తిరుపతి జిల్లాకలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్ నుండి విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, అప్పటి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరచారి, పూర్వ జెఇఓ గౌతమి, పూర్వ సివిఎస్ఓ శ్రీదర్‌లను పలు దఫాలుగా విచారణ చేశారు. దీనిపై ప్రత్యేక నివేదిక రూపొందించారు. పూర్తిగా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తొక్కిసలాట, ఆరుగురు ప్రాణాలు తీసిందనేది బాధితుల ఆరోపణలు. విచారణ కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎదుట తమ వాదన వినిపించారు. ఈ ఏడాది జనవరిలో వైకుంఠద్వార దర్శన టోకెన్లకోసం తెలుగు రాష్ట్రాలనుండేగాక తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్రల నుండి భారీగా భక్తులు తరలివచ్చిన సంగతి తెలిసిందే.

## స్థానిక ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి : ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త** అతిత్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు వన్‌సైడ్ కావాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కీలకం అన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి, గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ఆయన పాదాభివందనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు అధిష్టానం తప్పక గుర్తింపు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గానికి లేనివిధంగా సిఎం చంద్రబాబునాయుడు పదవులు సైతం కేటాయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు చేస్తున్న మంచిని వివరించాలన్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు 2024తర్వాత అనే రీతిలో సిఎం చంద్రబాబు చొరవ చూపుతూ కుప్పాన్ని ఓ మోడల్ నియోజకవర్గంగా మలచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

## కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం విక్రయ సమయాల పొడిగింపునకు అనుమతి

**విజయవాడ డిసెంబర్ 31. ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాలు, సేవల సమయాలను పొడిగించేందుకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ , ప్రొహిబిషన్ డైరెక్టర్ సమర్పించిన నివేదికను అనుసరించి నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక అనుమతులను అనుసరించి ఏ4 మద్యం దుకాణాలు డిసెంబర్ 31, 2025, జనవరి 1, 2026 రాత్రుల్లో అర్ధరాత్రి 12.00 గంటల వరకు మద్యం విక్రయించవచ్చు. అలాగే 2బీ (బార్లు), సి 1 (ఇన్‌హౌస్), ఈపిఐ(ఈవెంట్ పర్మిట్), టీడీ1 (ఇన్‌హౌస్) లైసెన్సులు కలిగిన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలు అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయించడానికి, రెస్టారెంట్ సర్వీస్‌లకు అనుమతి పొందాయి. గత ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా అమలులో ఉన్న విధానానికి అనుగుణంగా ఈ సడలింపు ఇవ్వబడిందని ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం లేదా అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాల అమలుకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌లు అవసరమైన చర్యలు

## అంటువ్యాధుల నియంత్రణకు రాష్ట్ర స్థాయి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు


### - మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,డిసెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అంటువ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఈ టాస్క్ ఫోర్స్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

మొత్తం 24 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైంది. జాతీయ స్థాయి వైద్య సంస్థ నిపుణులు, రాష్ట్ర పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన, వ్యవసాయ శాఖ అధికారులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో అంటువ్యాధులు (డెంగీ, మలేరియా, డయేరియా టీబీ, లెప్రసీ)ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు, అకస్మాత్తుగా వ్యాధులు వ్యాప్తి చెందిన సందర్భాలలో తక్షణమే చేపట్టవలసిన నియంత్రణ చర్యలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి వ్యూహాత్మక ప్రణాళిక (స్ట్రాటజిక్ ప్లాన్) రూపొందిస్తుంది. ఆసుపత్రుల సన్నద్ధత, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల అమలు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ విధులు , తదితర అంశాల గురించి ఈ ప్రణాళికలో పొందుపరచనున్నారు . ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై రాష్ట్రంలో అంటువ్యాధుల కేసుల స్థితిగతులు, అమలవుతున్న నియంత్రణ చర్యలు, ఇతర సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహిస్తుంది.

## సిఎం చంద్రబాబునాయుడుకి మా ప్రాంత ప్రజానీకం ఆజన్మాంతం రుణపడి ఉంటాం

### : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 29,** ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు జిల్లా ప్రజలకు తాను వెన్నంటి ఉంటానంటూ ఆవేదనను గుర్తించి.. కలువాయి, రాపూరు, సైదాపురం, మండలాలను యధావిధిగా నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తూ.. నిరుద్యోగ యువతకు భరోసాగా.. కృష్ణపట్నం పోర్టు, పారిశ్రామికవాడల పరిధిలోని చిల్లకూరు, గూడూరు, కోట మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో విలీనం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నేటి మంత్రివర్గ సమావేశం ద్వారా ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం. నెల్లూరు జిల్లా ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఈ చారిత్రాత్మక నిర్ణయం చేసిన మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి మా ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలియజేశారు.

# తిరుమల సమాచారం

## గోవిందనామస్మరణలతో మార్మోగిన కొండ



**తిరుమల,డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠఏకాదశి ఘడియల్లో వైకుంఠద్వార దర్శనం కోసం భక్తులు తరలి రావడంతో మంగళవారం ఉదయం గోవిందనామస్మరణలతో తిరుమల మార్మోగింది. ఆన్‌లైన్‌లో ఇప్పటికే టోకెన్లు అందుకున్న భక్తులు తిరుమలకు రావడంతో స్లాట్ల వారీగా అనుమతించారు. ఆలయంలోనికి చేరుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్న భక్తులు భక్తితో పులకించారు. టిటిడి అత్యుత్సాహం, ముందుగానే రద్దీని ఊహించి ప్రకటనలు చేయడంతో చాలావరకు భక్తులు దర్శనానికి రావడానికి సాహసం చేయలేదు, క్యూలైన్లను, భక్తులను క్రమబద్ధీకరించడంతో ప్రశాంతంగా దర్శనాలు చేసుకునేలా చూస్తున్నారు. ఎక్కడెక్కడి నుండో వచ్చిన భక్తులు దర్శనానంతరం ఆలయం ముందుకు చేరుకున్నారు. అందరూ గోవిందనామ ఉచ్చరణ చేసి అఖిలాండం వద్ద కర్పూర హారతులు పట్టారు.

## అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ప్రజలకు మంచి జరగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. 2026 నూతన ఆంగ్ల సంవత్సరం ముందు తిరుమలకు వచ్చిన ప్రముఖులు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణారెడ్డి, కర్నాటకమంత్రి మల్లికార్జున, ఎంపి డాక్టర్ ప్రభమల్లికార్జున, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, చాంపియన్ చిత్రం బృందం రోషన్, మహేశ్, అనస్వరరాజన్, మాజీ ఎంపి లింగయ్య వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పటిష్ట వ్యూహం.. పక్కాప్రణాళికలతో ప్రశాంతంగా తిరుమల

### - వైకుంఠ ద్వార దర్శనాలకు భక్తులు సిద్ధం



**తిరుమల,డిసెంబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠఏకాదశి, ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వార దర్శనం కోసం జారీచేసిన ఆన్‌లైన్ టోకెన్లు పొందిన భక్తులు తిరుమలకు చేరుకోవడంతో అంతటా ప్రశాంతవాతావరణం నెలకొంది. సోమవారం రాత్రికి నేటి ఉదయం ఇడిప్ స్లాట్ టోకెన్లు ఉన్న భక్తులు చేరుకోవడంతో వారంతా వైకుంఠమ్ 2క్యూలైన్లోకి వెళ్ళారు. ఈ క్యూలైన్లను సోమవారం రాత్రి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణతో కలసి అనేక ప్రాంతాలను తనిఖీ చేశారు. భక్తులను నియంత్రించడమేగాక ప్రశాంతావాతావరణం నెలకొల్పారు. ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న సామాన్యభక్తులు తిరుమలకు భారీగా చేరుకున్నారు. సాయంత్రం 6గంటలకు వణికిస్తున్న చలికి సామాన్యభక్తులు గోవింద గోవింద నామంతో ఆలయం వద్ద అలంకరణలతో ముగ్దులయ్యారు. తిరుమల, తిరుపతిలో పక్కావ్యూహంతో, పటిష్ట ప్రణాళికలతో టిటిడి అధికారులు, పోలీసు అధికారులు కసరత్తుతో వ్యూహాత్మకంగా కార్యాచరణ రూపొందించి , క్యూలైన్ల ఏర్పాటు, పోలీసు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది నియామకంతో భక్తులకు సాఫీగా క్యూలైన్లోనికి చేరుకుంటున్నారు. ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను పటిష్టంగా నిర్వహించేలా చూస్తున్నారు. ఎక్కడా ఏ చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ముందుగానే రద్దీని ఊహించి ప్రకటనలు చేయడంలో చాలావరకు భక్తులు ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకోలేక దర్శనానికి రావడానికి సాహసం చేయలేదనేది తెలుస్తోంది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తొలినుండి పక్కా వ్యూహంతో క్యూలైన్లను, భక్తులను క్రమబద్ధీకరించడంలో అంతా సాఫీగా నడుస్తోంది. విఐపిలు భారీగానే తరలిరావడంతో గదులు దొరకని భక్తులు ఆలయం ముందు భాగంలో, ప్రత్యేక షెడ్లలో వసతిపొందారు. చలికి కొంత ఇబ్బంది కలిగినా దేవదేవుని వైకుంఠద్వార దర్శనంతో మోక్షం కలుగుతుందని విశ్వాసం సడలలేదు.

## వైకుంఠ ఏకాదశిన చిన్నపిల్లలకు జియో ట్యాగ్

**తిరుమల,డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా జియో ట్యాగ్ విధానం ద్వారా తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిన్న పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ఉండేందుకు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమలలో జియో ట్యాగ్ విధానం అమలు చేయడంతో పాటు, ప్రత్యేక అధికారులు, మహిళా సిబ్బందిని నియమించడం జరిగింది. ఈ క్రమంలో ఈరోజు తిరుమలలోని బేడిఆంజనేయస్వామి ఆలయం వద్ద దర్శనార్థం వచ్చిన కౌశిక్ (వయస్సు - 5 సంవత్సరాలు బాలుడు తప్పిపోయినట్లు తండ్రి వెంకటేష్, పెర్ణంబట్టు (తమిళనాడు రాష్ట్రం) పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తక్షణమే స్పందించి, బాలుడికి ముందుగా కట్టిన జియో ట్యాగ్ ఆధారంగా అతని స్థలాన్ని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

## డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండికి 50 వినతులు: సిఎండి శివశంకర్ లోతేటి


**తిరుపతి, డిసెంబరు 29 ప్రభాతవార్త** ఎపిఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 50 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, విద్యుత్ లైన్ మార్పు, లోఓల్టేజ్ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ తదితర సమస్యలు వీటిలో వున్నాయి. వినియోగదారుల సమస్యలపై సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ఆయా జిల్లా స్థాయిల్లో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి 9:30 వరకు “డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ“ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను వివరించవచ్చు.

## పాక్‌లో మరో కొత్త ఉగ్రవాద సంస్థ!

### కొత్త ఉగ్రనేతల ఖారీ మొహ్మద్ యాకూబ్‌షేక్

**కరాచి, డిసెంబరు 29:** పహల్గాంవ్ ఉగ్రదాడికిప్రతీకారంగా భారత్‌చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌తోపాక్‌లోని ప్రధాని ఉగ్రవాద సంస్థలు ఉనికిని కోల్పోయాయి. హాఫీజ్‌సయీద్, మసూద్ అజహర్ వంటి నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోగా ఇపుడు పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుతెచ్చినట్లు తెలుస్తోంది. ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ అనే ఈ నేత లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొంది తనకంటూ ప్రత్యేక ఉగ్రసంస్థలనుస్థాపించి సెంట్రల్ ముస్లిం లీగ్ అని పేరుపెట్టాడు. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. 1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి

మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. జైష్‌ఎ మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. 2017లో దిఫాఎ పాకిస్థాన్ కౌన్సిల్ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు.



మనకు సంవత్సరకాలంలో 24 ఏకాదశులు వస్తాయి. అందులో ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా పరిగణిస్తారు.

# ముక్తిప్రదమైన ముక్కోటి ఏకాదశి

ఈ రోజు శ్రీమహావిష్ణువు వైకుంఠ ద్వారం ద్వారా సర్వాలంకార భూషితుడై తన దేవేరులతో కలసి దర్శనమిస్తారు. ఈ అపురూపమైన దర్శనానికై దేవతులు ఉత్తరద్వారము ద్వారా వైకుంఠములోనికి ప్రవేశించి స్వామివారి అనుగ్రహాన్ని పొందుతారు. అంతేకాకుండా శ్రీమహావిష్ణువు ముక్కోటి దేవతలతో కలసి భూలోకానికి విచ్చేసి తన భక్తకోటిని అనుగ్రహిస్తాడని నమ్మిక. అందువలన కూడా ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అనే ప్రశస్తి కలిగింది. సాగర మథన సమయంలో అమృతం మరియు హాలాహాలం ఉద్భవించినది ఈ రోజే. హాలాహాలాన్ని పరమేశ్వరుడు తన కంఠంలో ధరించగా, శ్రీమహావిష్ణువు అమృతాన్ని దేవతలకు పంచి అమరులుగా మారుస్తాడు. అందువలన ఈ రోజు వైష్ణవులకు, అత్యంత పర్వదినం. పద్మ పురాణాన్ని అనుసరించి 'ముర' అనే రాక్షసి లోకాలను పీడిస్తుంటే, దేవతలు పరమశివుని సలహా ప్రకారం శ్రీమహావిష్ణువును ఆశ్రయించగా, ఆయన హైమవతి అనే స్త్రీశక్తి సహాయంతో ఆ రాక్షసిని సంహరిస్తాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శాక్తేయులు కూడా ఈ రోజు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మహాభారత కాలంలో శ్రీకృష్ణార్జునుల మధ్య గీతా సంవాదం జరిగింది కూడా ఈ రోజే అని శాస్త్ర ప్రవచనం. ఈ విధంగా అనేక ప్రాధాన్యతలు, విశేషాలు కలిగిన ఈ రోజు సర్వులకు అత్యంత పుణ్యప్రదమైనది. ఈరోజు ఏకాదశి వ్రతం చేసి శివకేశవులను పూజించి, ఉపవాస మరియు జాగరణ విధులను పాటించటం ద్వారా పుణ్యఫలాలు సంప్రాప్తిస్తాయని నమ్మిక. విష్ణుపురాణం ప్రకారం ఈ రోజు ఉపవాస తదితర విధులు నిర్వర్తించటం ద్వారా మూడుకోట్ల ఏకాదశుల ఉపవాస పుణ్యఫలాలు దక్కుతాయని పెద్దలు చెబుతారు. ఒకసారి బ్రహ్మదేవుని చెమటబిందువు భూలోకంలో పడగా అది ఒక రాక్షసి రూపం ధరించి, బ్రహ్మదేవుని తనకు నివాస స్థానం చూపించమని కోరగా, ఏకాదశినాటి అన్నకణంలో పురుగు రూపంలో ప్రవేశించి నివసించమని చెబుతాడు. అందువలన ఎవరైతే ఏకాదశినాడు అన్నం సేవిస్తారో, పురుగు రూపంలో వారి గర్భంలో ప్రవేశించి వ్యాధులు కలుగచేయమని ఆదేశిస్తాడు.

అందువలన ఏకాదశి రోజున అన్న సేవనం విసర్జించి, ఉపవాసం ఉండి, మరుసటి రోజైన ద్వాదశి రోజన విష్ణువును ఆరాధించి భోజనం చేస్తారు. దీని ప్రభావం వలన జనులకు ఆరోగ్యం కలిగి సుఖశాంతులతో జీవిస్తారని శాస్త్ర వచనం. వైజ్ఞానికంగా కూడా ఒక రోజున ఉపవాసం చేస్తే జఠర శక్తి పెరిగి చక్కని ఆరోగ్యం కలుగుతుంది. దైవోపాసన చేయటానికి ఉపవాసం చక్కని మార్గం. ఇతరత్రా వ్యాపకాలు లేకుండా భగవత్ కైంకర్యంలో కాలంగడపటం ఉపవాసం. 'ఉప' అంటే దగ్గర అని మరియు 'వాసం' అంటే 'నివసించటం'. అంటే దైవానికి దగ్గరగా ఉండి ఆయన సేవలో కాలక్షేపం చేయటం, నామ సంకీర్తన చేయటం. ముక్కోటి ఏకాదశి రోజు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి, అభ్యంగనాది కార్యక్రమాల ద్వారా శుచిగా పూజా మందిరంలో శ్రీ మహావిష్ణువుని లేక శ్రీపరమ శివుని బిల్వదళాలు, శంఖం పూలు, తులసిదళాలు మొద్కలైన వాటితో అర్చన చేయాలి. ఉత్తరం లేదా తూర్పు లేదా ఈశాన్యం వైపు చూచేవిధంగా దీపాలు వెలిగించాలి. గృహంలో పూజాధికాలు యధావిధిగా నిర్వహించి, విష్ణాలయంలో గాని, శివాలయంలో గాని ఏర్పరచిన ఉత్తరద్వారం ద్వారా పార్వతీ పరమేశ్వరులను లేదా లక్ష్మీనారాయణులను దర్శనం చేసుకోవాలి. ఈ విధమైన దర్శన భాగ్యంతో పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. పూజానంతరం పొంగలి నివేదన చేయాలి. ఏకాదశి వ్రత ప్రభావము వలన జన్మజన్మాంతరములనుండి పట్టిపీడిస్తున్న భయంకర వ్యాధులు, పీడలు తొలగిపోయి,



ఐశ్వర్య మరియు సుఖజీవన సంప్రాప్తి కలుగుతుందని పురాణ ప్రవచనము. రోజంతా శివకేశవుల నామ పారాయణతో గడపాలి. శివకేశవుల మధ్య బేధం చూపరాదు. యధాశక్తి దానధర్మాలు చేయాలి. గీతోపదేశం జరిగిన రోజు కావున ఈ రోజు గీతాపఠనం చేసి, భగవద్గీతను దానంగా సమర్పించాలి.ఎంతో ముక్తిప్రదమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మనమంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించి, యధాశక్తి దానధర్మాలు చేసి, ఇహపర సుఖాలను పొందుదాం.

- డా. దేవులపల్లి పద్మజ

# వంటచేయడం ఆనందం, ఆరోగ్యం

ఇప్పుడంతా స్మార్ట్ యుగం. హార్డ్‌వర్కర్ అన్న పేరుకన్నా స్మార్ట్ వర్కర్ అన్న పదానికే ఇప్పుడు క్రేజ్ ఉంది. తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తిని ఇవ్వడం అన్నది ఇటు పనిచేసే వారికీ హాయిగొలిపే అంశమే. మీరూ స్మార్ట్ వర్కర్‌గా మారిపోవాలను కుంటే ఇదిగోండి కొన్ని టిప్స్.

పనుల జాబితా: రోజును ప్రారంభించబోయే ముందే ఆ రోజు ఏం చేయాలి అన్నదాని మీద అవగాహన ఉండాలి. స్టాండప్ కాల్స్, రివ్యూ, క్లయింట్ మీటింగ్, ఇంటర్నల్ **డిస్కషన్స్..** ఇలాంటివన్నీ ఎప్పుడెప్పుడు ఉంటాయి అన్నది ఒకసారి అవలోకించుకుంటే, ఆ సమయానికి మిమ్మల్ని మీరు చక్కగా ప్రెజెంట్ చేసుకోగలుగుతారు. ఏ గ్యాప్ దగ్గర విశ్రాంతి తీసుకోవచ్చు. ఏ సమయంలో పనిచేసు కోవచ్చు అన్నదీ తెలుస్తుంది.

**ప్రాధాన్యతా క్రమంలో..:** పనిచేసేప్పుడు కూడా ఏ పని ఎక్కువ ప్రయారిటీ అన్నది చూసుకోవాలి. అంటే 20 శాతం టాస్క్‌లు 80 శాతం పనిని పూర్తిచేస్తాయి. ముందుగా ప్రాధాన్యం ఉన్న అలాంటి వాటిని గుర్తించి, పూర్తి చేసుకుంటే మిగతావి చేయడం సులభం అవుతుంది.

**నో చెప్పండి:** చెప్పిన ప్రతి పనికీ తలూపడం కాకుండా,



ముందుగా మీ దగ్గర ఉన్న పనులకు పట్టే సమయాన్నీ వాటి ప్రాధాన్యాన్ని అంచనా వేసుకోండి. అవీ ఇవీ చేయడం కష్టం అనిపిస్తే తప్ప కుండా నో చెప్పండి. లేకపోతే లేనిపోని గందర గోళానికి గురై సకాలంలో ఏ పనీపూర్తి చేయ లేరు. ఇంటర్‌వెల్ ఉండాలి: సుదీర్ఘ సమయం పనిచేస్తూ ఉండటం అంటే హార్డ్ వర్క్ చేయడమే. కానీ, క్రమం తప్పకుండా బ్రేక్‌లు తీసుకుంటూ పనులు పూర్తి చేస్తే అది ఒత్తిడిగా అనిపించదు. అధ్యయనాలు చెబుతున్న విషయం ఏమిటంటే ఇలాంటప్పుడు పనులు త్వరగా పూర్తవుతాయట కూడా

**.సత్వర స్పందన:** ఏదైనా ఇష్యూ మీ దగ్గరకి వచ్చినప్పుడు, ఒక మెయిల్‌కు రెస్పాండ్ అవ్వాల్సి వచ్చినప్పుడు వెనువెంటనే దానికి రిప్లై ఇవ్వండి. అవసరమైన వారి దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లండి. దీని తర్వాతే ఆ టాస్క్‌కు సంబంధించిన పని మొదలుపెట్టండి. వెంటనే స్పందిచడం అన్నది స్మార్ట్ వర్కర్ లక్షణాల్లో ప్రధానమైనది. ◻

# తిరుప్పావై

## 15వ పాశురము

ఎల్లే! ఇళంకిళియే ! ఇన్న
ముఱంగుదియో,
శిల్లెన్జళై యేన్మిన్ నంగైమీర్ !
పోదరుకిన్టేన్,
వల్లై ఉన్కట్టు రైకళ్ పండేయున్
వాయరితుమ్
వల్లీర్కళ్ నీంగళే నానేదా
నాయిడుగ,
వల్లైనీపోదాయ్ ! ఉనక్కెన్న
వేఱుడైయై
ఎల్లారుమ్ పోన్దారో? పాన్దార్
పోన్దెణ్ణిక్కోళ్,
వల్లా నై కొన్టానై మాత్తారై
మాత్తళిక్క
వల్లానై, మాయనై ప్పాడేలో
రెమ్బావాయ్



బోనిగోపికకు మరియు వెలుపలి గోపికల మధ్య ఈ విధముగా సంవాదము జరుగుతుంది.
వె.గో : ఓ లేత చిలుక వంటి కంఠ మాధుర్యము కలదానా ఇంకను నిదురించుచున్నావా?
లో.గో : సమర్థులయిన గోపికలారా, గొడవ చేయకండి
నేను వస్తున్నాను కదా!
వె.గో : నీవు చాలానేర్పు కలదానవు. మాటలలో నైపుణ్యం ఉంది. మరియు కాఠినమూ ఉంది.
లో.గో : మీరే మంచివారు. సరే. నేను కఠినరాలను.
వె.గో : నీ ప్రత్యేకత ఏంట? ఒకదానవే ఉంటావేంటి? తొందరగా రా!
లో.గో : అందరు వచ్చారా?
వె.గో : వచ్చారు లేవోయి. కావాలంటే లెక్కించుకో.
లో.గో : సరే. నే వచ్చి ఏం చేయాలో చెప్పండి.
వై.గో : బలిష్టమగు కువలయాపీడనమను ఏనుగును చంపినవాడు, శత్రువుల దర్పము అణిచినవాడు, మాయావి అయిన కృష్ణుని కీర్తిని గానము చేయుదము రావమ్మా !

ఫలం : "పరిపూర్ణ జ్ఞానం కలుగుతుంది"

# గోధుమ మిఠాయి



కావలసినవి : గోధుమ పిండి- ఒకటిన్నర కప్పు, పాలపొడి-కప్పు, నెయ్యి-టేబుల్‌స్పూన్, వేడి పాలు-ముప్పావు కప్పు, బేకింగ్ పౌడర్- అర చెంచా, నూనె-వేయించేందుకు సరిపడా, పంచదార-2 కప్పులు, యాలకులు-3, జీడిపప్పు,బాదం, పిస్తా పలుకులు-పావు కప్పు.

**తయారీ :** వెడలానపటి గిన్నెలో గోధుమ పిండి, పాలపొడి, బేకింగ్ పౌడర్ వేసి, వేడి పాలతో కలపాలి. బాగా కలిపి, పిండి మెత్తగా అయ్యిందనుకున్నాక మందమైన చపాతీలా ఒత్తుకవాలి. సీసా మూత సాయంతో చిన్న చిన్న వృత్తాల్లా కట్ చేయాలి. వీటిని కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, యాలకులు, రెండు కప్పుల నీళ్ల పోసి.. రెండు నిమిషాలు మరిగించి దించాలి. వేగిన సర్కిల్స్‌ను ఈ పాకంలో వేసి, రెండు గంటలు నాననివ్వాలి. వాటి మీద డ్రైఫ్రూట్స్ పలుకులు చల్లితే సరి రుచికరమైన గోధుమ మిఠాయి రెడీ. ◻



- జానకి ఎన్
హైద్రాబాద్

18 చుక్కలు
6 వరుసలు స
ఇటు అటు వదలి 6 వరకు



**కొత్త ముగ్గులకు ఆహ్వానం:** మా చిరునామాఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

# 'అనగనగా ఒక రాజు' రెండవ గీతం



'అనగనగా ఒక రాజు' రెండవ గీతం పండగ చిత్రానికి పెళ్లి సందడిని జోడించిన 'రాజు గారి పెళ్లిరో' గీతం వరుసగా మూడు ఘన విజ యాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం ఖీఅనగనగా ఒక రాజుఖీతో అలరించనున్నారు. ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి గీతం ఖీభీమవరం బాల్మాఖీ ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రాజు గారి పెళ్లిరో' విడుదలైంది. 'అనగనగా ఒక రాజు' నుంచి డ్యాన్స్ నంబర్‌గా విడుదలైన 'రాజు గారి పెళ్లిరో' పాట కట్టిపడేస్తోంది. మాస్ తో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉత్సాహభరితంగా సాగిన ఈ గీతం.. ఈ పాటలో నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమ అసాధారణ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకొని వెళ్లారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సమకూర్చిన అద్భుతమైన నృత్య రీతులతో ఈ పాటను భారీ స్థాయిలో తెరకెక్కించారు. రావు రమేష్ సహా ప్రధాన నటీనటులంతా పాల్గొనడంతో దృశ్య పరంగా ఈ పాట మరింత సంపన్నంగా,

# ఇండియా మూవీ 'టాక్సిక్' ఫస్ట్ లుక్



టాక్సిక్ సినిమాతో చేయబోతున్న ప్రయోగం, సాహసం గురించి ఆసక్తికరమైన విషయాలు చెప్పిన బాలీవుడ్ నటి రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్ సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ సినిమాలో ఎలిజిబెత్ పాత్రలో నటిస్తోన్న బాలీవుడ్ బ్యూటీ హుమా ఖురేషి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న హుమా ఖురేషి..టాక్సిక్ ప్రపంచంలోకి అడుగుపెట్టడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఫస్ట్ లుక్‌ను గమనిస్తే.. ఆమె పాత్రలో మిస్టరీ, ఇంటెన్సిటీ అర్థమవుతోంది. 2026లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ మోస్ట్ అవైటెడ్ మూవీపై లేటెస్ట్‌గా హుమా ఖురేషి ఫస్ట్ లుక్‌తో బజ్ మరింత పెరిగింది. టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్ సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. సినిమా 2026 మార్చి 19న ఈద్, ఉగాది, గుడి పడ్వా పండుగలు కలిసి వచ్చే లాంగ్ వీకెండ్ సమయంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

తెర

# 'పతంగ్'చూసి ఎంజాయ్ చేస్తున్నారు

## -దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి



నాకు వస్తున్న అభినందనలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు సినిమాను ప్రేక్షకులు ఇంతలా ఆదరిస్తుంటే నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లు అనిపిస్తుంది అంటున్నాడు దర్శకుడు ప్రణీత్ పత్తిపాటిఖి.

**ఫీడ్‌బ్యాక్ ఎలా ఉంది?**

టాక్‌తో పాటు కలెక్షన్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. యూని వర్సల్‌గా ఈ సినిమాకు హిట్‌టాక్..తో పాటు ఓ మంచిసినిమావ చూశామన్న సంతృప్తిని ఆడియన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా పతాక సన్నివేశాలు ఓ స్టేడియంలో ఓ మ్యాచ్‌ను చూస్తున్న అనుభూతికి లోనవుతున్నారు.

**మీ నేపథ్యం?**

హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను.. నేను రామానాయుడు ఫిల్మ్ స్కూల్లో డీఎఫ్‌టెక్ చేశాను. పతంగ్ దర్శకుడిగా నాతొలిచిత్రం.

**మూడు సంవత్సరాల సమయంలో నిర్మాతల సపోర్ట్ మీకు ఎలా ఉంది?**

ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్ మా నిర్మాతలే 'ఓ ఐదేళ్ళ క్రితం నా ప్రమేయం లేకుండా జరిగిన ఓ నేను ఎక్కడైనా రాజీపడ్డ వాళ్లు మాత్రం రాజీపడలేదు. ఎంతో ఖర్చు పెట్టి ఈ సినిమాను సినిమా ఇంత రిచ్‌గా, కలర్‌ఫుల్‌గా కని పించడానికి వాళ్లు పెట్టిన ఖర్చే కారణం.

**సినీ పరిశ్రమ నుంచి ఎలాంటి సపోర్ట్ లభిస్తుంది?**

సినీ పరిశ్రమలో సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో అభినందిస్తున్నారు. ముఖ్యంగా ఎస్‌కేఎన్,సందీప్‌కిషన్, బెల్లంకొండ సురేష్, దిల్ రాజులు ఎంతో మెచ్చుకున్నారు.

**థియేటర్లు మీ సినిమాకు దొరకకపోవడం బాధగా ఉందా?**

మొదటిరోజు బాధపడ్డాను. స్లోగా టాక్ స్ప్రెడ్ అయ్యింది.సినీ పరిశ్రమ నుంచి ఎక్కువ సపోర్ట్ వస్తుంది.

**పతంగ్ జర్నీలో మీరు తెలుసుకున్నది ఏమిటి?**

మూడు సంవత్సరాల జర్నీలో చాలా నేర్చుకున్నాను. సినిమా తీయ్యడం కంటే మార్కెటింగ్ చాలా ముఖ్యమని తెలిసింది.

**ఈ సినిమా కొత్తవాళ్లతో చేయడానికి కారణం?**

కథకు తగ్గట్టుగా కొత్తవాళ్లతోనే అనుకున్నాం. కథ, మాటలు అన్నీ నేను రాసుకున్నాను.

**పర్సనల్‌గా మీకు ఎలాంటి సినిమాలు ఇష్టం?**

ఎంటర్‌టైనింగ్ జోన్‌లో కమర్షియల్ సినిమాలు చాలా ఇష్టం.పతంగ్‌లో కామెడీకి టెన్ టైమ్స్ నా తదుపరి సినిమాలో ఉంటుంది అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు.

# సల్మాన్ 60వ పుట్టినరోజుకు రామ్ చరణ్



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ 60వ పుట్టినరోజు వేడుకకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హాజరయ్యారు. స్టార్‌లతో నిండిన ఈ వేడుకకు రామ్ చరణ్ హాజరుకావడం ఈవెంట్ ని మరింత స్పెషల్‌గా మార్చింది. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, ఎంఎస్ ధోనీ, బాబీ డియోల్ కలిసి దిగిన ఫోటో. సినిమా, క్రికెట్ ప్రపంచాలకు చెందిన దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో సహజంగా నవ్వుతూ కనిపించిన ఈ ఫోటో సోషల్ మీడియా లో వేగంగా వైరల్ అయ్యింది.రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా చిత్రం 'పెద్ది'తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఇప్పటికే దేశవ్యాప్తంగా

# 'ఖుదీరాం బోస్' పాత్రలో నటించడం నా అదృష్టం : - రాకేష్ జాగర్లమూడి.



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అతి పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు ఖుదీరాం బోస్. ఆయన జీవిత గాథను వెండితెరపై ఆవిష్కరించిన చిత్రం 'ఖుదీరాం బోస్'. ఈ చిత్రంలో టైటిల్ రోల్ పోషించిన యువ నటుడు రాకేష్ జాగర్లమూడి తన అనుభవాలను, సినిమా విశేషాలను పంచుకున్నారు. ఆ విశేషాలు మీకోసం...

**ప్రశ్న: "ఖుదీరాం బోస్" కథ విన్నప్పుడు మీ మొదటి స్పందన ఏమిటి?**

రాకేష్: నిజం చెప్పాలంటే, కథ వింటున్నంత సేపు నా గుండె వేగంగా కొట్టుకుంది. కేవలం 18 ఏళ్ల వయసులో ఒక బాలుడు దేశం కోసం చిరునవ్వుతో ఉరికంబం ఎక్కడం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ వీరుడి పాత్రను నేను పోషించబోతున్నానని తెలియగానే ఒక పక్క గర్వంగా, మరోపక్క పెద్ద బాధ్యతగా అనిపించింది.

**ప్రశ్న: ఈ అవకాశం మీకు ఎలా లభించింది?**

రాకేష్: ఈ చిత్ర నిర్మాత మా నాన్నగారే (విజయ్ జాగర్లమూడి). ఆయన ద్వారానే నాకు ఈ అవకాశం దొరికింది. ఒక రకంగా ఈ పాత్ర నాకు సులభంగానే దక్కినప్పటికీ,దానికి న్యాయం చేయడం కోసం నేను చాలా శ్రమించాల్సి వచ్చింది.

**ప్రశ్న: అసలు ఖుదీరాం బోస్ కథనే సినిమాగా తీయాలని మీ నాన్నగారికి ఎందుకు అనిపించింది?**

రాకేష్: మా నాన్నగారికి దేశభక్తి అంటే ప్రాణం. ఆయన విపరీతంగా పుస్తకాలు, గ్రంథాలు చదువుతారు. మా ఇంట్లో ఎటు చూసినా దేశభక్తికి సంబంధించిన పుస్తకాలే ఉంటాయి. ఆ స్ఫూర్తితోనే, నేటి తరానికి ఈ వీరుడి కథను తెలియజేయాలనే ఉద్దేశంతో ఆయన ఈ సినిమాను నిర్మించారు.

**ప్రశ్న: ఈ సినిమాను ఎక్కడ చూడవచ్చు?**

రాకేష్: ఈ చిత్రం భారత ప్రభుత్వ అధికారిక ఓటీటీ ప్లాట్‌ఫారం Waves (వేవ్స్)లో అందుబాటులో ఉంది. ప్లే స్టోర్ నుండి Waves యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, తెలుగు, హిందీ, తమిళం, బెంగాలీ భాషల్లో ఉచితంగా చూడవచ్చు. ఎటువంటి సబ్‌స్క్రిప్షన్ అవసరం లేదు. దయచేసి అందరూ చూసి మన చరిత్రను ఆదరించండి.వయసు చిన్నదైనా ఆలోచనలు పెద్దవిగా ఉండాలని నిరూపించిన రాకేష్ జాగర్లమూడి, భవిష్యత్తులో 'ఛత్రపతి శివాజీ' వంటి వీరగాథల్లో నటించాలని కోరుకుంటున్నారు.

# స్వతహా నేను ఫైటర్‌ని : సంజనా గర్లాని



సంఘటన నా జీవితాన్ని,కెరీర్‌ని ఒక కుదుపు కుదిపేసింది. అయితే స్వతహా నేను ఫైటర్‌ని. అందుకే ప్రతికూల పరిస్థితులతో నేను పెద్ద పోరాటమే చేశాను. చివరికి విజేతగా నిలిచాను" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు బిగ్ బాస్ సీజన్9లో టాప్ 5 ఫైనలిస్ట్‌గా నిలిచిన ప్రముఖ హీరోయిన్ సంజనా గర్లాని. ఒడిదుడుకుల్లో తన వెన్నంటి నిలిచిన తన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిగ్ బాస్ సీజన్ 9లో టాప్ 5 ఫైనలిస్ట్ గా నిలిచిన సంజన మీడియాతో ప్రత్యేకంగా సమావేశమై, బిగ్ బాస్ బిగ్ బాస్ నుంచి తాను ఎంతో నేర్చు కున్నానని, ఈ అనుభవంతో తన కెరీర్ లో ఫ్రెష్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనున్నానని ఆమె తెలిపారు. ముఖ్యంగా జీవితంలో తాను మళ్ళీ గర్వంగా తలెత్తుకుని తిరిగేందుకు కారణంగా నిలిచిన బిగ్ బాస్‌కి ఎప్పటికీ ఋణపడి ఉంటానని సంజనా ప్రకటించారు.

ఆట



# సబలెంకా సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ నెంబర్ వన్ అరియానా సబలెంకా ఓటమిపాలైంది. 50 సంవత్సరాల క్రితం మాజీ గ్రాండ్‌స్లామ్ విజేత బాబీ రిగ్స్‌పై బిల్లీ జీన్ కింగ్ సాధించిన ప్రసిద్ధ విజయానికి ఆధునిక పోటీగా అభివర్ణించబడిన బాటిల్ ఆఫ్ ది సెక్సెస్ మ్యాచ్‌లో నిక్ కిర్గియోస్ 6-3, 6-3 తేడాతో అరియానా సబలెంకాను ఓడించాడు. పాయింట్ కు ఒక సర్వ్ అనే నియమం అమలులో ఉండటంతో, ఇద్దరు ఆటగాళ్లు కీలకమైన క్షణాల్లో తమ డెలివరీలలో తడబడ్డారు. కిర్గియోస్ 4-3 ఆధిక్యం కోసం బ్రేక్ చేసి ప్రారంభ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్‌లో 1-3 తేడాతో వెనుకబడిన తర్వాత ఈ అసాధారణ ఆస్ట్రేలియన్ పట్టుదలతో ప్రయత్నించాడు. బెలారసియన్ సబలెంకా లాంగ్ షాట్ పంపిన తర్వాత అతను పట్టుదలతో 3-3తో స్కోరు సాధించాడు.

# టి 20ల్లో 8 వికెట్లు తీసిన తొలి బౌలర్ సోనమ్

**న్యూఢిల్లీ:** క్రికెట్ చరిత్రలో ఎడమచేతి వాటం, మహిళా స్పిన్నర్ సోనమ్ యేషే తన పేరును లిఖించుకుంది, మహిళల, పురుషుల అంతర్జాతీయ లేదా ఇతర టీ20 మ్యాచ్‌లో 8 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచింది. మయన్మార్‌తో జరిగిన మూడో టీ20 సందర్భంగా 22 ఏళ్ల యెషే ఈ మైలురాయిని సాధించింది. సోనమ్ తన నాలుగు ఓవర్లలో ఏడు వికెట్లకు 8 పరుగులు ఇచ్చి, భూటాన్ 9 వికెట్లకు 127 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించగా, మయన్మార్‌ను కేవలం 45 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇక ఈ సిరీస్ చాలా ఏకపక్షంగా సాగింది, నాలుగు మ్యాచ్‌లలో సోనమ్ మొత్తం 12 వికెట్లు పడగొట్టింది. చివరి మ్యాచ్ సోమవారం జరగనుంది. మహిళల క్రికెట్‌లో, ఇండోనేషియాకు చెందిన రోహ్మలియా బెంచ్‌మార్క్‌గా మిగిలిపోయింది. ఆమె 2024లో మంగోలియాపై 0కి అసాధారణమైన 7 వికెట్లు పడగొట్టింది.



మహిళల టీ20లు మహిళల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఫ్రెడెరిక్ ఓవర్‌డిజ్క్ (నెదర్లాండ్స్-ఫ్రాన్స్‌కు 7/3), అలిసన్ స్టాక్స్ (పెరూ-అర్జెంటీనాకు 7/3), మరియు సమంతి దునుకెడెనియా (చెక్ రిపబ్లిక్‌పై సైప్రస్‌కు 15/7) ఏడు వికెట్లు పడగొట్టారు, మొత్తం మీద మహిళల గి20 మ్యాచ్‌లలో ఇలాంటివి నాలుగు అదనంగా నమోదయ్యాయి. సోనమ్ ప్రదర్శనకు ముందు, పురుషుల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 7 వికెట్లు రెండుసార్లు మాత్రమే రికార్డైంది. సయాజ్రుల్ ఇద్రస్ (2023లో చైనాపై మలేషియాకు 8 వికెట్లకు 7), అలీ దావూద్ (2025లో భూటాన్‌పై బహ్రెయిన్‌కు 19 వికెట్లకు 7) క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన వారిగా నిలిచారు. అలాగే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కూడా 7 వికెట్లు కేవలం రెండుసార్లు మాత్రమే నమోదయ్యాయి. కాలిన్ అకెర్మాన్ (లీసెస్టర్‌షైర్ తరఫున 2019లో బర్మింగ్‌హామ్ బేర్స్‌పై 18కి 7) మరియు టాస్కిన్ అహ్మద్ (2025లో ఢాకా క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దర్బార్ రాజ్‌షాహి తరఫున 19కి 7)గా రికార్డు చోటు చేసుకుంది.



# ప్రపంచ వేదికపై భారత్ జైత్ర యాత్ర

## క్రికెట్ నుంచి చెస్ వరకు విజయాలు 2025

**న్యూఢిల్లీ:** మరో 48 గంటల్లో ముగియనున్న 2025 సంవత్సరం భారత క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. ఈ ఏడాదిలో వివిధ క్రీడల్లో మన యువ అథ్లెట్లు సాధించిన విజయాలు ప్రపంచ దేశాలను భారత్ వైపు తిరిగి చూసేలా చేస్తున్నాయి. క్రికెట్ మైదానంలో పరుగుల వర్షం కురిపించడం నుంచి, చదరంగం బోర్డుపై ప్రపంచ దిగ్గజాలను మట్టికరిపించడం వరకు భారత యువత తమ అజేయమైన ప్రతిభను చాటుతోంది. ఎంతోమంది యువ భారతీయ అథ్లెట్లు ప్రపంచ వేదికపై తమ ముద్ర వేయడమే కాకుండా, భారత క్రీడారంగం గురించి లోకం ఆలోచించే విధానాన్నే మార్చేశారు. క్రికెట్‌లో ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రే తదితరులు సంచలన ఆటతీరుతో వార్తల్లో నిలిచారు. కేవలం 14 ఏళ్ల వయస్సులోనే ఐపీఎల్ వేలంలో కోట్లు పలికి చరిత్ర సృష్టించిన సూర్య ఇప్పుడు భారత అండర్ 19 జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో కూడా యువ బ్యాటర్లు తమదైన ముద్ర వేస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో రాణించిన ఎంతోమంది కుర్రాళ్లు ఇప్పుడు జాతీయ జట్టులో కీలక ఆటగాళ్లుగా మారుతున్నారు. ఇక చెస్‌లో భారత్ ఇప్పుడు ప్రపంచ అగ్రగామిగా ఎదిగింది. భారత చెస్‌లో మరో సరికొత్త సంచలనం దివ్య దేశ్‌ముఖ్. గ్రాండ్ మాస్టర్ దివ్య మహిళల వరల్డ్ కప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ఫిడే మహిళల వరల్డ్‌కప్2025లో 19 ఏళ్ల ఈ యువతి అద్భుత విజయం సాధించి ఫైనల్లో సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిని ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. దీంతో కేవలం వరల్డ్‌కప్ గెలిచిన అత్యంత పిన్న చెస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. గ్రాండ్‌మాస్టర్ హోదా పొందకముందే ఈ ఘనత సాధించిన అరుదైన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. ఆమె ఓవరాల్‌గా భారత్‌లో 88వ, మహిళల్లో 44వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచింది. అలాగే ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్2026కు అర్హత సాధించింది. ఇక గ్రాండ్‌మాస్టర్ డి. గుకేష్ సాధించిన విజయాలు అద్వితీయం. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అతి పిన్న వయస్సులో సంచలనాలు సృష్టించిన గుకేష్, ప్రజ్ఞానంద వంటి వారు రష్యా, అమెరికా ఆధిపత్యానికి చరమగీతం పాడుతున్నారు. ఇతర క్రీడల్లో మెరుపులు: కేవలం క్రికెట్, చెస్ మాత్రమే కాదు, బ్యాడ్మింటన్, షూటింగ్, అథ్లెటిక్స్‌లో కూడా భారత యువత అద్భుతాలు చేస్తోంది. ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి నాకౌట్‌కు చేరిన ఇరిగేసి అర్జున్ రాపిడ్ రౌండ్ రాబిన్ దశలోనూ కార్ల్‌సన్‌కు ఓటమిని రుచి చూపించాడు. ఇక పారా ఆర్చర్ శీతల్ దేవి వరల్డ్ ఆర్చరీ పారా చాంపియన్‌షిప్స్ టైటిల్ గెలుచుకుంది. షూటర్ సామ్రాట్ రాణా ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో విజయం సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. పారా అథ్లెట్ సుమిత్ ఆంటిల్, అథ్లెట్ అనిమేశ్ కుజూర్ కూడా ఈ ఏడాది చెప్పుకోదగ్గ విజయాలు సాధించారు. అలాగే టీమ్ ఈవెంట్లలో భారత్ తొలిసారిగా మహిళల క్రికెట్ వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఖోఖోలో పురుషులు, మహిళలు, కబడ్డీలో పురుషులు, మహిళల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. మహిళల అంధుల క్రికెట్ జట్టు కూడా టీ20 వరల్డ్‌కప్ గెలిచి భారత క్రీడా వైభవాన్ని ప్రపంచానికి చాటింది.




## టాటా ఓపెన్ గోల్ఫ్‌లో ఒకే షాట్‌తో ఉత్కంఠ విజయం

### సంధుకు ఏడు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** రెండు వారాల క్రితం సీజన్‌లో ఆరో విజయం తర్వాత 2025 పిజిటిఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్ కిరీటాన్ని ఇప్పటికే పొందిన యువరాజ్ సంధు, టాటా ఓపెన్ 2025లో వన్‌స్ట్రోక్ విజయంతో మరో టైటిల్‌ను సాధించి సీజన్‌లో రికార్డు స్థాయిలో ఏడు టైటిళ్లను కైవసం చేసుకున్నాడు. బెల్దిహ్, గోల్మురి గోల్ఫ్ కోర్సులలో జరిగిన పిజిటిఐ సీజన్ ముగింపులో, ఓవర్‌నైట్ జాయింట్ లీడర్ అయిన 28 ఏళ్ల యువరాజ్ (67-64-68-65) చివరి రౌండ్ స్కోరును ఆరు అండర్ 65తో ముగించాడు. చివరి హోల్‌లో అతని మ్యాచ్ విన్నింగ్ బర్డీ ద్వారా ఈ వారం మొత్తం 20అండర్ 264తో హైలైట్ చేయబడింది. దీంతో ఒకే సీజన్‌లో అత్యధిక విజయాలు సాధించిన ఆటగాడిగా కొత్త రికార్డును నెలకొల్పాడు. రెండు వారాల క్రితం ఢిల్లీలో జరిగిన ఈ మ్యాచ్‌లో యువరాజ్ 2022 నుండి ఆరు విజయాల రికార్డును సమం చేశాడు. సంధుతో పాటు ఓవర్‌నైట్ జాయింట్ లీడర్‌గా ఉన్న 21 ఏళ్ల శుభమ్ జగ్లాన్ (68-66-65-66), రౌండ్ నాల్గవ భాగంలో బోగీ లేని ఐదు అండర్ 66తో వారం మొత్తం 19 అండర్ 265తో ముందుకు వచ్చాడు. ఈ టూర్‌లో అతని మూడవ ప్రదర్శనలోనే పిజిటిఐలో రెండవ రన్నరప్ స్థానాన్ని నమోదు చేశాడు. ఖలీన్ జోషి (66) మరియు వీర్ అహ్లావత్ (66) 14అండర్ 270తో మూడో స్థానంలో నిలిచారు.

## మహిళల హీరో హాకీ ఇండియా లీగ్‌లో

# పైపర్స్ విజయం

### 2-0 తేడాతో రాంచీ రాయల్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల హీరో హాకీ ఇండియా లీగ్ 2025-26 టోర్నీలో రాంచీ రాయల్స్‌పై 2-0 తేడాతో విజయం సాధించి ఎజీ పైపర్స్ తమ ప్రచారాన్ని ప్రారంభించింది. చివరి క్వార్టర్ ప్రారంభంలో టెరెసా వియానా సెకను జోడించి ఫలితాన్ని ఖరారు చేయడానికి ముందు, 27వ నిమిషంలో కెప్టెన్ నవనీత్ కౌర్ స్కోరింగ్‌ను ప్రారంభించింది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఒకదానిపై మరొకటి ఆధిక్యం కోసం పోరాడటంతో చివరి వరకూ ఏ జట్టూ ప్రారంభంలో పెనాల్టీ కార్నర్‌ను అంగీకరించలేదు. రాంచీ రాయల్స్ హన్నా కాటర్ ద్వారా గోల్ కోసం ప్రయత్నించగా, నవనీత్ కౌర్, దీపిక పైపర్స్ తరఫున ఆ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో రాయల్స్‌కు రుతుజా దాదాసో పిసల్ ద్వారా తొలి పెనాల్టీ కార్నర్ లభించింది. అయితే మరియా ఓర్టిజ్ డ్రాగ్‌ఫ్లిక్‌ను పైపర్స్ గోల్ కీపర్ తొలి ప్రయత్నాలు గోల్స్ కాకుండా నిరోధించే యత్నం చేసింది. నవనీత్ శక్తివంతమైన స్ట్రైక్‌తో పెనాల్టీ కార్నర్‌ను తొలి గోల్‌గా మార్చింది. మూడవ క్వార్టర్‌లో రాంచీ రాయల్స్ సమం చేసే ప్రయత్నంలో అనేక పెనాల్టీ కార్నర్‌లను సంపాదించింది, కానీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. చివరి క్వార్టర్ ప్రారంభంలో, టెరెసా వియానా గోల్ కీపర్‌ను దాటుకుని డ్రిబుల్ చేసింది మరియు ప్రశాంతంగా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది.



# నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు

వాణిజ్యం



**ముంబయి, డిసెంబరు 29:** సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాలతో ముగిసాయి. సోమవారం ట్రేడింగ్‌లో ఐటీ, రియల్టీ, ఫార్మా, ఆటో షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనమయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 345.91 పాయింట్లు క్షీణించి 84,695.54 వద్ద స్థిరపడింది. మరోవైపు, నిఫ్టీ కూడా 100.20 పాయింట్లు నష్టపోయి 25,942.10 వద్ద ముగిసింది. నెలవారీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ ఓ) గడువు సమీపిస్తుండటంతో మార్కెట్లో ఒడుదొడుకులు పెరిగాయని విశ్లేషకులు తెలిపారు. నిఫ్టీ కీలకమైన 26,000 మార్కు దిగువకు పడిపోవడం ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తించింది. టెక్నికల్‌గా చూస్తే, అమ్మకాల ఒత్తిడి కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. నిఫ్టీ 25,900 స్థాయిని నిలబెట్టుకోలేకపోతే 25,800-25,700 స్థాయిల వరకు పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సెన్సెక్స్ షేర్లలో పవర్‌గ్రిడ్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, బీఈఎల్ వంటివి ప్రధానంగా నష్టపోయాయి. అయితే, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించడంతో లాభాలతో ముగిశాయి. స్మాల్ మిడ్‌క్యాప్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.52 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.72 శాతం మేర క్షీణించాయి. రంగాలవారీగా నిఫ్టీ ఐటీ, రియల్టీ, ఆటో సూచీలు పతనం కాగా, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ సూచీలు స్వల్ప లాభాలను నమోదు చేశాయి. దేశీయంగా బలమైన ఆర్థిక ఫండమెంటల్స్ మార్కెట్‌కు కొంత మద్దతు ఇస్తున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు, భౌగోళిక రాజకీయాలపై నెలకొన్న అనిశ్చితులు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేస్తున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# వెండి ధరలు భారీగా పతనం

## రూ.21వేలు తగ్గుదల, పసిడి ధరల్లోను అదే తీరు

**ముంబయి, డిసెంబరు 29:** ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పతనం చవిచూసాయి. ఎంసీఎక్స్‌లో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర ఒక్కసారిగా రూ.21 వేలు పడిపోయింది. సోమవారం రూ.2.54 లక్షలతో గరిష్ఠాన్ని తాకిన వెండి ఆ తర్వాత గంటలోనే 2.33 లక్షల కనిష్ఠాన్ని తాకింది. స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర తగ్గింది. హైదరాబాద్‌లో అంతకుముందు రూ.2.50 లక్షలు పలికిన వెండి కిలో ధర రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండి ధరలు దూసుకుపోయాయి. ముఖ్యంగా వెండి ధరలు ఎన్నడూ లేని రీతిలో పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్లకు దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఇటీవల అనూహ్యంగా పెరిగింది. సోమవారం ఒక దశలో 80 డాలర్ల పైకి చేరుకుంది. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ధర కూడా సుమారు 2 శాతం పడిపోయింది. ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల పసిడి రూ.1.37 లక్షల స్థాయికి పడిపోయింది. ఫ్యూచర్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పడిపోవడానికి వివిధ కారణాలు ఉన్నాయి. రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక ముందడుగు పడింది. శాంతి ఒప్పందానికి




ఇరువురు దేశాధినేతలు సుముఖంగా ఉండటంతో యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాలు వెండి ధర పడిపోవడానికి కారణమైంది. వెండి ఏడాదిలో 181 శాతం పెరిగింది. గరిష్ఠాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఉక్రెయిన్ రష్యా యుద్ధం, భారత్ అమెరికాల వాణిజ్య ఒప్పందంలో స్తంభన, ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు, డాలర్ రూపాయి మారకం రేట్లు, ఈక్విటీల్లో అంతంతమాత్రమే రిటర్నులు వంటి కారణాలతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి మార్గంగా పసిడి, వెండి ఖనిజాలపై పెట్టుబడులు పెంచుతూ పోయారు. అందుకే అటు గ్లోబల్ మార్కెట్‌లోను, స్పాట్ దేశీయ మార్కెట్, ఫ్యూచర్ మార్కెట్లలో కూడా ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

# కృత్రిమ మేధతో పెరుగుతున్న లేఆఫ్‌ల భయం

## ఒక్క యేడాదిలోనే 1.22 లక్షలమంది తొలగింపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** టెక్ రంగంలో అనిశ్చితి కొనసాగుతోంది. కృత్రిమ మేధ ప్రవేశం, దేశాల మధ్య అనిశ్చిత పరిస్థితులు వెరసి ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సెక్టార్ ప్రస్తుతం గడ్డ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. చిన్న కంపెనీల నుంచి మొదలుకొని దిగ్గజ టెక్ సంస్థల వరకు అన్నీ తమ కార్యకలాపాల్లో ఏఐని భాగం చేస్తూ మానవ వనరుల్ని క్రమంగా తగ్గించుకుంటున్నాయి. ఫలితంగా వేల సంఖ్యలో ఉద్యోగులు కొలువులను కోల్పోతున్నారు. ఈ ఏడాది ఐటీ కంపెనీలు లక్ష మందికిపైగా ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించినట్లు ఒక సర్వేలో తేలింది. ప్రపంచ వ్యాప్తంగా 551 టెక్ కంపెనీలు ఈ ఏడాది 1.22 లక్షల మందిని ఉద్యోగం నుంచి తొలగించాయి. టిసిఎస్‌తోపాటు అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, సేల్స్‌ఫోర్స్, హెచ్‌పీ, యాపిల్, మెటా, గూగుల్ వంటి పెద్దపెద్ద సంస్థలు ఖర్చు



తగ్గించుకునేందుకు భారీగా ఉద్యోగులను తొలగించాయి. అమెజాన్ ఈ ఏడాదిలో దాదాపు 14,000 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. క్లౌడ్ సర్వీసెస్, డివైజెస్, రిటెయిల్, అడ్వర్టైజింగ్, గ్రాసరీస్ విభాగాల్లోని ఉద్యోగులు ప్రభావితమయ్యారు. వ్యయ నియంత్రణలో భాగంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌లోనూ కోత పడింది. ఈ ఏడాదిలో 15 వేల మందికిపైగా ఉద్యోగులపై వేటు వేసింది. ఇందులో ఒక్క జులైలోనే 9 వేల మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు. ఏఐ పుణ్యమా అని దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. ఈ క్రమంలో భారత అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించింది. తమ మొత్తం ఉద్యోగుల్లో 2 శాతానికి సమానమైన 12 వేల మంది ఉద్యోగులపై టీసీఎస్ వేటు వేసింది. చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థికసవాళ్లను ఎదుర్కొంటోంది. ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్‌బు టాన్ బాధ్యతలు స్వీకరించాకసంస్థ భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతోంది. జులైలో తమ మొత్తం ఉద్యోగుల్లో 15 శాతం తగ్గించుకుంటున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ కంపెనీ ఉద్యోగుల సంఖ్య 2024 చివరికి 1,09,800 గా ఉండగా 2025 చివరికి 75 వేలకు పరిమితం చేయాలని నిర్ణయించుకుంది. ఏఐ వినియోగం నేపథ్యంలో 4 వేల మంది కస్టమర్ సపోర్ట్ సిబ్బందిని తొలగించినట్లు సేల్స్‌ఫోర్స్ తెలిపింది. పర్సనల్ కంప్యూటర్లను తయారు చేసే హెచ్‌పీ కూడా సుమారు 6 వేల మంది వరకు ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు ప్రకటించింది. యాపిల్, మెటా, గూగుల్, వెరిజోన్, సీమెన్స్ వంటి సంస్థలు కూడా భారీగా లేఆఫ్స్ ప్రకటించాయి. వెరిజోన్ 13 వేల మందికిపైగా తొలగించనున్నట్లు నవంబర్‌లో ప్రకటించింది. సీమెన్స్ 6వేల మందిని తొలగించనున్నట్లు తెలిపింది.




## కొత్త యేడాదిలో బ్యాంకు సెలవులు ప్రకటించిన ఆర్బీఐ

**ముంబయి, డిసెం బరు 29:** కొత్త సంవత్సరంలోకి మరికొద్దిరోజు ల్లో నే ప్రవేశి స్తుండ టంతో భారతీయ రిజర్వుబ్యాంకు కొత్త సం వత్సరంలో బ్యాంకుల శెలవులను ప్రకటించింది. రిపబ్లిక్‌డే, గాంధీ జయంతి, పంద్రాగస్టు దీపావళి వంటి వాటికి దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవులుంటాయి. అలాగే రెండు, నాలుగోశని వారాలు కూడా బ్యాంకులు పనిచేయవు. ఆదివారం ఎలాగూ సెలవు దినమే ఇవికాకుండా ఆర్బీఐ ప్రకటించిన సెలవులు కూడా కస్టమర్లు గుర్తుపెట్టుకోవాలి. వచ్చేనెల 15 మకరసంక్రాంతి, 26 రిపబ్లిక్‌డే, మార్చిలో మూడోతేదీ హోలీ, 19వ తేదీ ఉగాది, 20నఏపిలోను, 21వతేదీ తెలంగాణలోను రం జాన్, మార్చి27వ తేదీ శ్రీరామనవమి పర్వది నాల్లో బ్యాంకులకు సెలవులుంటాయి. ఏప్రిల్‌లో ఖాతాలు ముగించే రోజు ఏప్రిల్ ఒకటి కాగా ఏప్రిల్3 గుడ్‌ఫ్రైడే, బిఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14, మే ఒకటవ తేదీ మేడే, మే 27వ తేదీ బక్రీద్‌లకు శెలవులు. జూన్‌లో ఏపీలో 25, తెలంగాణలో 26తేదీల్లో మొహర్రం, ఆగస్టు 15న పంద్రాగస్టు వేడుకలు, 25వ తేదీ ఏపి, 26వ తేదీ తెలంగాణల్లో మిలాద్ ఉన్ నబీ, సెప్టెంబరు 4న శ్రీకృష్ణ జన్మాష్టమి, 14వ తేదీ వినాయక చతుర్థి, అక్టోబరు2 గాంధీ జయంతి, 20వ తేదీ విజయ దశమి, నవంబరులో 24తేదీ గురునానక్ జయంతి, 8వతేదీ ఆదివారం దీపా వళి, డిసెంబరు 25క్రిస్మస్ రోజుల్లో బ్యాంకులకు సెలవులుంటాయని ఆర్‌బీఐ ప్రకటించింది.

# ఐపిఒలతో వచ్చే యేడాది రూ.4 లక్షలకోట్ల నిధులు

## అంచనా వేస్తున్న ఆర్థికసేవల సంస్థలు

**ముంబయి, డిసెంబరు 29:** ట్రేడింగ్ సంవత్సరం అంటే కేలండర్ 2025లో మొత్తం ఐపిఒల ద్వారా 1.95 లక్షలకోట్లు కంపెనీలు నిధులు సమీకరించుకోగలిగాయి. వీటిలో 103 మెయిన్ బోర్డు ఐపిఒలు, 270 ఎస్ఎంఇ ఐపిఒలు ఉన్నట్లు తేలింది. 2026లో కూడా ప్రైమరీ మార్కెట్ల ద్వారా సుమారు 4 లక్షలకోట్లు నిధులు సమీకరించే అవకాశం ఉందని పాంటోమత్ బిజినెస్ సంస్థ ప్రకటించింది. భారీ కంపెనీలతోపాటు మిడ్‌సైజ్, వర్ధమాన కంపెనీలు కూడా మార్కెట్లద్వారా నిధులు సమీకరించుకుంటున్నాయి. పబ్లిక్, ప్రైవేటు క్యాపిటల్‌పరంగా చూస్తేప్రైమరీ మార్కెట్‌లోనిధుల సేకరణ 49శాతం వాటాతో ఉంది. అదే అమెరికాలో కేవలం 9శాతం, యూరోప్‌లో 13శాతం మాత్రమే నిధుల సమీకరణ ఉంది. దేశీయంగా




ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరుగుతుండటం, చట్టపరంగా ఇష్యూ జారీని సులభతరం చేయడం, ఇన్వెస్టర్లకు రక్షణ కల్పించడం వంటి వాటితో ఐపిఒలతోనే కంపెనీలు ఇపుడు నిధులు సేకరిస్తున్నాయి. చైనాలో పబ్లిక్ మార్కెట్ ఆధిపత్యం ఉంటుంది. ప్రైవేటు క్యాపిటల్‌కంటే 18 రెట్లు ఎక్కువ. అదే భారత్‌లో అయితే ఐపిఒలతో నగదు లభ్యత పెరుగుతోంది. క్యాపిటల్ సమీకరణకు ముఖ్యవనరుగా మారుతోంది. 2015-2019వరకూ క ఏవలం 1100 కోట్లు సమీకరిస్తే 2020లో 1570 కోట్లు, సమీకరించాయి. కొన్ని ఐపిఒలు అయితే రూ.11 కోట్ల నుంచి 24 కోట్లకు కూడా పెరిగాయి. భారత్‌లో మెయిన్‌బోర్డు ఐపిఒలు దశాబ్దకాలంగా పెరుగుతున్నాయి గత పదేళ్లనుంచి చూస్తే 29 శాతం పెరిగాయి. ఎస్ఎంఇ ఐపిఒ నిధులసేకరణ 46శాతంగా ఉంది. అయితే నిధుల సేకరణ తోపాటు కంపెనీలు తమ వాటాలను విక్రయించు కోడానికి కూడా ఐపిఒలు నిలుస్తున్నాయి. ఈ ఏడాది నవంబరులో 23 కంపెనీలు 3.2బిలియన్ డాలర్లు విత్‌డ్రాచేసుకున్నాయి. ఏడు కంపెనీల నిష్క్రమణంతో ఐపిఒలద్వారా 1.5బిలియన్ డాలర్లు విత్‌డ్రా అయ్యాయి. బ్యాంక్ ప్రమోట్ చేసిన ఆర్థిక లిస్టింగ్‌లు రూ.12,500 కోట్లు ఐపిఒలకు వచ్చాయి. హెచ్‌డిపి ఫైనాన్షియల్ సర్వీసెస్ ఒక్కటే ఐపిఒకు వచ్చింది. 100 కోట్లనుంచి 500 కోట్ల విభాగంలోనే ఐపిఒలు 58శాతం వరకూ పెరిగాయి. వెయ్యినుంచి ఐదువేల కోట్ల సెగ్మెంట్‌లో 68శాతం వృద్ధిని నమోదుచేస్తున్నట్లు తేలింది. ఐదువేల కోట్లకు పైబడి ఉన్న ఐపిఒలు 8 నుంచి 14శాతంగా ఉన్నాయి.

# నవంబరులో ఐఐపి 6.7% వృద్ధి

**న్యూఢిల్లీ, డిసెంబరు 29:** భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ నవంబరునెలలో రెండేళ్ల గరిష్ఠాన్ని తాకింది. 6.7శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. జిఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణ ఆర్డర్లుపెరగడం వంటి వాటితో ఐఐపి వృద్ధిని నమోదుచేసినట్లు తెలుస్తోంది. ఫ్యాక్టరీ ఉత్పత్తిపరంగాచూస్తే గత ఏడాది నవంబరు ఐదు శాతం మాత్రమే ఉంది. గతంలో అత్యధికంగా నవంబరు 2023లో 11.9శాతం నమోదు అయింది. పండుగలు, జిఎస్టీ రేట్లు కొన్ని వినియోగరంగ ఉత్పత్తులపై తగ్గడంతో డిమాండ్‌నుపెంచింది. వినియోగం కూడా పెరిగింది. దీనివల్లనే ఉత్పత్తిసూచీ మరింత ముందుకు దూకిందని ప్రభుత్వం చెపుతోంది. ఒకరకంగా పేరుకుపోయిన ఉత్పత్తిరంగ ఆండర్లన్నీ కూడా



జిఎస్టీ హేతుబద్ధీకరణతో మొత్తం కరిగిపోయాయి. ఈ ఏడాది సెప్టెంబరు 22నుంచి కూడా జిఎస్టీ రేట్లను శ్లాబ్‌లను క్రమ బద్ధీకరించిన సంగతి తెలిసిందే. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితినాయర్‌మాట్లాడుతూ అమెరికా సుంకాలు, జరిమానాలు కొన్ని ఉత్పత్తిరంగ విభా గాలపై ప్రభావంచూపించినా జిఎస్టీ రేట్‌కట్‌తో ఇవన్నీ తుడిచిపెట్టుకునిపోయినట్లు తెలిపారు. ఇక విద్యుత్ డిమాండ్ 2025 డిసెంబరులో పెరిగింది. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి గడచిన రెండునెలల్లోను పెరిగిందనే భావించాలి. ఇక డిసెంబరులో కూడా ఐఐపి వృద్ధి 3.5 నుంచి 5శాతంగా ఉండవచ్చని ఆమె అంచనావేసారు. అక్టోబరునెల ఐఐపి సూచీ వృద్ధిని 0.5శాతంగా కేంద్ర అర్థగణాంకశాఖ ప్రకటించింది. ఎన్ఎస్ఒ డేటా ప్రకారం నవంబరులో ఉత్పత్తిరంగ తయారీ 8శాతంపెరిగింది. మైనింగ్ 5.4శాతం, విద్యుత్ ఉత్పత్తి మాత్రం 4.4శాతంగా మాత్రమే ఉంది. ఇక ఏప్రిల్ నవంబరు మధ్యకాలంలో పారిశ్రామిక ఉత్పత్తి సమిష్టిగా చూస్తే 4.1నుంచి 3.3శాతానికి తగ్గింది. ఉత్పత్తిరంగంలో 8శాతం వృద్ధివల్లనే ఐఐపి వార్షిక పద్ధతిలో నవంబరు నెలకుగాను 6.7శాతం వృద్ధిని రాబట్టిందని ఎన్ఎస్ఒ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.